ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY




తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
క్రొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శనివారం 26 సెప్టెంబర్ 2026 | Saturday 26 Septembar 2026 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 163 | Vol.No 28 Issue No .163 | www.visionandhra.in

# కేరళలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్-2026 అవార్డు

- రైతులు, బీసీలు, సామాన్యుల సంక్షేమానికి గుర్తింపుగా అభివర్ణించిన రేవంత్
- దేశ రాజకీయాల్లో మార్పు కేరళ నుంచే షురూ అవుతుందన్న సీఎం
- ఆ మార్పే దేశమంతా తుపానుగా మారాలని పిలుపు... రాహుల్ గాంధీ నాయకత్వంపై విశ్వాసం
- ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకోవడం గౌరవంగా ఉంది: సీఎం రేవంత్ రెడ్డి
- సంఘ్ పరివార్ దేశాన్ని విభజిస్తోంది... గాంధీ పరివార్ భారత ఐక్యతకు కృషి అంటూ వ్యాఖ్యలు



నిలంబూర్: తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి కేరళలో ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు' లభించింది. కేరళలోని నిలంబూరులో శుక్రవారం జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆ





పురస్కారాన్ని రేవంత్ స్వీకరించారు. కాంగ్రెస్ అగ్రనేత, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్... సీఎం రేవంత్‌రెడ్డికి అవార్డును ప్రదానం చేశారు. కేరళ దిగ్గజ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. ఈ అవార్డు కింద రూ.లక్ష నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. రైతులు, వెనుకబడిన వర్గాలు, ఇతర సామాజిక వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, సీఎం రేవంత్ రెడ్డి దూర దృష్టితో కూడిన నాయకత్వాన్ని గుర్తిస్తూ సీఎం రేవంత్ రెడ్డిని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. ప్రజాస్వామ్య విలువల పట్ల రేవంత్‌రెడ్డి చూపుతున్న నిబద్ధతను కూడా అవార్డు ఎంపిక కమిటీ ప్రశంసించినట్లు వెల్లడించారు. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా, కేరళలోని నాలుగు వేర్వేరు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన ఆర్యదాన్ ముహమ్మద్ ప్రజాసేవ, లౌకిక మిగతా 2లో..

## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...

*ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం*

- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక



హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య మిగతా 2లో..

## పుస్తక పఠనంతోనే విజ్ఞానం, వికాసం

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



నిజామాబాద్ సెప్టెంబర్25:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో శుక్రవారం పట్టణంలోని ఆర్పీ రోడ్‌లో ఉన్న బాపూజీ వాచనాలయంలో విద్యార్థులకు కాంగ్రెస్ నేత రత్నాకర్ ఆధ్వర్యంలో కుర్చీలను పంపిణీ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌కు పుస్తక పఠనం ఎంతో అవసరమని అన్నారు. మారుతున్న మిగతా 2లో..

## మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడీ సమన్లు

*- రూ.842 కోట్ల స్కాంలో విచారణకు రావాలని ఆదేశం*



తెలంగాణ స్టేట్ బ్యూరో,విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 25: తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేగింది. మిగతా 2లో..

## అన్నప్రసాద ఆత్మీయత సేవలో మానవత్వం



- గణేష్ నిమజ్జన శోభాయాత్రలో వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ
- అభయ్ జైన్ ఆధ్వర్యంలో ఏళ్లుగా కొనసాగుతున్న సేవా కార్యక్రమాలు

మిగతా 2లో..

హైదరాబాద్ 25 (విజన్ ఆంధ్ర)
గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా భక్తిశ్రద్ధల మధ్య మానవతా సేవలు కొనసాగాయి, సద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో అభయ్ జైన్ నేతృత్వంలో

## కేసులను ఎదిరించి కష్టాల్లో నిలిచి జూబ్లీహిల్స్ హీరోగా నవీన్!

*విజన్ ఆంధ్ర - ప్రత్యేక కథనం...*



తెలంగాణ స్టేట్ బ్యూరో, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇప్పుడు కొత్త శకం మొదలైంది. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నవీన్ యాదవ్ చేస్తున్న పనితీరు, ఆయన సేవా కార్యక్రమాలు నియోజకవర్గ ప్రజల్లో పెద్ద చర్చగా మారాయి. రాజకీయం అంటే కేవలం ఎన్నికల సమయంలో కనిపించడం కాదు, ప్రజల కష్టసుఖాల్లో తోడుండటమని ఆయన నిరూపిస్తున్నారు.



తల్లిని కొడుకులు పట్టించుకోవట్లేదని ఎమ్మెల్యే నవీన్‌కు వివరిస్తున్న కూతురు...



ఎమ్మెల్యే గా నవీన్ యాదవ్ బంజారాహిల్స్ గడ్డపై చేసిన ఒక మహా కార్యక్రమం ఆయనకు 'మేనమామ' అనే బిరుదును తెచ్చిపెట్టింది. ఒకే వేదికపై 2000 మంది పేద గర్భిణీ మహిళలకు సీమంతం, 200 మంది మిగతా 2లో..

## టోరెంట్, వెల్ స్పన్, ఆస్ట్రల్.. అహ్మదాబాద్‌లో రెండో రోజు కూడా నారా లోకేశ్ బిజీబిజీ

- అహ్మదాబాద్ పర్యటనలో పారిశ్రామిక దిగ్గజాలతో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు
- క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం ఏపీని ఎంచుకోవాలని టోరెంట్ గ్రూప్‌కు పిలుపు
- విశాఖలో టైర్ల తయారీ, డేటా సెంటర్ల ఏర్పాటుపై పలు సంస్థలతో కీలక చర్చలు
- కాకినాడ, నెల్లూరులలో ఇండస్ట్రియల్ పార్కులు, రిఫైనరీలు స్థాపించాలని విజ్ఞప్తి
- లోకేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించిన కంపెనీలు



అహ్మదాబాద్ : ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విస్తృత పర్యటనలు కొనసాగిస్తున్నారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ టూర్‌లో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఆయన పలు పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా ఏడు ప్రముఖ సంస్థల అధిపతులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. క్లీన్ ఎనర్జీ, ఫార్మా, టెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్లు, తయారీ వంటి కీలక రంగాల్లో ఏపీలో ఉన్న అవకాశాలను వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను తెలియజేసి, పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. లోకేశ్ ప్రతిపాదనలపై కంపెనీల ప్రతినిధులు సానుకూలంగా స్పందించి, వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

క్లీన్ ఎనర్జీలో ఏపీని ఎంచుకోండి: టోరెంట్ గ్రూప్‌తో లోకేశ్

ఫార్మా, పవర్ రంగాల్లో అగ్రగామిగా ఉన్న టోరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతా, ఇతర డైరక్టర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. మిగతా 2లో..

## నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు

37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం

- విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్
- రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న నాదెండ్ల
- ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడి



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని మిగతా 2లో..

## ఏపీలో వర్ష బీభత్సం..

*అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు*

- తీవ్ర వాయుగుండం వల్ల రాష్ట్రంలో పంట నష్టంపై తక్షణ అంచనాకు ఆదేశం
- రైతులకు సాంకేతిక సలహాలు అందించి అండగా నిలవాలని స్పష్టం



అమరావతి : తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్టు ఏపీ మిగతా 2లో..

## నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు

నవంబర్ 1న ప్రారంభించను న్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో పౌరసరఫరాల శాఖ నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడిన ఆయన, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు, రవాణా, మిల్లింగ్ ప్రక్రియకు సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. సేకరణ ప్రక్రియ కోసం 24 వేల మంది సిబ్బందిని నియమించగా, కల్లాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడించారు. ఈసారి రైతులకు రవాణా ఖర్చులు కూడా చెల్లించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా పంట దిగుబడులు, తద్వారా ధాన్యం సేకరణ అంచనాలు తగ్గినట్లు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అయినప్పటికీ, రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా సకాలంలో కొనుగోలు చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రవాణా, గోనె సంచుల సరఫరా, మిల్లుల సామర్థ్యం, చెల్లింపుల ప్రక్రియ వంటి అంశాల్లో పౌరసరఫరాల శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలను భాగస్వామ్యం చేసేందుకే ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన తర్వాత చెల్లింపులు ఆలస్యం కాకుండా ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు.

## ఏపీలో వర్ష బీభత్సం..

వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. దెబ్బతిన్న రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేసినట్టు ఆయన వెల్లడించారు. క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఆయన ఉన్నతాధికారులతో శుక్రవారం ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బూడితి రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో పాటు పార్వతీపురం మన్యం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టంపై వెంటనే క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించి, వివరాల నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు. పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, అధిక తేమ వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించి, వారిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా దెబ్బతిన్న ముఖ్యమైన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను సమీక్షించాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీటిని సాధ్యమైనంత మేర సంరక్షించుకోవాలని మంత్రి సూచించారు. పంటలకు హాని కలిగించే చోట నీటిని తొలగిస్తూనే, చెరువులు, జలాశయాలు, ఇతర నీటి వనరుల్లో నీటిని నిల్వ చేసి భవిష్యత్తు సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు, ప్రజలకు నిరంతర సహాయం అందించాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు.

## మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడీ సమన్లు

శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేసింది. సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌పై నమోదైన మనీలాండరింగ్ కేసులో భాగంగా సెప్టెంబర్ 27వ తేదీన విచారణకు హాజరు కావాలని ఈడీ ఆదేశించింది. సాహితి ఇన్‌ఫ్రా సంస్థ ఫ్లాట్లు, విల్లాలు నిర్మిస్తామని చెప్పి ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో కొనుగోలుదారుల నుంచి భారీగా నిధులు వసూలు చేసి మోసం చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయలేదంటూ కొనుగోలుదారులు తెలంగాణ పోలీసులకు ఫిర్యాదులు చేయగా, ఆ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. తొలుత ఈ మోసం విలువ రూ.248 కోట్లుగా అంచనా వేయగా తదుపరి దర్యాప్తులో మోసం విలువ సుమారు రూ.842 కోట్లకు చేరినట్లు ఈడీ అంచనా వేసింది. నిధులను సంస్థ ఎండీ బి. లక్ష్మీనారాయణ, మాజీ డైరెక్టర్ సందు పూర్ణచంద్రరావు తమ సొంత మరియు కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించినట్లు, బినామీ పేర్లతో ఆస్తులు కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. దాదాపు రూ.126 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈ కేసులో కీలక మలుపుగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బ్యాంక్ ఖాతాల ద్వారా సాహితి ఇన్‌ఫ్రా నుంచి రూ.2.1 కోట్లు మళ్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ రూ.2.1 కోట్ల లావాదేవీల స్వభావం, ఉద్దేశంపై ఈడీ ఆరా తీస్తోంది. మనీలాండరింగ్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న ఆస్తులపై కూడా ఈడీ దృష్టి పెట్టింది. ఇప్పటివరకు ఈ కేసులో 56 బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేయగా, గతంలో రూ.161 కోట్ల విలువైన ఆస్తులను, మరో విడతలో రూ.12.6 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. సంస్థ ప్రకటనల్లో కనిపించిన నటుడు జగపతిబాబును సైతం సాక్షిగా విచారించిన ఈడీ, సంస్థ ఎండీ లక్ష్మీనారాయణను 2024 సెప్టెంబర్‌లో అరెస్ట్ చేసింది. సెప్టెంబర్ 27న జరిగే విచారణ తర్వాత ఈ కేసు మరింత కీలక మలుపు తిరగనుంది.

## అన్నప్రసాద ఆత్మీయత సేవలో మానవత్వం

వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఉదయం నుంచి రాత్రి వరకు శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు సేవా కార్యకర్తలు ఆప్యాయంగా అన్న ప్రసాదాన్ని అందించారు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు, శోభాయాత్ర సాగుతున్నంత సేపు నిరంతరంగా అన్న ప్రసాదాన్ని అందించారు, ఆకలితో ఉన్న వారికి ఆహారం అందిస్తూ సేవా భావాన్ని చాటుకున్నారు. కార్యక్రమానికి భక్తులు, స్థానికుల నుంచి అభినందనలు లభించాయి.

**ఏళ్లుగా సేవా బాటలో అభయ్ జైన్:**

అభయ్ జైన్ ఆధ్వర్యంలో సద్గురు సేవా సమితి ద్వారా గత కొన్నేళ్లుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగు తున్నాయి, అన్నదానంతో పాటు పేద విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామగ్రి అందించడం, అవసరమైన వారికి వైద్య సహాయం, ఆసుపత్రి సేవల్లో తోడ్పాటు, రక్తదాన కార్యక్రమాలు నిర్వహించడం వంటి సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు.

**20 లక్షల ఆర్థిక సాయం:**

క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ నిరుపేద వ్యక్తికి ఇటీవల రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదురైన సమయంలో అందించిన సహాయం బాధిత కుటుంబానికి అండగా నిలిచిందని పేర్కొన్నారు.

**మానవసేవే మాధవసేవ అభయ్ జైన్:**

మానవసేవే మాధవసేవ అనే భావనతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నాం. ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడంతో పాటు సమాజంలో సేవా భావాన్ని విస్తరించడమే మా లక్ష్యం. ఈ సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయి అని అభయ్ జైన్ తెలిపారు, సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న అభయ్ జైన్‌ను పలువురు అభినందించారు

## పుస్తక పఠనంతోనే విజ్ఞానం, వికాసం

కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పట్టణంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన లైబ్రరీలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి చెప్పినట్లుగా ప్రస్తుతం అరచేతిలోనే ప్రపంచాన్ని చూసే పరిస్థితి వచ్చిందని, స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా యువతపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయని పేర్కొన్నారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకుంటూనే విద్యార్థులు పుస్తక పఠనానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. యువతకు లైబ్రరీల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ముఖ్యంగా కాలేజీ విద్యార్థులు లైబ్రరీ మెంబర్‌షిప్ తీసుకుని పుస్తక పఠనాన్ని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, బాపూజీ వాచనాలయం అధ్యక్షుడు భక్తవత్సలం, నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాజారెడ్డి, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కేసులను ఎదిరించి కష్టాల్లో నిలిచి జూబ్లీహిల్స్ హీరోగా నవీన్!

చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. 14 ప్రైవేట్ ఆస్పత్రుల సహకారంతో పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ, ప్రతి తల్లికి సారె, చీరలు, పోషకాహార కిట్లు, నిత్యావసర సరుకులు, పుట్టబోయే బిడ్డకు బంగారం, వెండి పట్టీలు అందజేసి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు హాజరై అభినందించారు.
ఉప ఎన్నిక ముందు జరిగిన రాజకీయ పరిణామాల్లో ఆయనపై అనేక తప్పుడు కేసులు, ఆరోపణలు వచ్చాయి. ఒకే సంవత్సరంలో తనపై, తన కుటుంబ సభ్యులపై, అనుచరులపై 20 నుంచి 30 తప్పుడు కేసులు పెట్టారని, తనను రౌడీగా చిత్రీకరించే కుట్ర జరిగిందని నవీన్ యాదవ్ బహిరంగంగానే చెప్పారు. "నా మీద పెట్టిన కేసులు నిజమైతే నేను హైదరాబాద్ విడిచి వెళ్తా, లేదంటే ఆరోపణలు చేసిన వాళ్లు రాజకీయాల నుంచి తప్పుకుంటారా?" అని బహిరంగ సవాల్ విసిరి తన నిజాయితీని నిరూపించుకున్నారు. న్యాయవ్యవస్థపై నమ్మకంతో పోరాడి నిలబడ్డారు. ప్రచార రథాన్ని తగులబెట్టే ప్రయత్నం జరిగినా, ఆయన వెనక్కి తగ్గలేదు.
ఈ పోరాటం, ఈ సేవా గుణమే ఆయన్ను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గెలిపించాయి. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నవీన్ యాదవ్ పనితీరు మరింత వేగవంతమైంది.

**ఈ మధ్య జరిగిన మానవతా ఘటన**

**- ఎమ్మెల్యేపై నమ్మకాన్ని మరింత పెంచింది**

రీసెంట్‌గా జూబ్లీహిల్స్ పరిధిలో ఒక హృదయ విదారక ఘటన జరిగింది. అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన ఒక వృద్ధ తల్లిని ఆస్తి గొడవల కారణంగా కొడుకులు పట్టించుకోలేదు. ఆ తల్లి ఆసుపత్రిలోనే ఉండిపోయింది. దిక్కుతోచని స్థితిలో ఆ తల్లి కూతురు నేరుగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ వద్దకు వచ్చి తన గోడును వెళ్లబోసుకుంది.
వెంటనే స్పందించిన నవీన్ యాదవ్, ఆ కొడుకులను పిలిపించి మాట్లాడారు. "ఆస్తులు ముఖ్యం కాదు, కన్నతల్లి ముఖ్యం. ఆస్తి పోతే మళ్లీ వస్తుంది, తల్లి పోతే మళ్లీ రాదు" అని హితబోధ చేశారు. వెంటనే హాస్పిటల్ నుంచి తల్లిని డిశ్చార్జ్ చేయించి, ఇంటికి తీసుకెళ్లి మంచిగా చూసుకోవాలని గట్టిగా చెప్పారు. ఎమ్మెల్యే మాటతో ఆ కొడుకులు తమ తప్పు తెలుసుకుని తల్లిని ఇంటికి తీసుకెళ్లారు. ఈ ఒక్క ఘటన నవీన్ యాదవ్ కేవలం ఎమ్మెల్యే మాత్రమే కాదు, కుటుంబ పెద్దగా కూడా ఆలోచిస్తారని నిరూపించింది.

**ఎమ్మెల్యేగా హైలైట్ పనులు:**

1. బస్తీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బోరబండ, ఎర్రగడ్డ, రహమత్ నగర్, వెంగళరావు నగర్ బస్తీల్లో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తాగునీటి సమస్య, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాల సమస్యలను అధికారులను స్వయంగా వెంట తీసుకెళ్లి పరిష్కరిస్తున్నారు. రోజూ పాదయాత్ర చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారు.
2. 24 గంటలు అందుబాటులో: ఫోన్ చేస్తే పలికే నేతగా, ఎప్పుడు కావాలంటే అప్పుడు కలిసే ఎమ్మెల్యేగా ఆయనకు పేరు వచ్చింది. నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లో 'మేనమామ చేయూత' పేరుతో నిరంతర సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు.
3. యువత, మహిళలకు భరోసా: యువతకు ఉపాధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నారు. గతంలో 14 ఆస్పత్రులతో మొదలుపెట్టిన ఉచిత వైద్య సేవను ఇప్పుడు నియోజకవర్గం మొత్తానికి విస్తరించారు.

అందుకే జూబ్లీహిల్స్ ప్రజలు ఇప్పుడు ఒకే మాట చెబుతున్నారు – "మాకు కావాల్సింది హామీలు ఇచ్చే నేత కాదు, సీమంతం చేసి ఆప్యాయత పంచే మేనమామ, కష్టంలో అండగా నిలిచే అన్న. ఆ నమ్మకం నవీన్ యాదవ్‌లోనే కనిపిస్తోంది".

# కేరళలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్-2026 అవార్డు

విలువలు, సామాన్యుల సంక్షేమం పట్ల నిబద్ధతతో పనిచేసిన నాయకుడిగా కేరళలో గుర్తింపు పొందారు. ఆయన నాలుగో వర్ధంతి సందర్భంగా ఈ అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా, ఈ కార్యక్రమంలో కే.సీ. వేణుగోపాల్ ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ఆర్యదాన్ ముహమ్మద్ సేవలను గుర్తు చేసుకున్నారు. ఐదు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌కు సేవలందించిన ఆయన కేరళ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని గుర్తు చేశారు. నీలాంబూర్‌తో పాటు కేరళలో కాంగ్రెస్ పార్టీకి ఆయన ఒక బలమైన శక్తిగా నిలిచారని అన్నారు. ఆర్యదాన్ ముహమ్మద్ పేరుతో ఏర్పాటు చేసిన అవార్డును అందుకోవడం తనకు ఎంతో గౌరవంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. కేరళ వెలుపల నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన తొలి వ్యక్తిగా నిలవడం మరింత ప్రత్యేకమని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తగా, రాహుల్‌గాంధీ నాయకత్వంలోని బృందంలో ఒక కార్యకర్తగా తాను ఈ అవార్డును స్వీకరిస్తున్నానని చెప్పారు. కేరళకు రావడం తనకు ఎప్పుడూ సంతోషంగా ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో చేపట్టిన భారత్ జోడో యాత్ర సమయంలోనూ, కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ ఇక్కడికి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిసారీ కేరళ ప్రజలు తనకు ఆత్మీయ స్వాగతం పలికారని చెప్పారు. లౌకికవాదానికి అండగా నిలుస్తూ కాంగ్రెస్, ఆ పార్టీ నాయకులకు మద్దతు ఇస్తున్న కేరళ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**'కేరళ రాజకీయ గాలి... యావత్ దేశాన్నే ప్రభావితం చేస్తుంది'**

దేశవ్యాప్తంగా సంఘ్ పరివార్ సారథ్యంలోని బీజేపీప్రభుత్వం భారతాన్ని మతం పేరిట విభజిస్తోందపి... గాంధీ పరివార్ మాత్రం భారత ఐక్యతకు కృషి చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. భారత ఆత్మ(ఐడియా ఆఫ్ ఇండియా)కు రాహుల్ గాంధీ దేశమంతా తిరుగుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక కేరళ రాజకీయాలకు దేశ రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. వాతావరణ నిపుణులు రుతుపవనాల కోసం కేరళ వైపు ఎలా చూస్తారో... దేశ రాజకీయాలను అర్థం చేసుకునే విషయంలోనూ కేరళను ఒక సంకేతంగా చూడవచ్చని అన్నారు. కేరళలో చోటుచేసుకున్న పలు రాజకీయ పరిణామాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. 1991లో కేరళలో కరుణాకరన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పీవీ నరసింహా రావు ప్రధానమంత్రి అయ్యారని, 1996లో కేరళలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఢిల్లీలో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయిందని గుర్తు చేశారు. 2001లో ఏకే ఆంటోనీ ముఖ్యమంత్రి కాగా, 2004లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్నారు. 2026లో కేరళలో కాంగ్రెస్ మళ్లీ విజయం సాధించడంతో కొత్త రాజకీయ గాలి మొదలైందని రేవంత్ రెడ్డి అన్నారు. "కేరళ నుంచి మొదలైన ఈ గాలి దేశమంతా తుపానుగా మారాలి" అని పిలుపునిచ్చారు.

**స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం కోసం పోరాటం**

ఆర్యదాన్ ముహమ్మద్ తన జీవితాంతం స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పని చేశారని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం దేశంలో మతతత్వ శక్తుల నుంచి ప్రమాదం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీపై తీవ్ర రాజకీయ విమర్శలు చేశారు. స్వేచ్ఛ, లౌకికవాదం, రాజ్యాంగ విలువలను కాపాడటమే ఆర్యదాన్ ముహమ్మద్‌కు నిజమైన నివాళి అని అన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను, ఓటు హక్కును పరిరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**'ఓటు హక్కును కాపాడాలి'**

దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, ఎన్నికల గుర్తుల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతున్నాయంటూ తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్రంలోని అధికార బీజేపీ ప్రభుత్వాన్ని పరోక్షంగా ఆరోపించారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఓటు హక్కును కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. కేరళను దేశ రాజకీయాలకు 'బెల్‌వెదర్'(మార్పుకు ఒక సూచి) రాష్ట్రంగా అభివర్ణిస్తూ.. ఇక్కడ మొదలైన కాంగ్రెస్ గాలి దేశంలోని ప్రతి రాష్ట్రానికీ విస్తరించాలని ఆకాంక్షించారు. "కేరళ నుంచి మొదలైన కాంగ్రెస్ గాలిని దేశవ్యాప్తంగా తుపానుగా మార్చాలి" అని పిలుపునిచ్చారు.
'రాహుల్‌గాంధీ ప్రధాని కావాలి, అదే నా లక్ష్యం' సీఎం రేవంత్
ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు దేశం కోసం ప్రాణత్యాగం చేశారని రేవంత్‌రెడ్డి అన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు అధికారాన్ని, పదవులను త్యజించారని చెప్పారు. ఇప్పుడు చరిత్ర పిలుస్తోందని, రాహుల్‌గాంధీ దేశానికి ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు కేరళ నుంచి పార్లమెంట్‌కు ఎన్నిక కావడం తనకు ఈ రాష్ట్రంతో మరింత అనుబంధాన్ని కల్పించిందని చెప్పారు. తనకు వ్యక్తిగత రాజకీయ ఆశలు లేవని, 2006లో క్షేత్రస్థాయి నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించానని వివరించారు.
గత రెండు దశాబ్దాల్లో జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వంటి వివిధ పదవులను చూశానని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. "ఇక నా ముందున్న ఏకైక లక్ష్యం రాహుల్‌గాంధీని భారత ప్రధానమంత్రిగా చూడటం" అని స్పష్టం చేశారు. కేరళలో మొదలైన రాజకీయ మార్పు గాలిని దేశంలోని ప్రతి ఇంటికి, ప్రతి వీధికి, ప్రతి గ్రామానికి, ప్రతి నగరానికి, ప్రతి రాష్ట్రానికి తీసుకెళ్లాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా మార్పు గాలులు వీస్తున్నాయని, రాహుల్ గాంధీ ఆశాభావ సందేశం ప్రజల్లోకి వెళ్తోందని అన్నారు. మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడే వరకు రాహుల్ గాంధీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

**రేవంత్ వ్యాఖ్యలపై సర్వత్రా చర్చ**

కేరళలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్నాయి. రాహుల్ గాంధీ నాయకత్వం, రాజ్యాంగ పరిరక్షణ, లౌకికవాదం, ఓటు హక్కు వంటి అంశాలను కేంద్రంగా చేసుకుని ప్రతిపక్ష రాజకీయాన్ని బలోపేతం చేయాలన్న కాంగ్రెస్ ప్రయత్నాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి కూడా కీలకంగా స్వరం వినిపిస్తున్నారు. ఇటీవలి కాలంలో రేవంత్ రెడ్డి జాతీయ రాజకీయ అంశాలపై వరుసగా స్పందిస్తున్నారు. యువతకు రాజకీయాల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన జూలైలో డిమాండ్ చేశారు. అలాగే సెప్టెంబర్‌లో కేంద్ర రాజకీయాలపై కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో... సంక్షేమం, సామాజిక న్యాయం, రైతులు, బీసీలు, ప్రజా సంక్షేమం అంశాలను తన పాలనా రాజకీయానికి ప్రధానంగా చూపుతోంది. అదే సమయంలో బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు హామీల అమలుపై విమర్శలు చేస్తోంది. దీంతో రాష్ట్ర రాజకీయ పోరాటం కొనసాగుతున్న వేళ... కేరళలో రేవంత్‌రెడ్డికి లభించిన ఈ అవార్డు ఆయన జాతీయ స్థాయి రాజకీయ ప్రొఫైల్‌కు మరో ప్రస్తావనగా మారింది.

**కేరళ వేదికగా తెలంగాణ పాలనకు గుర్తింపు**

ఆర్యదాన్ ముహమ్మద్ పేరుతో ఏర్పాటు చేసిన పురస్కారం కేరళ వెలుపల నుంచి ఎంపికైన రేవంత్‌రెడ్డికి దక్కడం రెండు రాష్ట్రాల రాజకీయ సంబంధాల దృష్ట్యా ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా రైతులు, వెనుకబడిన వర్గాలు, ఇతర సామాజిక వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను అవార్డు ఎంపికకు కారణాలుగా ఫౌండేషన్ పేర్కొనడం గమనార్హం. ఒక వైపు తెలంగాణలో పాలనపై ప్రతిపక్షాల దుష్ప్రచారం, మరోవైపు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు వస్తున్న ప్రశంసలు కొనసాగుతున్న సమయంలో ఈ అవార్డు రావడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

# టోరెంట్, వెల్ స్పన్, ఆస్ట్రల్.. అహ్మదాబాద్‌లో రెండో రోజు కూడా నారా లోకేశ్ బిజీబిజీ

రాష్ట్రంలోని ఫార్మా క్లస్టర్లలో ఏపీఐ, ఇంటర్మీడియట్ తయారీ సామర్థ్యాన్ని విస్తరించాలని కోరారు. ముఖ్యంగా, పునరుత్పాదక ఇంధన రంగంలో టోరెంట్ గ్రూప్ ప్రణాళికలను ప్రస్తావిస్తూ.. సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులకు ఏపీ అనువైనదని తెలిపారు. పంప్డ్-స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ వంటి క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సమీర్ మెహతా స్పందిస్తూ.. 2030 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడమే తమ లక్ష్యమని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తప్పక పరిశీలిస్తామని చెప్పారు.
కాకినాడలో ఇండస్ట్రియల్ పార్క్: వెల్ స్పన్ గ్రూప్‌కు ప్రతిపాదన
టెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాల రంగంలో ప్రసిద్ధిగాంచిన వెల్ స్పన్ వరల్డ్ గ్రూప్ సీఈఓ నితిన్ జైన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. గతంలో దావోస్‌లో సీఎం చంద్రబాబుతో జరిగిన చర్చల పురోగతిని సమీక్షించారు. విశాఖపట్నంలో వెల్స్‌పన్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. కాకినాడలో టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, పైపుల తయారీ, గ్రీన్ అమ్మోనియా యూనిట్లతో కూడిన ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నితిన్ జైన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కర్నూలు, కడపలో తమ సంస్థ 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును నిర్వహిస్తోందని, తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని తెలిపారు.
నెల్లూరులో ఆయిల్ రిఫైనరీలు: గోకుల్ ఆగ్రోతో చర్చలు
వంట నూనెల తయారీలో పేరొందిన గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ చైర్మన్ కనుభాయ్ ఠక్కర్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఇప్పటికే ఉన్న ప్లాంట్‌కు అదనంగా పామాయిల్, సోయాబీన్ ఆయిల్ రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై కనుభాయ్ ఠక్కర్ స్పందిస్తూ.. కృష్ణపట్నంలో తమ ప్లాంట్ 2024 నుంచి ఉత్పత్తి ప్రారంభించిందని, దక్షిణాది మార్కెట్ల కోసం విస్తరణ ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.
విశాఖలో టైర్ల తయారీ యూనిట్: చిరిపాల్ గ్రూప్‌కు ఆహ్వానం
టెక్స్‌టైల్స్, కెమికల్స్ రంగాల్లోని చిరిపాల్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ బ్రిజ్ మోహన్ చిరిపాల్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విశాఖపట్నం కనెక్టివిటీ, మౌలిక వసతులను వివరిస్తూ.. అక్కడ గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై బ్రిజ్ మోహన్ చిరిపాల్ స్పందిస్తూ.. ప్రస్తుతం తమకు పలు రాష్ట్రాల్లో తయారీ యూనిట్లు ఉన్నాయని, టైర్ల తయారీకి సంబంధించి ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని అన్నారు.
డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టండి: ఎస్టీ టెలీమీడియాతో లోకేశ్
డేటా సెంటర్ల దిగ్గజం ఎస్టీ టెలీమీడియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ జెనాతో లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నం డేటా సెంటర్ హబ్‌గా ఎదుగుతోందని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ముందుకు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. దీనిపై గౌతమ్ జెనా స్పందిస్తూ.. తమ సంస్థ కార్యకలాపాలను వివరించి, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని చెప్పారు.
విశాఖలో ప్రీ ఫ్యాబ్ కేంద్రం: ఈప్యాక్ గ్రూప్‌తో భేటీ
ప్రీ ఫ్యాబ్ నిర్మాణ రంగంలో పేరొందిన ఈప్యాక్ గ్రూప్ చైర్మన్ భజరంగ్ బోత్రాతో లోకేశ్ సమావేశమయ్యారు. డేటా సెంటర్ల నిర్మాణానికి అవసరమైన ప్రీ ఫ్యాబ్ నిర్మాణ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని కోరారు. భజరంగ్ బోత్రా మాట్లాడుతూ.. ఇప్పటికే శ్రీసిటీలో తమకు తయారీ యూనిట్లు ఉన్నాయని, విశాఖ ప్రతిపాదనను కూడా పరిశీలిస్తామని తెలిపారు.
పైపుల తయారీ కేంద్రం ఏర్పాటు చేయండి: ఆస్ట్రల్ పైప్స్‌తో సమావేశం
పైపుల తయారీలో అగ్రగామిగా ఉన్న ఆస్ట్రల్ పైప్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ అల్కేష్ పంచల్‌తో మంత్రి లోకేష్ చర్చలు జరిపారు. రాష్ట్రంలో నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున, కాకినాడ లేదా అనకాపల్లిలో పైపుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. అల్కేష్ పంచల్ స్పందిస్తూ.. తమకు దేశవ్యాప్తంగా విస్తృత నెట్‌వర్క్ ఉందని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...

హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.



విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# మలుపులు తిరుగుతున్న ఈసీ వ్యవహారం




ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియ భారత ఎన్నికల సంఘంలో తీవ్ర కలకలం రేపుతోంది. అర్హులైన ఓటర్ల పేరును జాబితా నుంచి తొలగించడం, అలాగే అధికారిక నిర్ణయాలలో పారదర్శకత లోపించడంపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత 10 నెలల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలు ఈసీ తీసుకున్న పలు నిర్ణయాలపై దాదాపు 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు కథనాలు వెలువడటంతో ఈ వివాదం మరింత ముదిరింది. సుప్రీంకోర్టు గతంలో పలు కేసుల్లో ఇచ్చిన తీర్పుల్ని ఉల్లంఘిస్తూ తీసుకున్న నిర్ణయాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కు కోర్టు ధిక్కార చర్యల ముప్పు పొంచి ఉంది. దేశవ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ సందర్భంగా ఎన్నికల సంఘంలో ఇతర కమిషనర్ల అంగీకారం లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జ్ఞానేష్.. అదే సమయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల్నీ బేఖాతరు చేశారు. తోటి కమిషనర్లు అభ్యంతరాలు చెబుతున్నా. పట్టించుకోకుండా కోర్టు తీర్పుల్ని ఉల్లంఘించిన వ్యవహారంలో సీఈసీ జ్ఞానేష్ పై కోర్టు ధిక్కార చర్యలకు రంగం సిద్ధమవుతోంది సీఈసీ జ్ఞానేష్ కుమార్ గతంలో సుప్రీంకోర్టు వివిధ సందర్భాల్లో ఇచ్చిన తీర్పుల్ని ఉల్లంఘించడం ద్వారా కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని, ఆయనపై క్రిమినల్ కోర్టు ధిక్కార చర్యల కోసం పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ అటార్నీ జనరల్ వెంకట రమణిని సుప్రీంకోర్టు లాయర్ బ్రజేష్ సింగ్ కోరారు. తాజాగా ఇండియన్ ఎక్స్ ప్రెస్ పరిశోధనాత్మక కథనంలో పేర్కొన్న విధంగా జ్ఞానేష్.. తోటి కమిషనర్ల కంటే ప్రత్యేకంగా భావిస్తూ, ఏకపక్షంగా తీసుకున్న కోర్టు ధిక్కార నిర్ణయాలపై సమీక్ష అవసరమని బ్రజేష్ సింగ్ తెలిపారు. ఓటర్ల తొలగింపును 'అనిధికారికమైనది, చట్టవిరుద్ధమైనది' అని కమిషనర్ సంధు లిఖితపూర్వకంగా పేర్కొనడం ఎన్నికల సంఘం అంతర్గత విభేదాలను బట్టబయలు చేసింది మామూలుగా లేదు! ఓటర్ల జాబితా ప్రక్రియ పరిమాణం ఈ చర్చను మరింత తీవ్రతరం చేసింది. ఎస్ఐఆర్ మూడో దశలో 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 6.15 కోట్ల మంది ఓటర్లు ముసాయిదా జాబితాల నుంచి మాయమయ్యారు. వీరిలో 4.52 కోట్ల మంది గైర్హాజరైనట్లు, 1.11 కోట్ల మంది మరణించినట్లు, 49.58 లక్షల మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు వర్గీకరించారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో ఓటర్ల సంఖ్య 36.08 కోట్ల నుంచి 29.93 కోట్లకు పడిపోయింది. 2024 లోక్‌సభ ఎన్నికల జాబితాతో పోలిస్తే ఇది నికరంగా 15.7 శాతం(దాదాపు 5.57 కోట్లు) తగ్గుదలను సూచిస్తోంది. అయితే తొలగించబడిన ప్రతి ఒక్కరూ అనర్హులు కాదని, అభ్యంతరాలు తెలిపి పేర్లను పునరుద్ధరించుకోవడానికి ఈసీ అవకాశం ఇచ్చినప్పటికీ.. పెద్ద ఎత్తున గైర్హాజరుగా వర్గీకరించబడటం అనుమానాలకు తావిస్తోంది. ఈ వివాదం ఇప్పుడు కేవలం ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీల మధ్యనే కాకుండా, ఓటర్ల మధ్య కూడా కొనసాగుతోంది. వన్ఇండియా నిర్వహించిన ఓ అభిప్రాయ సేకరణలో ఎస్ఐఆర్ ప్రక్రియపై స్థానికులు తీవ్ర భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో ఎన్నికల సంఘంపై నమ్మకం కోల్పోయామని కొందరు చెప్పగా.. మరికొందరు ఎన్నికల సంఘంపై తమ విశ్వాసం కొనసాగుతోందని, నకిలీ, వేరే చోటికి మారిన లేదా ఇతరత్రా అనర్హమైన పేర్లను తొలగించడానికి ఈ సవరణ అవసరమని తాము నమ్ముతున్నామని తెలిపారు. ఆటోడ్రైవర్ రాజన్న మాట్లాడుతూ.. పాత జాబితాలో ఉండి ప్రతిసారీ ఓటు హక్కును వినియోగించుకుంటున్న తమ కుటుంబంలోని నలుగురు పేర్లు కొత్త జాబితాలో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ పత్రాలు, ఫోటోలతో ఆఫీసుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందని.. రెక్కాడితే గానీ డొక్కాడని తమలాంటి వారికి ఈ ప్రక్రియ నరకంగా మారిందని వాపోయారు. అలాగే క్యాబ్ డ్రైవర్ నవీర్, మరో వ్యక్తి శంకర్‌లు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలోనే నివసిస్తున్నా తమ ఓటు హక్కు రద్దవ్వడంతో ఎన్నికల వ్యవస్థపైనే నమ్మకం పోయిందని ఆందోళన చెందారు అయితే ఈ ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థించే వారు కూడా లేకపోలేదు. నకిలీ ఓట్లను, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించడానికి ఇటువంటి సవరణలు అవసరమేనని బీజాపూర్?కు చెందిన శివానంద్ అభిప్రాయపడ్డారు. ప్రియ అనే యువతి మాట్లాడుతూ.. ఈ సవరణ అవసరమే అయినప్పటికీ సరైన పద్ధతిలో జరగాలని, బతికి ఉన్న తమ అమ్మమ్మ పేరును తొలగించి చనిపోయిన వారి పేర్లను జాబితాలో కొనసాగించడం నిర్వహణ లోపానికి నిదర్శనమని చెప్పారు. ఏది ఏమైనప్పటికీ.. లక్షలాది మంది ఓటు హక్కు కోల్పోవడం రాబోయే ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని.. నిష్పక్షమైన ఓటింగ్ ప్రక్రియ కోసం ఎన్నికల సంఘం వెంటనే పారదర్శక చర్యలు చేపట్టాలని ఓటర్లు కోరుతున్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ దీప్కే డెడ్ లైన్ పెట్టారు. దేశంలో అత్యున్నత విద్యాసంస్థ అయిన ఐఐటీలో మరో విద్యార్థి నిండు ప్రాణం బలైపోయి, విద్యార్థి లోకం నిరసన వ్యక్తం చేస్తోంది. అయితే ఆ విద్యార్థుల ఉద్యమాన్ని అసలు పట్టించుకోని ఈ జెన్ జీ దీప్కే రాజకీయ వివాదంలోకి మాత్రం పరుగెత్తుకు వచ్చేస్తున్నారు. విద్యాసంస్థల్లో ఒత్తిడి, యువత ఆత్మహత్యలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని మేధావులు, విద్యార్థి సంఘాలు గళమెత్తుతుంటే.. కాక్రోచ్ జనతా పార్టీ మాత్రం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పై ఆరోపణలు చేస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అది దేశద్రోహి అని.. జ్ఞానేష్ కుమార్ భారత ప్రజాస్వామ్యానికే పెనుముప్పుగా మారారు అంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న వాదనను వినిపిస్తూ మీడియా ముందుకు వచ్చారు. వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియను కాపాడాలంటే ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, రాబోయే 48 గంటల్లోగా తప్పుకోకపోతే దేశవ్యాప్తంగా భారీ ఎత్తున నిరసనలకు దిగుతామని దీప్కే అల్టిమేటం జారీ చేశారు అయితే ఇప్పుడు మళ్లీ.. ఓ కేంద్ర మంత్రిని రాజీనామా చేయించినట్లుగా సీఈసీని రాజీనామా చేయిస్తారా లేదా అన్నది వేచి చూడాలి.

## నిజామాబాద్ కలెక్టరేట్లో వినాయక నిమజ్జన శోభాయాత్రలో ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్. రమణ్ రెడ్డి




నిజామాబాద్ సెప్టెంబర్ 25:( విజన్ ఆంధ్ర ) వినాయక నిమజ్జనం సందర్భంగా నిజామాబాద్ కలెక్టరేట్లో శుక్రవారం నిజామాబాద్‌లో నిర్వహించిన ఘనమైన గణేష్ శోభాయాత్రలో ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్. రమణ్ రెడ్డి పాల్గొన్నారు. 11 రోజుల పాటు విఘ్నేశ్వరుడిని అత్యంత భక్తిశ్రద్ధలతో, కులమతాలకు అతీతంగా ఘనంగా పూజించి, ఈ రోజు అదే భక్తి భావంతో అంగరంగ వైభవంగా నిమజ్జనానికి వీడ్కోలు పలకడం ఎంతో ఆనందదాయకమని రమణ్ రెడ్డి తెలిపారు. ఆ గణనాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లవేళలా ఉండాలని, అందరి జీవితాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం, ఐశ్వర్యం నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్ రమణ్ రెడ్డి గారితో పాటు డిచ్‌పల్లి తహసీల్దార్ సతీష్ రెడ్డి, నిజామాబాద్ తహసీల్దార్ శ్రీధర్, ప్రభు, కార్తీక్ రెడ్డి, శ్రీకాంత్ తదితర రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

## MBBS విద్యార్థిని ప్రణతికి హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ రూ.50,000 ఆర్థిక సహాయం



నిజామాబాద్ సెప్టెంబర్25:( విజన్ ఆంధ్ర ) : కామారెడ్డి జిల్లా బిచ్కుందకు చెందిన కుమారి కుమ్మరి ప్రణతి ఇటీవల ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీలో వీదీదూ సీటు చదువుతున్నారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆమె వైద్య విద్యను కొనసాగించేందుకు హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ రూ. 50,000/- ఆర్థిక సహాయ కేంద్రం. ఈ సహాయాన్ని అడిషనల్ కలెక్టర్ (ఆర్డీ), నిజామాబాద్ మరియు తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ట్రెసా ప్రధాన కార్యదర్శి, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షులు ఎల్. రామన్ రెడ్డి సంయుక్తంగా చెక్కు రూపంలో. బిచ్కుంద తహసీల్దార్ వేణుగోపాల్ సూచనతో ఈ సహాయం అందించబడింది. ఈ సందర్భంగా ప్రణతి వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి, భవిష్యత్తులో సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఉన్నత విద్యకు అవసరమైన సమయంలో అండగా నిలవడం హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ లక్ష్యాలలో భాగమని రామన్ రెడ్డి తెలిపారు. హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం మరియు సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

## పేదల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం - ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి




తెలకపల్లి, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర) పేద ప్రజల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు మండల పరిధిలోని దాసుపల్లి రైతు వేదికలో శుక్రవారం కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలకు సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్తు,లాంటి సంక్షేమ పథకాలు అందజేస్తుందని తెలిపారు అదేవిధంగా కమ్మరెడ్డిపల్లిలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు చేయించారు ఈ కార్యక్రమంలో సర్పంచులు, కొమ్ము చంద్రశేఖర్, శ్రీదేవి, మమత,తహసిల్దార్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బండ పర్వతాలు,బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన రోడ్డు మధ్యలో గుంతలు,

**- పట్టించుకోని అధికారుల వైనం.**


రాజన్న సిరిసిల్ల : బోయిన్పల్లి మండల కేంద్రం నుంచి కొదురుపాక కు వెళ్లే బ్రిడ్జి సమీపాన పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడం వల్ల ప్రజలు ప్రమాదానికి గురి కావలసిన పరిస్థితి పాలకుల , అధికారుల,నిర్లక్ష్యానికి ఏర్పడుతుంది. రోడ్లు భవనాల శాఖ అధికారులు ఆఫీసులకే పరిమితమవుతూ రోడ్ల మరమ్మత్తులకు పరిష్కారము చేపట్టడంలో ప్రజల భద్రత పట్ల , ప్రజలంటే లెక్క లేకుండా,పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు ఈ నిర్లక్ష్యాన్ని సిపిఎం పార్టీగా పూర్తిగా ఖండించడం జరుగుతుంది. ప్రమాదాలు జరుగుతే దీనికి పూర్తి బాధ్యత రోడ్ల భవనాల శాఖ అధికారులే బాధ్యత వహించాలని తెలియజేస్తూ,తక్షణమే రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని ప్రజల పక్షాన మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్,అధికార యంత్రంగాన్ని డిమాండ్ చేయడం జరుగుతుంది.

# గులాబీ వ్యూహంతోనే కాంగ్రెస్...




హైదరాబాద్, సెప్టెంబర్ 25, : తెలంగాణలో మరోసారి హైవోల్టేజ్ రాజకీయం నడుస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీని వ్యూహాత్మకంగా దెబ్బతీసేందుకు, ఆ పార్టీ అగ్రనేతలను వారి సొంత గడ్డపైనే కట్టడి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పక్కా స్కెచ్ వేశారు. ఒకప్పుడు కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ ఇదే తరహా వ్యూహం అమలు చేసింది. ఇప్పుడు అదే వ్యూహాన్నే గులాబీ పార్టీపై అమలు చేసేందుకు సీఎం రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపై సీఎం రేవంత్ ప్రత్యేకంగా కన్నేశారు. ఈ వ్యూహంలో భాగంగా ప్రతిపక్ష ముఖ్య నేతలను ఉక్కిరిబిక్కిరి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ వరుస బహిరంగ సభలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మొదట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో ఈనెల 30న సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వచ్చేనెల రెండో వారంలో హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటలోనూ భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సర్వం సిద్ధమవుతోంది. ఈ రెండు నియోజకవర్గాల తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ టార్గెట్‌గా రేవంత్ రెడ్డి పావులు కదుపుతున్నారు. కేసీఆర్ అసైన్డ్ భూముల లెక్కలు, గత ప్రభుత్వ హయాంలోని భూ ఆక్రమణలపై స్పష్టమైన లెక్కలు తేలాక, గజ్వేల్‌లో బహిరంగ సభను నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ ప్లాన్ చేస్తోంది. ఈ మూడు నియోజకవర్గాల్లో ముందుగా స్థానిక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి, ఆ తర్వాత పూర్తిస్థాయిలో రాజకీయ వ్యూహాన్ని అమలు చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. కేవలం మాటల యుద్ధమే కాకుండా అభివృద్ధి పనులతో ప్రజల ముందుకు వెళ్లి, ఆపై ప్రత్యర్థులపై రాజకీయ దాడి పెంచాలనేది ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఈ మూడు నియోజకవర్గాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, బీఆర్ఎస్ అగ్రనేతలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు బలమైన కాంగ్రెస్ నేతలకు ఇక్కడ ప్రత్యేక బాధ్యతలు అప్పగించనున్నారు. అభివృద్ధి ఎజెండాతో మొదలై ఫైనల్‌గా పూర్తిస్థాయి రాజకీయ వ్యూహంతో ముగిసేలా ఈ ప్రణాళికను అమలు చేస్తున్నారు.

# సంక్షోభంలో విద్యుత్ రంగం



హైదరాబాద్, సెప్టెంబర్ 25, : తెలంగాణలో విద్యుత్ రంగం మరోమారు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలోని కీలకమైన థర్మల్ పవర్ స్టేషన్లలో తలెత్తిన బొగ్గు కొరత, జల విద్యుత్ ఉత్పత్తిలో మందగమనం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పెను సవాల్‌గా మారుతున్నాయి. ఎన్నికల హామీల అమలుతో పాటు పారిశ్రామిక, వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాల్సిన తరుణంలో ఈ పవర్ క్రైసిస్ సర్కార్‌కు తీవ్ర తలనొప్పిగా మారుతోంది.రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. మొత్తం 4వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్‌లో బొగ్గు నిల్వలు లేకపోవడంతో కేవలం 800 మెగావాట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అవుతోంది. దీనికి తోడు నాణ్యత లేని బొగ్గును వాడవలసి రావడం వల్ల ప్లాంట్‌లోని రెండు యూనిట్లలో తీవ్ర సాంకేతిక లోపాలు తలెత్తి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ నిబంధనల ప్రకారం.. ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ ఉత్పత్తి జరగాలంటే థర్మల్ ప్రాజెక్టులలో కనీసం 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండాలి. అయితే, యాదాద్రి ప్లాంట్‌లో ప్రస్తుతమున్న నిల్వలు కేవలం మూడు నుంచి నాలుగు రోజులకు మాత్రమే సరిపోతాయని అధికారిక వర్గాలు చెప్తున్నాయి. దీన్ని బట్టి పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ విధానాలపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. సింగరేణి కాలరీస్ వద్ద తగినంత బొగ్గు నిల్వలు, బ్లాకులు అందుబాటులో లేకపోయినప్పటికీ, కేవలం జీ9 గ్రేడ్ బొగ్గును మాత్రమే వినియోగించే టెక్నాలజీతో యాదాద్రి ప్లాంట్‌ను ఎందుకు నిర్మించారని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం తీసుకున్న ఈ నిర్ణయాల వల్లే రవాణా భారం పెరిగి, నేడు బొగ్గు కొరత ఏర్పడిందని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు.మహానది కోల్ కీలిమిటెడ్, కోల్ ఇండియా నుంచి అదనంగా 5 మిలియన్ టన్నుల బొగ్గును కేటాయించాల్సిందిగా ఆగస్టు నెలలోనే టీజీ జెన్కో కేంద్ర ప్రభుత్వానికి, కోల్ ఇండియాకు లేఖ రాసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని అధికారులు వెల్లడించారు. సెప్టెంబర్ చివరి నాటికి తగినంత బొగ్గును సమకూర్చుకోకపోతే మిగతా ప్రాజెక్టులు కూడా ఇదే దుస్థితిని ఎదుర్కొనే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలిసి తక్షణమే బొగ్గును కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. దసరా పండుగ నాటికి యాదాద్రి ప్లాంట్‌లో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని స్పష్టం చేశారుమరోవైపు ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనేందుకు రేవంత్ సర్కార్ దేశంలోని వివిధ బొగ్గు సరఫరా సంస్థలతో ముమ్మర చర్చలు జరుపుతోంది. ఏది ఏమైనప్పటికీ ఈ విద్యుత్ సంక్షోభాన్ని సమర్థవంతంగా అధిగమించడమే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకుంటుందనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారింది.

## ఎన్నికలకు సిద్ధమౌతున్న కమలం



హైదరాబాద్, సెప్టెంబర్ 25,: రాబోయే ఎమ్మెల్సీ, మున్సిపల్ ఎన్నికల పోరుకు బీజేపీ ఇప్పటినుంచే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రానున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు, 5 కీలక మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ సమాయత్తమవుతోంది. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశం పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సమావేశానికి ఆయా మున్సిపల్ కార్పొరేషన్లు, ఎమ్మెల్సీ పరిధిలోని కీలక నేతలు హాజరై భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు.రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్న వేళ, అర్బన్ ఓటర్లతో పాటు విద్యావంతులు, యువత బీజేపీ వైపు మొగ్గు చూపేలా పక్కా కార్యాచరణను పార్టీ సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో రెండు గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల్లో పార్టీ క్యాడర్‌ను పూర్తిస్థాయిలో రంగంలోకి దించడం, క్షేత్రస్థాయిలో పార్టీ పట్టును మరింత బిగించడంపై విస్తృతంగా చర్చించారు. ఓటరు నమోదు ప్రక్రియ నుంచి పోలింగ్ బూత్ స్థాయి వరకు సమన్వయ లోపం లేకుండా ఒక పక్కా వ్యూహంతో ముందుకు సాగాలని రాంచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేశారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ నాయకత్వం, కీలక నేతలకు బాధ్యతలు అప్పగించింది. వరంగల్- ఖమ్మం- నల్గొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికల బీజేపీ ఇన్‌ఛార్జ్‌గా ఎమ్మెల్సీ అంజిరెడ్డిని నియమించారు. హైదరాబాద్-మహబూబ్‌నగర్-రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా సీనియర్ నేత మల్క కొమురయ్య బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నియోజకవర్గాల్లో విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత సమస్యలను ప్రధాన ఎజెండాగా తీసుకుని పోరాటాలు చేయాలని నిర్ణయించారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి ఓటర్ల నమోదు అత్యంత కీలకమైన అంశం. దీన్ని గుర్తించిన బీజేపీ అధిష్ఠానం, ఈ నెల 27న హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపై రాష్ట్ర స్థాయి ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించనుంది. ఈ రాష్ట్ర స్థాయి సదస్సు ముగిసిన వెంటనే, సంబంధిత నియోజకవర్గాల పరిధిలో జిల్లాల వారీగా వర్క్‌షాప్‌లు నిర్వహించి, ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను ఉద్యమ రూపంలో చేపట్టాలని నిర్ణయించారు. కొత్తగా డిగ్రీ పూర్తి చేసిన యువతను, పట్టభద్రులను పెద్ద సంఖ్యలో ఓటర్లుగా చేర్పించడమే లక్ష్యంగా బూత్ స్థాయి కమిటీలకు టార్గెట్లు నిర్దేశించనున్నారు.మరోవైపు పట్టణ ప్రాంతాల్లో పార్టీకి ఉన్న బలమైన ఓటు బ్యాంకును మరింత పటిష్టం చేసుకునే దిశగా 5 మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల కోసం ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌లను బీజేపీ నియమించింది. ఈ 5 కార్పొరేషన్ల పరిధిలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక కమిటీలు దృష్టి సారించనున్నాయి. వార్డు, డివిజన్, బూత్ స్థాయి కమిటీల పునర్వ్యవస్థీకరణ, స్థానిక ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టడం, ప్రజలతో నిరంతరం మమేకమయ్యేలా కార్యక్రమాలు రూపొందించడం ఈ కమిటీల ప్రధాన బాధ్యత.రాష్ట్ర నాయకత్వం నుంచి కింది స్థాయి కార్యకర్త వరకు పూర్తి సమన్వయంతో కదం తొక్కితేనే ఆశించిన ఫలితాలు సాధించగలమని సమావేశంలో స్పష్టం చేశారు. ఎన్నికల సమయానికి కాకుండా, ముందుగానే ఇన్‌ఛార్జ్‌లను రంగంలోకి దించడం, వర్క్‌షాప్‌ల ద్వారా శ్రేణులకు దిశానిర్దేశం చేయడం చూస్తుంటే.. అటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవడంతో పాటు ఇటు 5 కార్పొరేషన్లలో బలమైన శక్తిగా ఎదిగేందుకు బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోందని స్పష్టమవుతోంది.

## రండి బిల్డ్ ఎక్స్పో 2026 సందర్శించండి

**- ఈనెల 25, 26 రెండు రోజులు ఎక్స్పో ఉంటుంది**

**- ఎసిసిఈ(ఐ) వరంగల్ క్రెడిట్ చైర్మన్ ఈఆర్. ఎర్ర అంబదాస్**




హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 ( విజన్ ఆంధ్ర ) : వరంగల్ బిల్డ్ ఎక్స్పో 2026 కన్స్ట్రక్షన్స్ అండ్ ఇంటీరియర్ ఫెయిర్ ములుగు రోడ్డు లోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్లో శుక్రవారం ఘనంగా జ్యోతి ప్రజ్వలను చేసి ఎసిసిఈ(ఐ) వరంగల్ క్రెడిట్ చైర్మన్ ఈఆర్. ఎర్ర అంబదాస్, సెక్రటరీ కొంగ మోహన్, కోశాధికారి సాంబరాజు లు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిర్మాణ సామాగ్రి నిర్మాణ సాంకేతికత ఇంటీరియర్ అండ్ గృహ పరిష్కరాల కోసం ఏర్పాటుచేసిన ఈ ఎక్స్పోకు ఇంజనీర్లు, బిల్డర్లు, ఆర్కిటెక్టు, కాంట్రాక్టర్లు, డెవలపర్లు, ఇంటీరియర్ డిజైనర్లు, గృహ యజమానులు, సాధన ప్రజలందరికీ ఉచితంగా ప్రవేశం ఉంటుందని, కాబట్టి అందరూ పాల్గొనాలని కోరారు. ముఖ్యంగా ప్రముఖ బ్రాండ్లు తయారీదారులను కలుసుకునే అవకాశం ఉందని, నూతన ఉత్పత్తుల నిర్మాణ సామాగ్రి సాంకేతికతలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం ఉంటుందని, వివిధ ఉత్పత్తులు పరిష్కారాలను ఒకదానికొకటి పోల్చి చూసే అవకాశం తో పాటు ఈ ఎగ్జిబిషన్ స్టాళ్లలో సందర్శించి, ప్రత్యక్ష ప్రదర్శన వీక్షించే అవకాశం తో పాటు నిర్మాణరంగం ఇంటీరియర్ వస్తువుల తాజా మార్పుల ట్రెండును తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

## తీవ్ర వాయుగుండం ఎఫెక్ట్..

**- జలదిగ్బంధంలో కళ్లికోట!**

**- నాలుగు రోజులుగా భారీ వర్షాలు.. విద్యుత్, రాకపోకలు బంద్**

పార్వతీపురం మన్యం : కోమరాడ మండలం కళ్లికోట గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టింది.గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గ్రామం చుట్టూ నీరు చేరడంతో.. ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు రాకపోకలు కూడా పూర్తిగా బంద్ అయ్యాయి.చుట్టూ నీరు.. మధ్యలో గ్రామం.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# విశాఖకు డబుల్ డెక్కర్ ట్రైన్

విశాఖపట్నం, సెప్టెంబర్ 25, : సాగర నగరం విశాఖపట్నం ప్రజా రవాణా




వ్యవస్థలో సరికొత్త విప్లవానికి తెరలేచింది. విశాఖ ప్రజలు ఎప్పటినుంచో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక విశాఖపట్నం డబుల్ డెక్కర్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ కు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలక పరిణామాన్ని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ స్వయంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించడంతో ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు మార్గం సుగమమైందని, త్వరలోనే క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. తీర నగరమైన విశాఖ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యాధునిక ఇంజనీరింగ్ ప్రమాణాలతో డిజైన్ చేశారు. ఒకే పిల్లర్‌పై దిగువన ఫ్లైఓవర్ రోడ్డు మార్గం, ఎగువన మెట్రో రైలు కారిడార్ వెళ్లేలా డబుల్ డెక్కర్ విధానాన్ని అమలు చేయనున్నారు. భూసేకరణ సమస్యలు, భారీ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు, ఇరుకైన కారిడార్లలో సాధారణ రోడ్డు రవాణా, ప్రజా రవాణా రెండింటికీ ఇది శాశ్వత పరిష్కారంగా నిలవనుంది. ఈ మెట్రో కారిడార్ ద్వారా నగరంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాలు, ఐటీ కారిడార్లు, విద్యా సంస్థలు, పోర్టు ప్రాంతం, ప్రతిపాదిత భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అనుసంధానానికి విస్తృతమైన లబ్ధి చేకూరనుంది. రోడ్డు ట్రాఫిక్ తీవ్రతను గణనీయంగా తగ్గించడంతో పాటు, సామాన్యులు, ఉద్యోగులు తక్కువ సమయంలో సురక్షితంగా, కాలుష్య రహితంగా ప్రయాణించేందుకు ఈ ప్రాజెక్ట్ అత్యంత కీలకం కానుంది. విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా, ఏపీ ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాలన్న కూటమి ప్రభుత్వ సంకల్పానికి కేంద్రం ఆమోదం మరింత వేగాన్ని చేకూర్చింది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో శరవేగంగా నిధుల సమీకరణ పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ మెట్రో ప్రాజెక్ట్ పూర్తితో వైజాగ్ రూపురేఖలు అంతర్జాతీయ స్థాయి మెట్రోపాలిటన్ నగరాల సరసన నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

# నలుగురు జెన్‌జీలకు కోటంరెడ్డి టిక్కెట్లు

నెల్లూరు, సెప్టెంబర్ 25, : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్,



స్థానిక సంస్థల ఎన్నికల్లో సరికొత్త నాయకత్వానికి బాటలు వేసే దిశగా అధికార కూటమి వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. రాజకీయాల్లో పేరుకుపోయిన సంప్రదాయ మూస ధోరణిని బద్దలు కొడుతూ, డిజిటల్ యుగంలో పెరిగిన జెన్ జీ యువతను ప్రత్యక్ష ప్రజా జీవితంలోకి ఆహ్వానించాలన్న సరికొత్త కాన్సెప్ట్‌ను తెరపైకి తెస్తోంది. తలలు పండిన తర్వాతే ప్రత్యక్ష ఎన్నికల్లోకి రావాలన్న పాతకాలపు నిబంధనలను పక్కనపెట్టి, సమాజం పట్ల బాధ్యత, సామాజిక చైతన్యం, యువ రక్తంలో ఉన్న ఫైర్‌ను గుర్తించి వారిని కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా నిలబెట్టేందుకు క్షేత్రస్థాయిలో కసరత్తు ముమ్మరం చేసింది. ఈ విప్లవాత్మక మార్పునకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీసుకున్న తాజా నిర్ణయం ఒక బలమైన నాందిగా నిలిచింది. తన నియోజకవర్గ పరిధిలోని నగరపాలక సంస్థ డివిజన్లలో నలుగురు యువ జెన్ జీ అభ్యర్థులకు టిక్కెట్లు కేటాయించడమే కాకుండా, వారి ఎన్నికల ఖర్చు మొత్తాన్ని తానే స్వయంగా భరిస్తానని ఆయన ప్రకటించడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. రాజకీయాలంటే కేవలం ధనబలం, కుల సమీకరణాలు, పాతతరం నేతలకే పరిమితం కాదనే స్పష్టమైన సందేశాన్ని ఇది ప్రజల్లోకి పంపింది. ఇదే మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కీలక నగరాలు, మేజర్ మున్సిపాలిటీల్లో అమలు చేసి, విద్యావంతులైన యువతను రాజకీయాల్లోకి లాగాలని కూటమి పెద్దలు భావిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో ఓటరు నాడిని పరిశీలిస్తే.. సాంకేతికత, ఆధునిక ఆలోచనలు, వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే నాయకత్వాన్నే నేటి తరం కోరుకుంటోంది. సోషల్ మీడియా ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చే యువతీయువకులు పాలనా వ్యవస్థలో భాగస్వాములయితే స్థానిక సంస్థల పనితీరు సమూలంగా మారుతుందని కూటమి విశ్లేషిస్తోంది. ఈ సరికొత్త ప్రయోగం వెనుక ఉన్న అసలు రాజకీయ లక్ష్యం భవిష్యత్ నాయకత్వ నిర్మాణం . టీడీపీ, జనసేన శ్రేణుల్లో రాబోయే రెండు మూడు దశాబ్దాల రాజకీయాలను శాసించగల బలమైన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాన్ని ఈ మున్సిపల్ పోరు నుంచే తయారు చేయాలని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో వార్డు, డివిజన్ స్థాయి నుంచే ప్రజలతో మమేకమై పనిచేసే నాయకులను తీర్చిదిద్దడం వల్ల పార్టీల సంస్థాగత పునాదులు మరింత పటిష్టమవుతాయని వారు గట్టిగా విశ్వసిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పార్టీల బలపరీక్షగానే కాకుండా.. సంప్రదాయ పాతతరం రాజకీయాలకు, ఆవేశం-ఆలోచన కలగలిసిన కొత్తతరం ఆలోచనలకు మధ్య జరిగే పరివర్తనగా మారనున్నాయి. యువతకు టిక్కెట్లు ఇవ్వడంతో పాటు వారిని గెలిపించుకోగలిగితే, ఏపీ రాజకీయాల్లో ఇదొక సువర్ణ అధ్యాయంగా మిగిలిపోనుంది. ఒకప్పుడు రాజకీయాలంటే భయపడి దూరంగా ఉన్న విద్యావంతులైన యువత, నేడు స్థానిక పాలనను తమ చేతుల్లోకి తీసుకునేందుకు సిద్ధమవుతుండటం రాష్ట్ర ప్రజాస్వామ్య వ్యవస్థకు శుభపరిణామం అవుతుందనడంలో సందేహం లేదు.

# జగన్ లో కొత్త ఆందోళన



విశాఖపట్టణం, సెప్టెంబర్ 25, : ఓటమి ఇచ్చిన గాయం కంటే, రానున్న రోజుల్లో చుట్టుముట్టబోయే చట్టపరమైన ఉచ్చులే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో ఆందోళనను రేకెత్తిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల ఆయన అడుగులు, ప్రసంగాలు, ఆకస్మిక కార్యాచరణలను నిశితంగా పరిశీలిస్తే ఆ అంతర్గత కంగారు స్పష్టంగా బయటపడుతోంది. నిరుద్యోగులను రెచ్చగొట్టేందుకు డీఎస్సీ క్రీడా కోటాపై ఆధారాల్లేని ఆరోపణలు గుప్పించడం, ఏ చిన్న అవకాశాన్ని వదలకుండా హుటాహుటిన రాజ్ భవన్‌కు పరుగులెత్తి గవర్నర్‌కు వినతిపత్రాలు సమర్పించడం వంటివి ఆయన కంగారును చూపిస్తున్నాయి. ఏపీలో గత ఐదేళ్ల పాలనలో సాగిన భారీ లిక్కర్ సిండికేట్ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శరవేగంగా పావులు కదుపుతోంది. ఢిల్లీ మద్యం కుంభకోణాన్ని మించిన రీతిలో సాగిన నగదు లావాదేవీలు, డిస్టిలరీల బెదిరింపులు, ప్రత్యేక బ్రాండ్ల ముసుగులో జరిగిన దోపిడీకి సంబంధించిన మనీ ట్రయల్స్ చిక్కుముడులను దర్యాప్తు సంస్థలు పక్కా ఆధారాలతో ఛేదించినట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. దర్యాప్తు పరిధి విస్తరిస్తున్న కొద్దీ తాడేపల్లి కీలక చక్రాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా, తెరవెనుక ఆర్థిక లావాదేవీలను పర్యవేక్షించినట్లు ప్రచారంలో ఉన్న ఆయన సమీప బంధువు అనిల్ రెడ్డి పాత్రపై దర్యాప్తు సంస్థల నిఘా మరింత కఠినతరమైంది. లిక్కర్ స్కామ్‌లో ముడుపుల సేకరణ, వాటిని హవాలా మార్గాల్లోకి మళ్లించడం వెనుక కీలక సూత్రధారిగా భావిస్తున్న అనిల్ రెడ్డిని ఈడీ ఏ క్షణమైనా అదుపులోకి తీసుకునే అవకాశముందన్న గుసగుసలు తారాస్థాయికి చేరాయి. ఒకసారి సూత్రధారులు పట్టుబడితే దర్యాప్తు సెగ నేరుగా అధినేత ద్వారాలనే తాకుతుందని జగన్‌కు స్పష్టంగా అర్థమైపోయింది. అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకవైపు మీడియా సమావేశాల్లో దూకుడు ప్రదర్శిస్తూనే, మరోవైపు తీవ్ర నైతిక రక్షణలోకి వెళ్లే పరిస్థితి తలెత్తింది. ఇదే సమయంలో ఆయన బెంగళూరు ప్యాలెస్ కేంద్రంగా సాగుతున్న రహస్య మంతనాలు సరికొత్త రాజకీయ చర్చకు తెరలేపాయి. తన ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ తరపున రాజ్యసభకు పంపిన రిలయన్స్ గ్రూప్ కీలక ప్రతినిధి పరిమళ్ నత్వానీ ఇటీవల బెంగళూరులో ఓ వివాహ వేడుకకు హాజరైనప్పుడు.. జగన్ ఆయనను ప్రత్యేకంగా తన నివాసానికి ఆహ్వానించి ఏకాంత చర్చలు జరిపారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో సత్సంబంధాలు, ఢిల్లీ రాజకీయాల్లో విస్తృత పలుకుబడి ఉన్న పరిమళ్ నత్వానీతో జగన్ ఏం మాట్లాడి ఉంటారనేది ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. కేసులు ముంచుకొస్తున్న వేళ ఢిల్లీ స్థాయిలో రాయబారాలు నడిపి రక్షణ పొందడానికే ఈ ఆకస్మిక లంచ్ డిప్లొమసీని ఉపయోగించుకున్నారు. ఒకవైపు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు, పోలవరం పనుల పునరుద్ధరణ, రాజధాని నిర్మాణాలతో ముందుకెళ్తుంటే.. మరోవైపు జగన్ మాత్రం పాత స్క్రిప్టులు వల్లెవేస్తూ, కల్పిత ఆరోపణలతో కాలం వెళ్లదీస్తున్నారు. పచ్చి అబద్ధాలతో ప్రజలను నమ్మించలేమని తెలిసినప్పటికీ, కేసుల నుంచి ప్రజా దృష్టిని మరల్చడానికి ఆయన చేస్తున్న ఈ ఆపసోపాలు సొంత కేడర్‌లోనే నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తున్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల దూకుడు, అనిల్ రెడ్డి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు, బెంగళూరు రహస్య భేటీలు.. ఇవన్నీ జగన్ రాజకీయ భవితవ్యం తీవ్ర సంక్షోభంలో పడిందనడానికి ప్రత్యక్ష నిదర్శనాలుగా నిలుస్తున్నాయివైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నేతలను పిలిపించుకుని ప్రసంగించారు. ఎప్పుడూ చెప్పే మాటలే చెప్పారు. కూటమి ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు గుప్పించడంతో పాటు.. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటినీ గతంలో తామే చేసేశామని, భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి అదానీ డేటా సెంటర్ దాకా అన్నీ తమ ఘనతేనంటూ ఆయన చెప్పుకున్నారు. విశాఖకు ఐటీ కంపెనీలను తరిమేసి, రుషికొండను బోడిగుండు చేసి విలాసవంతమైన ప్యాలెస్ నిర్మించుకున్న ఘన చరిత్రను ప్రజలు ఇంకా మరువకముందే.. తానేదో నగరాన్ని ఉద్ధరించేశానని జగన్ చెప్పుకోవడం విడ్డూరంగా మారింది. తన ఐదేళ్ల పాలనలో ఉత్తరాంధ్రకు రాజధాని ముసుగులో భూకబ్జాలు, గంజాయి దందాలు తప్ప చేసిందేమీ లేదు. అయినా మేం చేసిన అభివృద్ధి కళ్ల ముందే ఉందని చెప్పుకున్నారు. అన్నింటికంటే పరాకాష్ట ఏమిటంటే.. "మా హయాంలో పోలీసులను వాడుకోలేదు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయలేదు" అంటూ జగన్ చెప్పుకోవడంఅయిదేళ్ల పాటు ప్రత్యర్థి పార్టీల నేతలపై అక్రమ కేసులు, సీఐడీ వేధింపులు, అర్ధరాత్రి అరెస్టులు, ప్రతిపక్ష గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను సొంత ప్రైవేటు సైన్యంగా మార్చుకున్న తీరు యావత్ దేశానికే తెలుసు. అలాంటి వ్యక్తి నేడు పోలీసులపై నిందలు వేస్తూ.. అధికారుల పేర్లను డిజిటల్ డైరీ లో రాసి పెట్టుకోవాలని, మూడేళ్ల తర్వాత తమ ప్రభుత్వం రాగానే సినిమా చూపిస్తామని కేడర్‌ను బహిరంగంగా రెచ్చగొట్టడం ఆయన హింసాత్మక రాజకీయ మనస్తత్వాన్ని తేటతెల్లం చేస్తోంది. వినేవాళ్లు, గుడ్డిగా నమ్మేవాళ్లు ఉంటే జగన్ రెడ్డి ఎలాంటి కట్టుకథలైనా చెబుతారనేందుకు ఆయన ప్రసంగమే సాక్ష్యం. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో కేడర్‌లో నైతిక స్థైర్యం నశించిందని గ్రహించిన జగన్.. లేని గెలుపును ఊహించుకుంటూ కార్యకర్తలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ వారేమీ వేరే గ్రహం నుంచి రాలేదు కదా.. జగన్ రెడ్డి పాలన చేసినప్పుడూ వారు ఉన్నారు. తెలియకుండా ఉంటుందా?

# ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రూట్ మ్యాప్

విజయవాడ, సెప్టెంబర్ 25,: ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ప్రవాహం, పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జాతీయ స్థాయిలో సరికొత్త ఎజెండాను బలంగా వినిపిస్తున్నారు. ఢిల్లీ వేదికగా పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలతో పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫైర్‌సైడ్ చాట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దశాబ్దాలుగా అమలు చేస్తున్న సమర్థవంతమైన పాలనా నమూనాను గుర్తుచేస్తూ.. పని, జవాబుదారీతనం, నాణ్యమైన సేవలు అనే మూడు మూలస్తంభాలపైనే తమ ప్రభుత్వం నడుస్తోందని స్పష్టం చేశారు. ఒకప్పుడు ప్రపంచమంతా మాట్లాడిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దశ దాటిపోయిందని, ఆధునిక పోటీ ప్రపంచంలో వేగమే సర్వస్వమని, అందుకే కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను తమ అధికారిక పాలనా సంస్కృతిగా మార్చుకుందని లోకేష్ ప్రకటించారు. పరిపాలనలో జవాబుదారీతనం కేబినెట్ మంత్రుల స్థాయి నుంచే మొదలవుతోందని లోకేష్ స్పష్టం చేశారు. మంత్రుల పనితీరు నివేదికలు , ఫైళ్ల పరిష్కార వేగం , మంత్రుల ర్యాంకింగ్‌లు, క్షేత్రస్థాయిలో కలెక్టర్లతో లైవ్ రివ్యూ సమావేశాలు నిర్వహించడానికి అపారమైన రాజకీయ ధైర్యం అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి కఠినమైన పనితీరును ఐదేళ్లపాటు నిరంతరాయంగా కొనసాగిస్తే, ఆ జవాబుదారీతనం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రతి గ్రామంలోని కింది స్థాయి ఉద్యోగి వరకు చేరుతుందని అన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా




విలాసవంతమైన ప్యాలెస్‌లు కట్టుకోవడం సులభమేమో కానీ.. నిజమైన సుపరిపాలన అందించడం అంటే ఒక మహత్తర బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఇదే సిద్ధాంతం గత 44 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ పసుపు జెండాను తరతరాలుగా సగర్వంగా నిలబెట్టిందని ఆయన వివరించారు. రాష్ట్రానికి ప్రాజెక్టులను తీసుకురావడంలో తమ ప్రభుత్వం అవలంబిస్తున్న దూకుడు వ్యూహాన్ని లోకేష్ పంచుకున్నారు. ఒకప్పుడు గుజరాత్ రాష్ట్రం ఇతర ప్రాంతాల నుంచి భారీ పరిశ్రమలను తరలించుకుపోతోందని వార్తలు వినే స్థాయి నుంచి, నేడు స్వయంగా గుజరాత్‌కే వెళ్లి అక్కడ వ్యాపార దిగ్గజాల ముందు ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ వన్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా నిలబెట్టేందుకు తాను త్వరలోనే పర్యటించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నెలకొన్నప్పుడే దేశం అంతిమంగా విజయం సాధిస్తుంది అని స్పష్టం చేశారు. వ్యవసాయం, పారిశ్రామికోత్పత్తి నుంచి సాధారణ పాలన వరకు ప్రతి అంశంలోనూ పనులను శరవేగంగా అమలు చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యమని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక వేగాన్ని మరింత విస్తరించేందుకు 23 ఇండస్ట్రీ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసిందని లోకేష్ వివరించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన తయారీ సంస్థలు, స్థానిక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు , నాణ్యతా పరీక్షా ల్యాబ్‌లు, విద్యా సంస్థలను కేవలం 100 కిలోమీటర్ల పరిధిలోని ఒకే ఎకోసిస్టమ్‌లో అనుసంధానం చేయడమే ఈ క్లస్టర్ల ప్రధాన ఉద్దేశమని చెప్పారు. దీని ద్వారా కంపెనీలకు లాజిస్టిక్స్, ఉత్పత్తి వ్యయాలు భారీగా తగ్గడంతో పాటు అంతర్జాతీయ ఇన్వెస్టర్లను పెద్దఎత్తున ఆకర్షించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తోందని, ఆంధ్రప్రదేశ్ ఇకపై దేశంలోనే ఇన్వెస్ట్‌మెంట్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందని ఫైర్‌సైడ్ చాట్ వేదికగా మంత్రి నారా లోకేష్ ధీమా వ్యక్తం చేశారు.

# కార్పొరేషన్స్ విజయవాడ, విశాఖలలో డివిజన్ల పెంపు

విజయవాడ , సెప్టెంబర్ 25 : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను వీలైనంత త్వరగ నిర్వహించాలనే గట్టి సంకల్పంతో ఉన్న కూటమి ప్రభుత్వం అందుకోసం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా పలు కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో డివిజన్లు, వార్డుల సంఖ్య పెంపుపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అత్యంత విజయవాడ నగర పాలక సంస్థలో డివిజన్ల సంఖ్యను భారీగా పెంచింది. ఇప్పటి వరకూ 64 డివిజన్లుగా విజయవాడ కార్పొరేషన్‌లో కొత్తగా మరో 22 డివిజన్లను జోడించారు. మొత్తం 86 డివిజన్లకు పెంచుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. మున్సిపల్ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఈ ఏడాది మే నెలలో డివిజన్ల పెంపు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. అదే నెల 18 నుంచి 24 వరకు ప్రజలు, వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు, సూచనలను స్వీకరించారు. వీటి ఆధారంగానే విజయవాడ కార్పొరేషన్‌లో డివిజన్లను 86కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్రియలో అత్యధిక మార్పులు విజయవాడ ఈస్ట్ నియోజకవర్గ పరిధిలోనే చోటుచేసుకోవడం గమనార్హం. ఇప్పటివరకు ఆ నియోజకవర్గంలో 21 డివిజన్లు ఉండగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 29కి చేరింది. ప్రజల నుంచి పెద్దగా అభ్యంతరం వ్యక్తం కాకపోవడంతో 86 డివిజన్లను అధికారికంగా ఖరారు చేశారు. నగరంలో పెరుగుతున్న జనాభా, భౌగోళిక విస్తరణ, మెరుగైన పాలన అందించడం కోసమే డివిజన్లను పెంచినట్టు ప్రభుత్వం పేర్కొంది. రాజధాని అమరావతి పరిధిలో అత్యంత కీలకమైన నగర పాలక సంస్థ విజయవాడ కార్పొరేషన్. ఇక్కడ ఎన్నికలు రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి. ఈసారి మేయర్‌ను ప్రత్యక్ష ఎన్నిక విధానంలో ఎన్నుకునే అవకాశం ఉంది. దీంతో బెజవాడ నగర మేయర్ పదవికి పోటీ తీవ్రంగా ఉంది. అధికార టీడీపీ నుంచే దాదాపు 15 మందికిపైగా మేయర్ టికెట్ కోసం పోటీ పడుతుంటే.. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలు కూడా తమవంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇదే సమయంలో ప్రతిపక్ష వైసీపీ కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకోడానికి వ్యూహాలను రచిస్తోంది. కొత్త డివిజన్ల ప్రకారం 2 నుంచి 30 వరకు సరిహద్దులను పునర్నిర్వచించారు. వీటి సరిహద్దులకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల పరిశీలన కోసం అందుబాటులో ఉంచింది ప్రభుత్వం. నగర విస్తరణ, జనాభా పెరుగుదల, పాలనా సౌలభ్యం, అభివృద్ధి పనుల సమర్థ నిర్వహణను దృష్టిలో ఉంచుకుని డివిజన్ల సంఖ్య పెంపు నిర్ణయం తీసుకుంది.

ఇక విశాఖలో...

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) వార్డుల పునర్విభజనకు ఆమోద ముద్ర పడింది. ఈ మేరకు గెజిట్ సెప్టెంబర్ 14, 2026 విడుదల చేశారు. జీవీఎంసీ పరిధిలోని




వార్డుల సంఖ్యను 98 నుంచి 120కి పెంచుతూ/పునర్విభజిస్తూ తుది నోటిఫికేషన్ విడదలైంది. అంతేకాదు వార్డులకు సంబంధించి సరిహద్దులను కూడా ఖరారు చేశారు.. 120 వార్డులతో జీవీఎంసీకి త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏపీ ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 24న జీవీఎంసీ వార్డుల పునర్విభజన ప్రక్రియ కోసం జీవో 65, మే 17న నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న 98 వార్డుల్ని 120కి పెంచుతూ ఈ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే జీవీఎంసీ వార్డుల పునర్విభజన జీవో, నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ విశాఖపట్నానికి చెందిన భాగవతుల నరసింహప్రతాప్‌తో పాటుగా మరొకరు హైకోర్టును ఆశ్రయించారు. దేశంలో జనగణన-2027 ప్రారంభమైందని.. వార్డుల సరిహద్దులు నిర్ణయించడానికి వీల్లేదని వాదనలు వినిపించారు. ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించకుండా వార్డుల పునర్విభజన సరికాదన్నారు.. వెంటనే ఈ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు సింగిల్ జడ్జి మే 29న విచారణ జరిపి.. ఈ ఏడాది మే 17న జీవీఎంసీ వార్డుల పునర్వభజనపై ముందుకు వెళ్లొద్దని ఆదేశించారు. అయితే ఆంధ్రప్రదేశ్ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, జీవీఎంసీ కమిషనర్ సింగిల్ జడ్జి ఉత్తర్వుల్ని హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన హైకోర్టు జనాభా లెక్కలకు, వార్డుల పునర్విభజనకు సంబంధం లేదని వ్యాఖ్యానించింది. జీవీఎంసీ సరిహద్దు మార్చకుండా వార్డుల పునర్విభజన మాత్రమే చేస్తున్నారు కాబట్టి ఈ పిటిషన్‌పై విచారణ జరపాల్సిన అవసరం లేదని అభిప్రాయపడుతూ కొట్టేసింది. దీంతో జీవీఎంసీ వార్డుల విభజనకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. జీవీఎంసీ అధికారులు హైకోర్టు తీర్పు తర్వాత వార్డుల పునర్విభజన ప్రక్రియను ప్రారంభించారు. వార్డుల పునర్విభజనకు సంబంధించి ఇప్పటికే ప్రాథమిక ముసాయిదాపై ప్రజల నుంచి అభ్యంతరాలను పరిశీలించారు. దీంతో తుది ముసాయిదాను తయారుచేసి ప్రభుత్వానికి పంపించగా అనుమతి వచ్చింది. మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి ప్రభుత్వానికి పంపగా.. తాజాగా ఏపీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వార్డుల పునర్విభజనకు నోటిఫికేషన్ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరనున్నారు. మొత్తం మీద జీవీఎంసీలో 120 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియను అక్టోబరు చివరినాటికి పూర్తిచేస్తేనే కేంద్రం నుంచి 16వ ఆర్థిక సంఘం నిధులు విడుదలు కానున్నాయి. కనుక ఆలోగా ఎన్నికలు పూర్తిచేసే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది

# సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**- అభివృద్ధి పనుల శంకుస్థాపన, బహిరంగ సభకు సమన్వయంతో ఏర్పాట్లు**

**- భద్రత, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో): ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్ సమీపంలోని మైదానంలో బహిరంగ సభలో పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను శాఖల వారీగా సమన్వయం చేసుకుంటూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సీఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, ప్రతి ఏర్పాటును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, బందోబస్తు, భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని ఎస్పీ మహేష్ బి. గితే పోలీస్ అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, వేములవాడ ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖితతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ విస్తరణ పనులకు వేగం పెంచాలి

**- పెండింగ్ పనులను గుర్తించి సత్వరమే పూర్తి చేయాలి**

**- అవసరమైన సిబ్బందిని నియమించి పనుల్లో పురోగతి సాధించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్**



వేములవాడ, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీటీఏడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆలయ విస్తరణ పనులతో పాటు నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనుల పురోగతిని ఆర్‌అండ్‌బీ, ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో ఎక్కడా జాప్యం లేకుండా అవసరమైన సిబ్బందిని సమకూర్చి, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత లక్ష్యాల మేరకు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆలయ ఈఓ ఎల్. రమాదేవి, ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా నాయక్, ఆలయ ఈఈ రాజేష్, ఆర్‌అండ్‌బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

## సోనియా గాంధీ నగర్ .గణపతి లడ్డూలకు భారీ ధర..!







కాప్రా/సెప్టెంబర్ -25(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : కుషాయిగూడ డివిజన్ పరిధిలోని సోనియాగాంధీనగర్ ఫేజ్-1 కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన గణపతి లడ్డూ వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలి లడ్డూను ప్రియా, విశ్వప్రసాద్ రూ.2,05,000కు దక్కించుకున్నారు. ప్రత్యేకంగా గణనాథుడిని అలంకరించారు. 4000 మంది పైగా అన్నదానాన్ని నిర్వహించారు. సోనియా గాంధీ నగర్ కాలనీలో. లడ్డు వేలంపాట మూడు గంటల పాటు కొనసాగింది. సోనియా గాంధీ నగర్ కాలనీకి చెందిన వారి లడ్డూను దక్కించుకున్నారు. దక్కించుకున్న వారికి కాలనీవాసులు అభినందించారు. ఆ గణనాథుడి దీవెనలు ఉండాలని కాలనీవాసులు వేడుకున్నారు 2వ.లడ్డూను కాంచన రామారావు రూ.1,05,000కు వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కుందనపల్లి సిద్ధు రాములు, బాల నర్సింహ, యాదగిరి, కిట్టు. వెల్డింగ్ శ్రీను. యాదవ్, మల్లేష్ రాజు, శ్రీనివాస్, బంకు శ్రీను, డేవిడ్, అశోక్, వెంకట్ ముదిరాజ్, గంగాధర్, ఏ.సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ని వెంటనే భర్తరఫ్ చేయాలి - సిపిఎం



కాప్రా/సెప్టెంబర్ -25( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : సర్ పేరుతో ఎన్నికల ప్రక్రియలో అవకతవకలకు పాల్పడుతున్న కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే భర్త రఫ్ చేయాలని సిపిఎం పార్టీ కాప్రా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు ఈ.సీ.ఐ.ఎల్ చౌరస్తాలో నిరసన ప్రదర్శనను నిర్వహించడం జరిగింది.

## ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి లో అగ్నిప్రమాదంలో మరణించిన చిన్నారి కుటుంబానికి 5లక్షల చెక్కు అందచేసిన ఐ టీ డి ఏ పి వో మంద మకరందు



లింగాపూర్, సెప్టెంబర్ 25(విజన్ ఆంధ్ర ) లింగాపూర్ మండలంలోని ముల్లగూడ గ్రామానికి చెందిన దుర్గబాయి ఎ/-మారుతి ల చిన్నారి ఇటీవల ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ప్రమాదంలో మరణించడం వలన( ఐ టీ డి ఏ )పి వో,మంద మకరందు చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి 5లక్షల చెక్కు ను అందజేశారు. ఈ కార్యక్రమం లో ఏ ఎన్ యం విమల, ఆశ వర్కర్ కనిబాయి, కంచన్ పల్లి మాజీ సర్పంచ్ తదితరులు ఉన్నారు.

# అమృత్ 2.0 పనులను వేగవంతం చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25,(విజన్ ఆంధ్ర ) : ప్రజలకు నిరంతరం శుద్ధమైన త్రాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టిన అమృత్ 2.0 పథకం పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకంలో భాగంగా నస్పూర్‌లోని ఆర్‌కే-6 వద్ద నిర్మిస్తున్న 1 వేయి కిలోలీటర్ల సామర్థ్యం గల ఎలివేటెడ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్, హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మిస్తున్న 1 వేయి 500 కిలోలీటర్ల సామర్థ్యం గల ఈ.ఎల్.ఎస్.ఆర్. నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పనులను నిర్దేశిత ప్రమాణాలు, నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పనులలో జాప్యం లేకుండా అదనపు కార్మికులను సమీకరించి, శ్రామిక బలాన్ని పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన త్రాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అనంతరం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భావన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అధికారులు, ఎల్.పి.జి. డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు ఎల్.పి.జి. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణ ప్రకారం వినియోగదారుల ఈ-కెవైసి ప్రక్రియను పూర్తి చేయాలని, నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేసేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ కుషాయిగూడ విఙ్ఞ హరిత యువ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం..!

కాప్రా/సెప్టెంబర్ -25( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : మేడ్చల్ జిల్లా నాచారం సర్కిల్ పరిధిలోని మీర్పేట్ హెచ్ బి కాలనీ 19వ. డివిజన్ కృష్ణ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 2 లో విఙ్ఞ హరిత యువ సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా కృష్ణ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 2 విజ్ఞా హరిత యువ సంఘం సలహాదారులు బాలాజీ శర్మ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి వినాయక చవితి మహోత్సవములు ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు . ఈరోజు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించామన్నారు. 11 రోజులు విగ్నేశ్వర స్వామికి రోడ్ నెంబర్ 2 కాలనీవాసులు ప్రజలు భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనమైన పూజలు నిర్వహించామన్నారు. ఈ 11 రోజుల పూజలో కృష్ణ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 2 వాసులు ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో ఉండేవిధంగా ఈ వినాయక చవితి సందర్భంగా విగ్నేశ్వర స్వామి ఆశీర్వదించాలని కోరమన్నారు. 11 రోజులకు కాలనీ వాసులు రోజుకొక తీర్థ అన్న ప్రసాద వితరణ నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్క కుటుంబానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విఙ్ఞ హరిత యువ సంఘం మరియు ప్రజలందరినీ విఘ్నేశ్వర స్వామి ఆశీర్వదించాలని కోరారు. ప్రతి ఒక్క కుటుంబానికి ఆ విగ్నేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు. సాయంత్రం లడ్డు వేలం పాట రసవత్తరంగా జరిగింది. చివరికి రోడ్ నెంబర్ 2 బొమ్మ రెడ్డి రెసిడెన్సి లో నివాసముండే శంకర్ 2 లక్షల రూపాయలకు వినాయకుని లడ్డును దక్కించుకున్నారు అనంతరం విఘ్నేశ్వర స్వామినే ఊరేగింపుతో నిమజ్జనానికి తరలిస్తామని చెప్పారు. బైట్. బాలాజీ శర్మ- కృష్ణానగర్ కాలనీ రోడ్ నెంబర్ 2 విఙ్ఞ హరిత యువ సంఘం సలహాదారులు

# రిజిస్ట్రేషన్లపై సర్కార్ ఉక్కుపాదం

హైదరాబాద్, సెప్టెంబర్ 25, : మరోసారి ల్యాండ్ పాలిటిక్స్ తెరపైకి వచ్చాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులు, రిజిస్ట్రేషన్లపై రేవంత్ రెడ్డి సర్కార్ ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సన్నిహితులకు భూబదలాయింపులపై సమగ్ర విచారణ జరిపేందుకు ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పలు భూముల అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిపుణుల బృందాన్ని రంగంలోకి దించింది. సాంకేతిక, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ ఎ. శ్రీదేవసేన చైర్‌పర్సన్ గా ఓ కమిటీని ఏర్పాటు చేసింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు దీనికి కన్వీనర్ గా వ్యవహరించనున్నారు. జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో పాటు, ఏయే జిల్లాల పరిధిలోని భూములపై విచారణ జరుగుతుందో ఆయా జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు.తెలంగాణ అసెంబ్లీలో 22ఏ దుర్వినియోగం, నిషేధిత భూముల పరిధిపై జరిగిన వాడీవేడి చర్చ ఈ హైలెవల్ కమిటీ ఏర్పాటుకు ప్రధాన కారణమైంది. గత కేసీఆర్ ప్రభుత్వ కాలంలో ప్రభుత్వ భూములు, సీలింగ్ మిగులు భూములు, అసైన్డ్ భూములు, జాగీర్, భూదాన్, ఇనామ్, అటవీ భూములతో పాటు చెరువులు, కుంటల పరివాహక ప్రాంతాల భూములను 22ఏ జాబితా నుంచి నిబంధనలకు విరుద్ధంగా తొలగించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. మార్పిడి చేసి ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారన్న ఈ అంశంపై అసెంబ్లీలో పెద్ద ఎత్తున గందరగోళం చెలరేగడంతో, పరిపాలనాపరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఈ విచారణ కమిటీకి రేవంత్ సర్కార్ విస్తృతమైన అధికారాలను కల్పించింది. సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని




నిర్దేశిత గ్రామాల్లో చట్టాలు, జీఓలు, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలను ఈ బృందం సవివరంగా పరిశీలిస్తుంది. ఒకవేళ అక్రమాలు జరిగినట్లు తేలితే, అందుకు బాధ్యులైన అధికారుల నుండి రాజకీయ నాయకుల వరకు అందరి జవాబుదారీతనాన్ని ఖరారు చేసి తగిన చట్టపరమైన చర్యలను సిఫార్సు చేస్తుంది. ఈ విచారణకు సంబంధించి అన్ని రకాల భూ రికార్డులను వెంటనే సమర్పించాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లు, సీసీఎల్ఏ, రిజిస్ట్రేషన్ శాఖలను ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది.గత ప్రభుత్వంలో అత్యంత కీలక పదవుల్లో కొనసాగిన అగ్రనేతలు, వారి బంధువులు, అనుచరులతో ముడిపడి ఉన్న భూములే లక్ష్యంగా చేసుకుని ఈ విచారణ సాగుతుండటం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఈ ఎంక్వైరీ కమిటీ పరిణామాలు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాబోయే రోజుల్లో తీవ్ర రాజకీయ యుద్ధానికి దారితీసే సూత్రాలు కనిపిస్తున్నాయి. కమిటీ ఇచ్చే నివేదికల ఆధారంగా ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి చర్యలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారనున్నాయి.

## కొత్తకోట మున్సిపల్ కేంద్రంలో ఫ్రైడే డ్రై డే ప్రోగ్రాం

కొత్తకోట సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర) : కొత్తకోట :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్రై డే డ్రై డే ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా ఈరోజు దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రం 12.వ వార్డ్ లో కౌన్సిలర్ అజ్మత్ ఖానం సలీం ఖాన్, వార్డులో కొత్తకోట మున్సిపల్ ప్రజలకు కొత్తకోట మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పల్లవి కృష్ణారెడ్డి చుట్టుపక్కల నీరునిల్వ ఉండకుండా చూసుకోవాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షాకాలంలో ప్రబలుతున్న డెంగ్యూ. మలేరియా వైరల్ ఫీవర్ . రాకుండా ఫినాయిల్ బ్లీచింగ్ పౌడర్ చల్లారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తకోట మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పల్లవి కృష్ణారెడ్డి, మదనపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, కౌన్సిలర్ చీజీ. బోయజ్,మున్సిపల్ కమిషనర్ సైదయ్య, కొత్తకోట కౌన్సిలర్స్ గ్రా. రవీందర్ రెడ్డి,+.మురళి యాదవ్. కరాటే నబి, తిరుపతి,జీ. అఖిల ణ/శీ జీ. సుభాష్, వీ. సంజీవులు, సుధా రామ్మోహన్ రెడ్డి, అయ్యన్న, కొత్తకోట మున్సిపల్ కో






ఆప్షన్ సభ్యులు తయ్యబ్, హఫీస్, కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేశి పెంటన్న యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రా.శంకర్ యాదవ్, మహేష్, కార్తీక్, బాబా, రఫిక్ , తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## భారీ వర్షాలతో వంశధార, నాగావళి నదులకు వరద ఉధృతి

**- గొట్టా బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ**

**- నారాయణపురం ఆనకట్ట వద్ద కూడా మొదటి ప్రమాద హెచ్చరిక**

**- నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన**

**- నదుల్లోకి ఈత, చేపల వేటకు వెళ్లొద్దని విపత్తుల సంస్థ హెచ్చరిక**

భారీ వర్షాల నేపథ్యంలో ఉత్తరాంధ్రలోని ప్రధాన నదులైన వంశధార, నాగావళిలో వరద ఉధృ క్రమంగా పెరుగుతోంది. నదీ ప్రవాహం పోటెత్తుతుండటంతో అధికారులు ప్రధాన బ్యారేజీల వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ క్రమంలో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. వంశధార నదిపై ఉన్న గొట్టా బ్యారేజ్ వద్ద అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ప్రస్తుతం ఈ బ్యారేజ్‌లోకి 41,014 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, అంతే మొత్తంలో నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. మరోవైపు నాగావళి నదిలోనూ వరద ప్రవాహం కొనసాగుతోంది. తోటపల్లి బ్యారేజ్ వద్ద ఇన్-ఫ్లో, అవుట్-ఫ్లో 45,661 క్యూసెక్కులుగా నమోదవుతోంది. నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్ట వద్ద ప్రవాహం 59,700 క్యూసెక్కులకు చేరడంతో అధికారులు అక్కడ కూడా మొదటి ప్రమాద హెచ్చరికను అమలులోకి తెచ్చారు. ఈ పరిస్థితులపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పందిస్తూ.. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వరద తీవ్రత దృష్ట్యా నదుల్లోకి ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటి పనులు అత్యంత ప్రమాదకరమని, అటువంటి వాటికి దూరంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.



## కమాండ్ కంట్రోల్ హాల్ నుంచి గణేష్ నిమజ్జన ఏర్పాట్లను క్షుణ్ణంగా పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్

**- 200 సి. సి కెమెరాలు పర్యవేక్షణ**



నిజామాబాద్ సెప్టెంబర్25:( విజన్ ఆంధ్ర) : వినాయక నిమజ్జనం సందర్భంగా నిజామాబాద్ నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం జరిగేలా పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్. కమాండ్ కంట్రోల్ హాల్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ద్వారా గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షించారు. నగరంలోని ప్రధాన రహదారులు, నిమజ్జన మార్గాలు, విగ్రహాల తరలింపు ప్రాంతాలు, ట్రాఫిక్ రద్దీ ఏర్పడే ప్రదేశాలు, నిమజ్జన కేంద్రాల వద్ద పరిస్థితులను సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలించారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేస్తూ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు , గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించి , నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా , సురక్షితంగా నిర్వహించుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కమాండ్ కంట్రోల్ హాల్ నుంచి నిరంతర నిఘా ఏర్పాటు చేయడం ద్వారా గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించారు.

## డబ్బుల కోసం కన్న తండ్రినే గొడ్డలితో నరికి చంపిన కొడుకుకు జీవిత ఖైదు




తెలంగాణ స్టేట్ బ్యూరో, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర): కన్న తండ్రిని అతి కిరాతకంగా హత్య చేసిన కేసులో నిందితుడికి కోర్టు జీవిత ఖైదు విధించింది. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి ఐపీఎస్ తెలిపిన వివరాల ప్రకారం... రాజాపూర్ మండలం రాయపల్లి గ్రామంలో 2024 సెప్టెంబర్ 19న రాత్రి ఈ దారుణం జరిగింది. నిందితుడు కవాలి నదేశ్,ఆనంద్ డబ్బుల కోసం తల్లిదండ్రులతో తరచూ గొడవపడేవాడు. ఎటువంటి పనిపాట లేకుండా తిరుగుతూ తల్లిదండ్రుల కూలి డబ్బుల కోసం వేధించేవాడు. ఘటన రోజు రాత్రి తండ్రి కవాలి నారాయణతో డబ్బుల విషయంలో గొడవపడి, గొడ్డలితో మెడపై పలుమార్లు దాడి చేసి హత్య చేశాడు. కేకలు విని భార్య కవాలి చంద్రకళ వచ్చేసరికి కొడుకు తండ్రిపై దాడి చేస్తున్నాడు. తీవ్రంగా గాయపడిన నారాయణను జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. భార్య చంద్రకళ ఫిర్యాదుతో రాజాపూర్ ఎస్ఐ రవి కేసు నమోదు చేయగా, జడ్చర్ల రూరల్ సీఐ టి.నాగార్జున గౌడ్ సమర్థవంతంగా దర్యాప్తు చేసి కోర్టులో పక్కా ఆధారాలు సమర్పించారు. ఈ కేసును విచారించిన ఫ్యామిలీ కోర్టు కమ్ III అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి పి.ఆంజనేయులు శుక్రవారం తీర్పు వెలువరిస్తూ నిందితుడికి జీవిత ఖైదు, రూ.5,000 జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సీఐ నాగార్జున గౌడ్, ఎస్ఐ రవి, APP కె.నరేష్ కుమార్, ఫ్యామిలీ కోర్టు లైజన్ అధికారి HC-160 జె.శ్రీనివాస్, CDO PC-2177 జె.శేఖర్ లను ఎస్పీ జానకి అభినందించారు.

## విఘ్నేశ్వరుని నిమజ్జన ప్రారంభ పూజలో ఎమ్మెల్సీ దండే విఠల్



కాగజ్‌నగర్, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ పట్టణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విఘ్నేశ్వరుని నిమజ్జన ప్రారంభ పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పాల్గొని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిర్పూర్ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష్ చౌదరి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులు, ప్రజలు పోలీసులకు మరియు అధికారులకు సహకరించాలని నిర్వాహకులు కోరారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. విఘ్నేశ్వరుని నామస్మరణతో పట్టణంలో భక్తి వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు హిందూ ఉత్సవ సమితి సభ్యులు, అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టారు.

## జపాన్ విద్యా పర్యటన ముగించుకున్న ఉపాధ్యాయుడు మురళీకృష్ణకు ఘన సన్మానం



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24(విజన్ ఆంధ్ర) : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విద్యా సంబంధిత అధ్యయన పర్యటనలో భాగంగా జపాన్ దేశాన్ని సందర్శించి వచ్చిన వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం, యాపర్ల ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయులు మురళీకృష్ణను "వనపురి ఎడ్యుకేషనల్ ఫౌండేషన్" ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు.జపాన్ దేశంలో ఐదు రోజుల పాటు అక్కడి పాఠశాలల తరగతి బోధన, విద్యార్థుల అభ్యసన రీతులను పరిశీలించి, అధ్యయనం చేసినందుకు మురళీకృష్ణను ఫౌండేషన్ ప్రతినిధులు, ముఖ్య అతిథులు శాలువా, బొకేతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వనపురి ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ, జపాన్ దేశంలో మురళీకృష్ణ పొందిన అనుభవాలు, అక్కడి బోధనా పద్ధతులు వనపర్తి జిల్లాతో పాటు పెబ్బేరు మండలంలో కూడా అమలు చేయడానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మండల పరిషత్ అధ్యక్షులు శైలజ కురుమూర్తి, మండల విద్యాధికారి ఎస్. జయరాములు మాట్లాడుతూ... వనపురి ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఇటువంటి ప్రోత్సాహక కార్యక్రమాలు ఉపాధ్యాయ లోకానికి ఎంతగానో ఉపయోగపడతాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ హుసేనయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, పాఠశాల దాత నరేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ స్వరాజ్యం బాబు హాజరయ్యారు. చివరగా మురళీకృష్ణ అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ వందన సమర్పణ చేశారు.

# ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లే లక్ష్యం

- వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి
- గుడిసెలు లేని వనపర్తి జిల్లా రూపకల్పనకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- నిర్మించుకోలేని వారికి కాంట్రాక్టర్ ద్వారా 3 నెలల్లో ఇల్లు పూర్తి
- నిర్మాణంలో ఉన్న ఇళ్లకు ఒకేసారి బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం ఉత్తర్వులు
- ఇల్లు నిర్మించుకోకపోతే మంజూరు రద్దు
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి






వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 25(విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని 100% విజయవంతం చేసి, గుడిసెలు లేని వనపర్తి జిల్లాగా మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం వనపర్తి ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన, గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మొదటి విడతలో ఇళ్లు ప్రారంభించి వివిధ దశల్లో ఉన్న లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా, ఒకేసారి పేమెంట్ చేసేలా ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలో ఆర్థిక స్తోమత లేక ఇల్లు కట్టుకోలేకపోతున్న దాదాపు 300 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్త వెసులుబాటు కల్పించింది. లబ్ధిదారులు స్వచ్ఛందంగా ఒప్పుకుంటే కాంట్రాక్టర్ ద్వారా ఇల్లు నిర్మించి ఇస్తారు. లబ్ధిదారుడు, కాంట్రాక్టర్, బ్యాంకర్ల పేరుతో ఉమ్మడి ఖాతా తెరిచి, నిర్మాణ పురోగతిని బట్టి విడతలవారీగా డబ్బులు జమ చేస్తారు. 418 చదరపు అడుగుల వైశాల్యంలో 9 పిల్లర్లు, 2 అడుగుల బేస్‌మెంట్, సిమెంట్ ఇటుకలతో హాల్, బెడ్‌రూమ్, కిచెన్, లాటరిన్/బాత్రూమ్‌లతో కూడిన చక్కటి ఇల్లును కాంట్రాక్టర్ ద్వారా 3 నెలల్లోనే పూర్తి చేసి అందిస్తారు. ఆర్భాటాలకు పోయి ఎత్తయిన బేస్‌మెంట్లు కట్టి అప్పుల పాలు కావద్దని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ఇల్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. దేశంలో జూలై వరకు ఎల్ నినో ప్రభావం ఉంటుందని, నీటిని మరియు విద్యుత్తును అత్యంత పొదుపుగా వాడుకోవాలని కోరారు.


### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి స్పష్టత

వనపర్తి నియోజకవర్గంలో మొదటి, రెండో విడతల్లో కలిపి ఇప్పటివరకు 3,422 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశామని, వీటిలో 1,040 ఇళ్లు ఇప్పటికే పూర్తయ్యాయని కలెక్టర్ వెల్లడించారు. మంజూరు పత్రాలు పొంది కూడా ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు ప్రారంభించని 443 మంది లబ్ధిదారులకు ఈ కాంట్రాక్టర్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కాంట్రాక్టర్ ద్వారా ఇల్లు కట్టించుకోవడం లేదా సొంతంగా నిర్మించుకోవడం అనేది లబ్ధిదారుల ఐచ్ఛికం. అయితే, ఏ విధానమూ ఎంచుకోకుండా నిర్మాణాలు ప్రారంభించకపోతే మాత్రం మంజూరైన ఇందిరమ్మ ఇల్లు రద్దు చేయబడుతుంది.కాంట్రాక్టర్ ద్వారా నిర్మించే ఇళ్ల నాణ్యతా ప్రమాణాలకు సంబంధించిన వీడియోను ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రదర్శించారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ విటోబా, వనపర్తి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి రమేష్, వైస్ ఛైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీడీఓలు మరియు గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం.. పటిష్ట బందోబస్తు నిర్వహించాలి

- ఎస్పీ సునిత రెడ్డి





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 25(విజన్ ఆంధ్ర) : విఘ్నేశ్వరుని నిమజ్జనోత్సవం చివరి రోజు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాన్ని నిర్వహించాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక డీఎస్పీతో కలిసి ఆమె నల్లచెరువు నిమజ్జన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా నిరంతరం శ్రమిస్తూ పటిష్టమైన బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు. అదే అప్రమత్తతతో చివరి రోజు కూడా విధులు నిర్వహించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట భద్రత కల్పించాలని టౌన్ ఎస్సై హరిప్రసాద్, రూరల్ ఎస్సై రుషికేశ్ మరియు పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

నిబంధనలు పాటించాల్సిందే..

ఉత్సవ కమిటీలు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఎస్పీ స్పష్టం చేశారు. మండపాల వద్ద పూజలను త్వరగా ముగించుకుని, వెలుతురు ఉండగానే విగ్రహాలను నిమజ్జన ప్రాంతానికి తరలించాలని సూచించారు. డీజేల వినియోగం, బాణాసంచా కాల్చడం విషయంలో మార్గదర్శకాలను తప్పక పాటించాలన్నారు. నిమజ్జన ఘాట్ వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందికి, కాంట్రాక్టర్‌కు సూచించారు. అందరూ మత సామరస్యాన్ని కాపాడుతూ ఈ ఉత్సవాన్ని ప్రశాంతంగా, విజయవంతంగా ముగించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

# రూపురేఖలు మారిన పెబ్బేరు ఆర్టీసీ బస్టాండ్

- రూ, 39 లక్షలతో సర్వాంగ సుందరంగా పెబ్బేరు బస్టాండ్
- ఎమ్మెల్యే మేఘారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- దశాబ్దాల కష్టాలకు స్వస్తి.. దుమ్ము, ధూళి సమస్యకు ముగింపు






వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర) : జాతీయ రహదారిపై ఉంటూ వందలాది గ్రామాలకు ప్రధాన కేంద్రంగా వెలుగొందుతున్న పెబ్బేరు ఆర్‌టీసీ బస్టాండ్ రూపురేఖలు ఎట్టకేలకు పూర్తిగా మారిపోయాయి. ఉమ్మడి పాలనతో పాటు గత పదేళ్ల పాలకుల తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ బస్టాండ్‌కు పూర్వవైభవం సిద్ధించింది. దశాబ్దాలుగా ఎగిసిపడే దుమ్ము, ధూళితో నరకం చూసిన ప్రయాణికులు, చుట్టుపక్కల నివాసితుల కష్టాలకు అంతం పలికేలా బస్టాండ్‌లో నూతనంగా నిర్మించిన సీసీ బెడ్ పనుల ప్రారంభోత్సవం శనివారం వైభవంగా జరగనుంది.

### ఏళ్లనాటి నిర్లక్ష్యానికి చెక్

పెబ్బేరు బస్టాండ్ మీదుగా నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే దశాబ్దాలుగా సరైన మౌలిక వసతులు లేక ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. బస్సుల రాకపోకల వల్ల లేచే దుమ్ముతో ప్రయాణికులతో పాటు చుట్టుపక్కల ఇళ్ల ప్రజలు అనారోగ్యం పాలయ్యే పరిస్థితి ఉండేది. గత పాలకులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ సమస్య దశాబ్దాలుగా పెండింగ్‌లోనే ఉండిపోయింది.

### చొరవ చూపిన చైర్‌పర్సన్..

### క్షణాల్లో నిధులు తెచ్చిన ఎమ్మెల్యే!

ప్రయాణికుల నిత్య నరకాన్ని, స్థానికుల కష్టాలను ప్రత్యక్షంగా గమనించిన మున్సిపల్ చైర్‌పర్సన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గ్రహించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఏమాత్రం కాలయాపన చేయకుండా, కేవలం రెండు రోజుల్లోనే ₹39 లక్షల నిధుల మంజూరుకు సంబంధించిన ప్రోసీడింగ్స్ ఇప్పించారు. ఆ వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, పనుల్లో ఏమాత్రం ఆలస్యం జరగకుండా చకచకా సీసీ బెడ్ నిర్మాణం పూర్తి చేయించారు.

### హైదరాబాద్ బస్టాండ్ రేంజ్‌లో నిర్మాణం!

ప్రస్తుతం పూర్తయిన సీసీ బెడ్‌తో పెబ్బేరు బస్టాండ్ శోభాయమానంగా, హైదరాబాద్‌లోని మోడ్రన్ బస్టాండ్‌ను తలపించేలా తయారైంది. ప్రత్యర్థులు సైతం ప్రశంసించక తప్పని రీతిలో పనులు పూర్తి కావడం పట్ల స్థానిక ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నేడు ఎమ్మెల్యే మేఘారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ మహత్తర కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రయాణికులు పెద్ద ఎత్తున తరలిరావాలని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ కోరారు.

## బదిరుల హక్కులకు భంగం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప కాసరగడ్డ
- సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 25 ( విజన్ ఆంధ్ర) : బదిరుల మనోభావాలకు, హక్కులకు భంగం కలిగిస్తే చట్టప్రకారం కఠిన శిక్షలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప కాసరగడ్డ హెచ్చరించారు. బదిరులను మనస్తాపానికి గురిచేసినా, వారి శారీరక లోపాన్ని చూపుతూ దూషించినా నేరంగా పరిగణించబడుతుందన్నారు. చట్టం ప్రకారం వారికి కేటాయించిన హక్కులు, సౌకర్యాలు పొందేలా సమాజంలోని ప్రతి పౌరుడు సహకరించాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బధిరుల దినోత్సవాన్ని (27.09.2026) పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా వైద్యశాఖ బృందంతో కలిసి నాగవరం శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ నిపుణులు డాక్టర్ శ్రావణ్ కుమార్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు అందించారు. అనంతరం డాక్టర్ మారుతి నందన్ మాట్లాడుతూ.. మానవ శరీరంలో కీలకమైన జ్ఞానేంద్రియాలను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు విద్యా రాణి, ప్రతినిధులు శ్రీనివాస్, మధుమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కొమ్మాది ప్రాంతంలో కలెక్టర్ పర్యటన

విశాఖపట్నం : విశాఖలో కొమ్మాది ప్రాంతంలో కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పర్యటించారు.క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా కొమ్మాది కార్పెంటర్ కాలనీలో పర్యటించి సంబంధిత బాధితులతో మాట్లాడారు.భారీ వర్షాల నేపధ్యంలో భాదితులకు ఆదుకునేలా అన్నీ విధాలుగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.అనంతరంమధురవాడలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని వసతి, భోజనం, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్‌లోని ఒక చిన్నారి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. స్టడీ అవర్‌లో విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యేకంగా ఇంటరాక్ట్ అయ్యారు. వారి చదువులు, భవిష్యత్ లక్ష్యాలు, ఆసక్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి, వారి సందేహాలను తెలుసుకున్నారు.

# 22 ఏపై బ్యాక్ స్టెప్...




హైదరాబాద్, సెప్టెంబర్ 25, : తెలంగాణలో 22ం నిషేధిత భూముల వ్యవహారం ఇప్పుడు కేవలం రెవెన్యూ సమస్యగా కాకుండా.. రాజకీయంగా కూడా హాట్‌టాపిక్‌గా మారింది. సొంత భూములు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు జరగక ఇబ్బందులు పడుతున్న బాధితుల ఆవేదనకు తోడు.. బీఆర్ఎస్, బీజేపీ సహా ప్రతిపక్షాల ఆందోళనలు, అసెంబ్లీలో రగడ, ప్రభుత్వంపై వచ్చిన ప్రశ్నలు ఈ వ్యవహారాన్ని మరింత వేడెక్కించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం చర్చకు దారితీస్తోంది. ఇంతకాలం కఠినంగా ఉన్న ప్రభుత్వం.. ఇప్పుడు ఎందుకు సడలింపులు ప్రకటించింది? ప్రజా, రాజకీయ ఒత్తిడి పెరగడంతోనే వెనక్కి తగ్గిందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.22ం జాబితాలో ఉన్న భూముల విషయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో పెద్ద సంఖ్యలో ఆస్తి యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గత కొంతకాలంగా చర్చనీయాంశంగా ఉంది. ముఖ్యంగా ఇప్పటికే ప్రభుత్వ అనుమతులతో లేఅవుట్లు వేసుకుని ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి కూడా రిజిస్ట్రేషన్ సమస్యలు ఎదురయ్యాయి.ఈ సమస్యపై అసెంబ్లీలో చర్చ జరిగిన సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి 22ం సమస్యకు పరిష్కారం చూపేందుకు 12 అంశాలతో కూడిన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. అనుమతులు ఉన్న లేఅవుట్లలో పెండింగ్ రిజిస్ట్రేషన్లను పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించే విధానాన్ని తీసుకొస్తామని చెప్పారు. అంటే.. ఇంతకాలం 22ం జాబితాలో ఉందనే కారణంతో నిలిచిపోయిన ప్రతి ఆస్తిని ఒకే గాటన చూడకుండా, అనుమతులు ఉన్న లేఅవుట్లను ప్రత్యేకంగా పరిశీలించే దిశగా ప్రభుత్వం అడుగులు వేసినట్టయింది.ఈ అంశాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం మీద రాజకీయంగా పెద్ద ఎత్తున ప్రయోగించింది. 22ం జాబితాలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నేతలు జ్యుడీషియల్ విచారణ, వైట్‌పేపర్, నిషేధిత భూముల పూర్తి వివరాలను బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. 22ం బాధితులతో కేటీఆర్ సమావేశమై ప్రభుత్వం భూ నిషేధిత జాబితాను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ఇవి బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు మాత్రమేనని, వాటిపై ప్రభుత్వం భిన్నమైన వివరణ ఇచ్చిందని గమనించాలి.అదే సమయంలో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 22ం అంశాన్ని ప్రతిపక్షాలు ప్రధాన అస్త్రంగా తీసుకున్నాయి. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీలో నిరసన తెలిపారు.ఇది కేవలం అసెంబ్లీ గోడల మధ్యే ఆగలేదు. 22ం జాబితాలో తమ భూములు చిక్కుకోవడంతో రిజిస్ట్రేషన్లు జరగక ఇబ్బందులు పడుతున్న బాధితుల సమస్య కూడా బలంగా ముందుకొచ్చింది. ఒకవైపు ప్రతిపక్షాల విమర్శలు.. మరోవైపు భూముల యజమానుల ఆందోళనలు.. ఇంకోవైపు అసెంబ్లీలో వరుసగా చర్చలు జరగడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిన వాతావరణం కనిపించింది. ఇదే సమయంలో బీఆర్ఎస్ నిరసనలకు సంబంధించిన పరిణామాలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వంతో ఆ పార్టీ మధ్య రాజకీయ ఘర్షణను మరింత తీవ్రతరం చేశాయి.ప్రభుత్వం మాత్రం దీనిని వెనక్కి తగ్గడంగా కాకుండా.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే ప్రక్రియగా వివరిస్తోంది. 22ం వ్యవహారం అనేక రకాల భూములు, పాత రికార్డులు, కోర్టు వివాదాలు, ప్రభుత్వ భూములు, ప్రైవేట్ పట్టా భూములు, లేఅవుట్లు వంటి అంశాలతో ముడిపడి ఉందని ప్రభుత్వం చెబుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా కొన్ని సందర్భాల్లో మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రైవేట్ భూముల యజమానులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అసెంబ్లీలో వివరించారు.కానీ రాజకీయంగా చూస్తే మాత్రం మరో కథ వినిపిస్తోంది. బాధితుల నుంచి పెరుగుతున్న ఒత్తిడి.. బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రతిపక్షాల ఆందోళనలు.. అసెంబ్లీలో నిరంతర ప్రశ్నలు.. 22ం అంశంపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తి నేపథ్యంలో ప్రభుత్వం పరిష్కార మార్గాన్ని వేగవంతం చేసిందనే అ బి, ( ఎా యి ా ల ు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వం ఒక సమస్యను పరిష్కరించేందుకు కొత్త విధానం ప్రకటించిందా? లేక సమస్య తీవ్రత రాజకీయంగా పెరగడంతో నష్టనివారణ చర్యలకు దిగిందా? అనేది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది .ప్రభుత్వం చెప్పే లెక్కల ప్రకారం 22ం జాబితాలోని మొత్తం భూములన్నీ ప్రైవేట్ భూములు కావు. అటవీ, ప్రభుత్వ, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్, వివాదాస్పద భూములు కూడా అందులో ఉన్నాయి. ప్రస్తుతం తీవ్రంగా చర్చకు వస్తున్నది ప్రైవేట్ పట్టా భూములకు సంబంధించిన సమస్య అని ప్రభుత్వం చెబుతోంది.అందుకే 22ం జాబితాలో ఉన్న ప్రతి భూమికి రిజిస్ట్రేషన్ అనుమతి వచ్చేసిందని భావించడం కంటే.. చట్టబద్ధమైన ప్రభుత్వ అనుమతులు ఉన్న లేఅవుట్లు, వాస్తవంగా ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్న భూములు, వివాదాస్పద భూములను వేరు చేసి పరిష్కరించే ప్రక్రియ మొదలైందని చూడటం కీలకం.బాధితులు తమ భూములపై హక్కు, రిజిస్ట్రేషన్ కోరుతున్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం పాత రికార్డులు, గత ప్రభుత్వాల నిర్ణయాలు, అధికారుల స్థాయిలో జరిగిన తప్పిదాలను ప్రస్తావిస్తూ పరిష్కార చర్యలను ప్రకటిస్తోంది.అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. 22ం సమస్యను ఇకపై పక్కన పెట్టే పరిస్థితి ప్రభుత్వానికి లేదు. సమస్యపై రాజకీయ వేడి పెరగడంతో పాటు ప్రజల నుంచి వచ్చిన ఒత్తిడి కూడా దీనిని ప్రభుత్వ అజెండాలో ముందుకు తెచ్చింది. ఊఓఆం, ఉఊఓఅ, ఆఅఖ వంటి సంస్థల ఆమోదం ఉన్న లేఅవుట్ల పెండింగ్ రిజిస్ట్రేషన్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రకటించిన చర్యలు అందులో భాగంగానే చూడవచ్చు.అందుకే ఇప్పుడు తెలంగాణలో వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే "22ంపై మొదట ఇంత కఠినంగా వ్యవహరించి.. చివరికి సడలింపులు ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది? ప్రజా ఆగ్రహం, ప్రతిపక్షాల పోరాటం, బాధితుల ఒత్తిడే ప్రభుత్వాన్ని ఈ నిర్ణయం వైపు నెట్టాయా?"దీనికి సమాధానం మాత్రం రాబోయే రోజుల్లో కొత్త మార్గదర్శకాలు, వాస్తవంగా ఎన్ని రిజిస్ట్రేషన్లు క్లియర్ అవుతున్నాయి, ఎంతమంది బాధితులకు ఉపశమనం లభిస్తోంది అన్నదానిపై ఆధారపడి ఉంటుంది.

## రైతుభీమా 5 లక్షల చెక్కును అందజేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి



గద్వాల సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు కె. టి దొడ్డి మండలం పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన స్వర్గీయ హరిజన గోవిందు అలియాస్ సింహాద్రి రోడ్డు ప్రమాదంతో మరణిస్తే రైతు భీమా పథకం ద్వారా మంజూరైన చెక్కును గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా నామిని కుమార్తె పౌర్ణమి కి 5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క కుంట భూమి ఉన్న నిరుపేద రైతులకు కూడ రైతు భీమా వర్తింప చేసి కుటుంబ పెద్దను కోల్పోయిన బాధలో ఉండి దిక్కుతోచని స్థితిలో ఉన్న కుటుంబానికి బాసటగా నిలుస్తుంది కుటుంబానికి ఎంతో తొడ్పాటును అందిస్తుందని అన్నారు. నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవవడం మా జీవితంలో మర్చిపోలేమని సీఎం రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పవన్ కుమార్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, నాయకులు తిమ్మారెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి ఇంట్లోకి కొట్టుకొచ్చిన అరుదైన నక్షత్ర తాబేలు




కాగజ్‌నగర్, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ మండలంలోని 3వ నంబర్ శాఖ ప్రాంతంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓ అరుదైన నక్షత్ర తాబేలు ఇంట్లోకి కొట్టుకొచ్చింది. మనీష్ నివాసంలోకి వచ్చిన తాబేలును గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు వేంపల్లి సెక్షన్ ఆఫీసర్ శశిధర్ బాబు, ఇస్లాం బీట్ ఆఫీసర్ ఎం.వాణి, వాచర్ దేవ్‌సింగ్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. తాబేలును సురక్షితంగా స్వాధీనం చేసుకున్న అధికారులు అనంతరం ఇస్లాం అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి వదిలిపెట్టారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు మాట్లాడుతూ నక్షత్ర తాబేలుకు వన్యప్రాణి సంరక్షణ చట్టం1972 ప్రకారం అత్యున్నత స్థాయి రక్షణ ఉందని తెలిపారు. వన్యప్రాణులను ఇంట్లో పెంచుకోవడం, అక్రమంగా తరలించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టంలోని సెక్షన్51 ప్రకారం నేరం రుజువైతే 3 నుంచి 7 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. వన్యప్రాణులు జనావాసాల్లోకి వచ్చినా లేదా కనిపించినా వాటిని పట్టుకోవడం, హాని చేయడం చేయకుండా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలు ఎనలేనివి

**- సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ టి. రాజశేఖర్ రెడ్డి**



మల్కాజిగిరి, సెప్టెంబర్ 25,(విజన్ ఆంధ్ర): పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలు ఎనలేనివని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ టి. రాజశేఖర్ రెడ్డి అన్నారు. బీజేపీ బన్సీలాల్ పేట్ డివిజన్ అధ్యక్షులు మహేష్ రామంచ, ప్రధాన కార్యదర్శి బంధం కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్ రెడ్డి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అందించిన అంత్యోదయ సిద్ధాంతం నేటికీ సమాజానికి మార్గదర్శకమని కొనియా డారు. ఆయన ఆశయా లను ప్రతి కార్యకర్త ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎస్. రాజు, అంగముత్తు శ్రీనివాస్, శివ రామకృష్ణ, కె.ఎం. కృష్ణ, కె. కృష్ణ, నగర నాయకులు ఎలకొండ శ్రీనివాస్ ముది రాజ్, ఆర్. సత్యనారా యణ, ఏ.సదానంద్, పులి భాస్కర్, వెంకటపతి రాజు, ఏ. గోవర్ధన్, మహిళా నాయకులు విద్యా మోహన్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి..

**- రీ సర్వే, భూ భారతి పనులను వేగవంతం చేయాలి,**
**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,**

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర): సెప్టెంబర్ 25 జిల్లా కలెక్టరేట్‌లో భూముల రీ సర్వే, భూ భారతి, రెవెన్యూ అంశాలపై అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్ బి. చెన్నయ్యలతో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో భూముల రీ సర్వే, భూ భారతి, రెవెన్యూ అంశాలపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియ పురోగతిపై మండలాల వారీగా వివరాలను జిల్లా కలెక్టర్ తహసిల్దార్లను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేలో ఎదురవుతున్న సమస్యలు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలి ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ..., భూముల రీ సర్వే ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో రీ సర్వేకు సంబంధించిన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, భూ రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భూ భారతి ద్వారా రైతులు, భూ యజమానులకు మెరుగైన సేవలు అందేలా రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అర్జీలను నిబంధనల




ప్రకారం పరిశీలించి, అర్హులైన వారికి సత్వరమే సేవలు అందించాలని ఆదేశించారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత దరఖాస్తులు, సమస్యలను మండలాల వారీగా సమీక్షిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. సర్వేయర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ రీ సర్వే పనులను వేగవంతం చేయాలని, పనుల పురోగతిపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సర్వ పూర్తి అయిన తర్వాత బౌండరీల వారీగా మ్యాపులను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ పాండు, డిప్యూటీ కలెక్టర్లు అశోక్, హర్షవర్ధన్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్,నాగర్ కర్నూల్ ఆర్డీవో అర్చన, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి,తహసీల్దార్లు, సర్వేయర్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# బొల్లం క్రిష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలి

*ఆయన మరణానికి రాంకి డంపింగ్ యార్డ్ యజమాన్యం బాధ్యత వహించలి.*

జవహర్ నగర్ సెప్టెంబర్ 25,(విజన్ ఆంధ్ర):బొల్లం క్రిష్ణ కుటుంబాన్ని ఆదుకోవా లని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి,ప్రజా కలమండలి జాన్ డిమాండ్ చేశారు. గబ్బిలాల పేట వైఎస్ ఆర్ నగర్ నివాసి బొల్లం కృష్ణ (37) నిన్న రాత్రి శ్వాసకోశ సమస్యతో మరణించాడు. ఈ సందర్భంగా గురువారం ఆయన జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ నేతలతో కలిసి, బొల్లం కృష్ణ భౌతిక కాయాన్ని సందర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అనంతరం జాన్ మాట్లాడుతూ.. బొల్లం కృష్ణ మరణం సహజ మరణం కాదని, ఇది ముమ్మాటికీ రాంకి డంపింగ్ యార్డ్ చేసిన పరోక్ష హత్యే అని ఆరోపించారు. జవహర్ నగర్ రాంకి డంపింగ్ యార్డ్ వలన గాలి, నీరు పర్యావరణ మంతా కాలుష్య మయమైపోయాయని ఆవేదన వెలిబుచ్చారు. ఈ డంపింగ్ యార్డ్ నుంచి వెదజల్లుతున్న విషవాయువులతో దాని చుట్టూ ఉన్న వివిధ కాలనీలలోని ప్రజలు అర్థాంతరంగా మరణిస్తూనే ఉన్నారని తెలిపారు. ఈ విషయం ప్రభుత్వానికి తెలియనిది కాదన్నారు. ఈ డంపింగ్ యార్డ్ ను వెంటనే ఇక్కడ నుంచి తొలగించాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో గడిచిన నాలుగు నెలలుగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఇకనైనా ఈ డంపింగ్ యార్డ్ ను వెంటనే తొలగించి,



ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొల్లం కృష్ణ కుటుంబానికి తగిన ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మరణానికి కారణమైన రాంకీ డంపింగ్ యార్డ్ యజమాన్యంపై చట్టపరంగా చర్యలు తీసుకొని, హత్యా నేరం కింద కేసు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని,పోలీసులను,సంబంధిత అధికారులను. స్థానిక ఎమ్మెల్యే ఎంపీ,ప్రజా ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కోకన్వీర్ గద్దం సదానందం, టి యు సి ఐ నాయకులు బి ప్రవీణ్,ఐ ఎఫ్ టియు నాయకుడు శివ బాబు,ఏఐ ఫ్ టియు నాయకులు మల్లేష్,స్థానిక కార్పొరేటర్ సుబ్రహ్మణ్యం,చైతన్య మహిళా సంఘం నాయకులు జయ,శ్రీదేవి, అల్లూరి సావిత్రి,పి ఓ డబ్ల్యు సునీత,నందమూరి నగర్ వ్యవస్థాపకులు చికెన్ యాదగిరి,శారద తదితరులు పాల్గొన్నారు,

# ఘనంగా 'డైమండ్' రెస్టారెంట్ ప్రారంభం

హైదరాబాద్ సెప్టెంబర్ 2026, విజన్ ఆంధ్ర (అకెళ్ళ విశ్వనాథ్) : మంచి ఆహారం మంచి వ్యక్తులను ఒకచోట చేర్చుతుందనే మంచి ఆలోచనతో హైదరాబాద్ నగర వాసులకు ఒక కొత్త రీతిలో అన్ని వెరైటీల రుచికరమైన ఆహారాన్ని ఒకే చోట అందజేయాలన్న సంకల్పంతో, కొత్త అనుభవాన్ని, అనుభూతిని ఆహ్లాదకరమైన వాతావరణంలో అందించాలనే ఉద్దేశంతో "డైమండ్" ఫుడ్ ట్రక్, చాట్, జ్యూస్ డ్రైవ్ ఇన్, రెస్టారెంట్, మందీ ని గ్రాండ్ గా ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ప్రారంభించామని రెస్టారెంట్ ప్రొప్రైటర్లు నాగరాజు, మొహమ్మద్ అయూబ్, మొహమ్మద్ ఆసిఫ్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం లక్డీకాపూల్ ప్రైవేట్ బస్సు పార్కింగ్, మెట్రో పిల్లర్ నెం. 1198 సమీపంలో ఏర్పాటు చేసిన ఈ "డైమండ్" 'ఫుడ్ ట్రక్, చాట్, జ్యూస్ డ్రైవ్ ఇన్' ఆరంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హైదరాబాద్ అసదుద్దీన్ ఒవైసీ హాజరై రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఎమ్మెల్యే నాంపల్లి మజీద్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, మాజీ కార్పొరేటర్ ఖైరతాబాద్ విజయ రెడ్డి ఇతర




ప్రముఖులు హాజరై రుచికరమైన డిషెస్ లను ఆస్వాదించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డైమండ్ ప్రొప్రైటర్లు మొహమ్మద్ అయూబ్, మొహమ్మద్ ఆసిఫ్, నాగరాజు మాట్లాడుతూ, డైమండ్ రెస్టారెంట్ లో అన్ని రకాల రుచికరమైన క్వాలిటీ స్టాండర్డ్స్ మెయిటేన్ చేస్తూ వెజ్, నాన్ వెజ్ హైదరాబాద్ బిర్యానీ, మంది బిర్యానీ, తందూరీ కబాబ్స్,షవర్మా, సౌత్ ఇండియన్ డిష్యస్ ఇడ్లీ, వడ, దోశ, ఉప్మా, పూరి, బోండా, పెసరట్టు అలాగే బేకరీ ఐటమ్స్ ఐస్ క్రీమ్స్, డ్రింక్స్, కాఫీ ముఖ్యంగా ఇరానీ చాయ్ తమ కస్టమర్లకు ఒకే రూఫ్ కింద అందజేస్తున్నట్లు తెలిపారు. రెగ్యులర్ ఏసీ సీటింగ్ ఏర్పాటుతో పాటుగా తమ' డైమండ్ రెస్టారెంట్' లో పార్టీలు, ఫ్యామిలీ ఫంక్షన్స్ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రైవేట్ ఆర్డర్లు ఇతర విచారణల కోసం 919393737312 నెంబర్ పై తమను సంప్రదించ వచ్చని తెలిపారు. స్విగ్గి, జొమాటో తో కూడా తాము టైఅప్ చేసుకున్నట్లు తెలుపుతూ, త్వరలోనే మరిన్ని డైమండ్ రెస్టారెంట్ బ్రాంచ్ లను తెరవనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలియజేశారు.

## వయోవృద్ధుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమం అందరి బాధ్యత

**- జిల్లా సంక్షేమ అధికారి కే. సుధారాణి**
**- వనపర్తి ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ఘనంగా ఉచిత ఆరోగ్య శిబిరం**







వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 25(విజన్ ఆంధ్ర) : వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి భద్రత మరియు సంక్షేమం పట్ల సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా సంక్షేమ అధికారి కే. సుధారాణి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం వనపర్తి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ (డీఎంహెచ్ఓ) సమన్వయంతో శ్రీ చౌడేశ్వరి ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఓల్డ్ ఏజ్ హోమ్‌లో నివసిస్తున్న వయోవృద్ధులకు వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అవసరమైన వారికి తగిన వైద్య సలహాలు అందించడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వయోవృద్ధులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా సకాలంలో గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా అధికారులకు దబ్యూఓ సూచించారు. అనంతరం కే. సుధారాణి మాట్లాడుతూ.. వయోవృద్ధులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, వారిని గౌరవం మరియు ఆదరణతో చూసుకోవడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొని వయోవృద్ధులకు వివిధ వైద్య సేవలు అందించారు. అనంతరం వయోవృద్ధుల పట్ల ఎల్లప్పుడూ గౌరవం, ఆదరణ, సేవా భావంతో వ్యవహరిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు, శ్రీ చౌడేశ్వరి ఓల్డ్ ఏజ్ హోమ్ సిబ్బంది, ఇతర ప్రతినిధులు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

## పల్లే ప్యారడైస్ కాలనీలో ఘనంగా వినాయక నిమజ్జనం..!



కాప్రా/సెప్టెంబర్ -25(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) దపల్లే ప్యారడైస్ కాలనీలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణేశుని లడ్డూ వేలంలో కాలనీ వాస్తవ్యులు బాకారం గోవర్ధన్ రెడ్డి రూ. 3,23,000లకు లడ్డూను దక్కించుకున్నారు. వేలం అనంతరం కాలనీ వాసులు హర్షధ్వానాల మధ్య గణేశుని లడ్డూను గోవర్ధన్ రెడ్డి కి అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాలనీ వాసులందరూ వినాయక విగ్రహంతో ఊరేగింపుగా వెళ్లి, భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శి. శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి కే. శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మి రంజని, కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**
**- భూముల రీ-సర్వేను నాణ్యతతో పూర్తి చేయాలి**
**- ఈ వారాంతంలోగా గరిష్టంగా దరఖాస్తుల పరిష్కారానికి ఆదేశం**
**- సోమవారం రెవెన్యూ మంత్రి పర్యటనకు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలి**




వనపర్తి జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 25(విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లాలో భూ భారతి పెండింగ్ దరఖాస్తులను ఈ వారాంతంలోగా వీలైనన్ని ఎక్కువ పరిష్కరించాలని, అదేవిధంగా భూముల రీ-సర్వే ప్రక్రియను అత్యంత నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి జిల్లాలోని తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, భూముల రీ-సర్వే పురోగతిపై శాఖల వారీగా సమీక్షించి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. సమావేశంలో కలెక్టర్ జారీ చేసిన ముఖ్య ఆదేశాలు జిల్లాలోని ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో జరుగుతున్న




భూముల రీ-సర్వే ప్రక్రియపై సంబంధిత తహసీల్దార్లకు పూర్తి అవగాహన ఉండాలి. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా, నాణ్యతతో సర్వే పూర్తి చేయాలి. సాదా బైనామా దరఖాస్తుల స్పష్టత: పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఈ వారాంతంలోగా పరిష్కరించాలి. ముఖ్యంగా సాదా బైనామా దరఖాస్తుల విషయంలో నిబంధనలకు లోబడి పరిశీలన జరపాలి. ఒకవేళ ఏవైనా దరఖాస్తులను తిరస్కరిస్తే, అందుకు గల స్పష్టమైన కారణాలను తప్పనిసరిగా ఆన్‌లైన్/రాతపూర్వకంగా నమోదు చేయాలి. ప్రజలకు భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకూడదు. బాధితులకు వేగంగా న్యాయం జరిగేలా రెవెన్యూ యంత్రాంగం పనిచేయాలి.

రెవెన్యూ మంత్రి పర్యటనకు సన్నాహాలు

వచ్చే సోమవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వనపర్తి జిల్లాకు విచ్చేయనున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి రెవెన్యూ శాఖ పురోగతి, సమస్యలు మరియు ఇతర అంశాలపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నందున, అధికారులు అందరూ పూర్తిస్థాయి నివేదికలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వెబెక్స్ సమీక్షా సమావేశంలో ఆర్‌డీఓ సుబ్రహ్మణ్యం, కలెక్టరేట్ రెవెన్యూ విభాగ సూపరిండెంట్లు, వివిధ మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# డెంగ్యూ నివారణకు 'డ్రై డే' పకడ్బందీగా అమలు చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**
**- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నాణ్యతా ప్రమాణాల ప్రకారం చేపట్టాలి**
**- లబ్ధిదారులు ప్రైవేట్ అప్పులు చేయకుండా ఎస్ హెచ్ జి రుణాలు అందివ్వాలి**
**- రాంనగర్ కాలనీలో 'ఫ్రైడే డ్రై డే', 4వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 25(విజన్ ఆంధ్ర) డెంగ్యూ, సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం నిర్వహించే 'డ్రై డే' కార్యక్రమాన్ని నామమాత్రంగా కాకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. వనపర్తి పట్టణంలోని రాంనగర్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన డ్రై డే అమలు తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలోని పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు, దోమల వ్యాప్తికి అనుకూలంగా ఉన్న ప్రాంతాలను తనిఖీ చేసి, నివారణ చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇటీవల డెంగ్యూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల పరిసరాలు, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ పాత్రల్లో నీరు నిల్వ కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పారిశుధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

*ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల నాణ్యత పరిశీలన*



అనంతరం వనపర్తి పట్టణంలోని 4వ వార్డులో నిర్మాణంలో ఉన్న కురుమమ్మ, ఎల్లమ్మ అనే లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యత, పురోగతి, లబ్ధిదారులకు అందుతున్న ప్రభుత్వం బిల్లుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం కోసం అధిక వడ్డీలకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు తీసుకోకుండా, అవసరమైన ఆర్థిక సహాయం కోసం స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి) ద్వారా రుణాలు పొందేలా అధికారులు సహకరించాలని సూచించారు. అలాగే, ఇళ్ల నిర్మాణంలో బేస్‌మెంట్లు (పునాదులు) అవసరానికి మించి ఎక్కువ ఎత్తులో నిర్మించకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలు మరియు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విఠోభా, స్థానిక కౌన్సిలర్లు పరశురాం, శరవంద, స్థానికుడు లక్ష్మణ్, వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ పట్టణం లో ఘనంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర

- ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి
- ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపు





ఆదిలాబాద్ బ్యూరో సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర) : ఆదిలాబాద్ పట్టణంలో హిందూ సమాజ్ ఉత్సవ సమితి, ఎదులాపురం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నిమజ్జన సార్వజనిక శోభాయాత్ర శుక్రవారం శ్రీ సరస్వతి శిశు మందిర్, వినాయక్ చౌక్ నుంచి భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా ప్రారంభమైంది. పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, శాసనసభ్యులు పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, వార్డు కౌన్సిలర్ ఆకుల రేవతి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలు కేవలం పండుగలకే పరిమితం కాకుండా సమాజంలో ఐక్యత, భక్తిభావం, సోదరభావాన్ని పెంపొందించే గొప్ప సాంస్కృతిక సంప్రదాయమన్నారు. జిల్లాలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గణేష్ ఉత్సవాలను నిమజ్జన కార్యక్రమంతో అదే భక్తిభావంతో పూర్తి చేసుకోవాలని కోరారు. శోభాయాత్రలో సంప్రదాయ వాయిద్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, వినాయక చవితి ఉత్సవాలు మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలని అన్నారు. సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు జిల్లా యంత్రాంగం, పోలీసులకు సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, గణేష్ నిమజ్జన శోభాయాత్రకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు సూచించిన రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మున్సిపాలిటీ ద్వారా గత ఏడాది కంటే అధికంగా రూ.37 లక్షలు, సీసీ కెమెరాల నిర్వహణకు రూ.25 లక్షలు, రోడ్డు మరమ్మతులకు రూ.5 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. గణేష్ ఉత్సవాలను డీజేలకు దూరంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, శోభాయాత్ర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరఫున అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భక్తులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచారక్, ఇందూర్ విభాగ్ సహ విభాగ్ ప్రచారక్ మీసరి ప్రకాష్ ప్రధాన వక్తగా హాజరై దిశానిర్దేశం చేశారు. అనంతరం శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో ప్రతిష్ఠించిన గణనాథునికి ముఖ్య అతిథులు ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, హిందూ ఉత్సవ సమితి సభ్యులు లచ్చన్న, ప్రవీణ్, పట్టణ ప్రముఖులు, భక్తులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూసాపేట్ కా రాజా గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో): నవ యువక యూత్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మరియు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీ-బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఆహ్వానం మేరకు మూసాపేట్ కా రాజా మహా గణపతి నిమజ్జన కార్యక్రమానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్. ఈ సందర్భంగా మూసాపేట్ కా రాజా మహా గణపతి నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా సాగాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, లక్ష్మణ్, రమణ, అస్లాం, కుమారస్వామి , జగదీష్ , వాసు,నవ యువక యూత్ అసోసియేషన్ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ప్రగతి నగర్ ఎన్ ఆర్ ఐ కాలనీలో గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ కొలన్ హన్మంత్ రెడ్డి



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబరు 25 (విజన్ ఆంధ్ర బ్యూరో): ఎన్ఆర్ఐ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం హనుమంత్ రెడ్డి గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 276 ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి, 294 బహదూర్‌పల్లి డివిజన్ అధ్యక్షులు మైసగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అలేటి శ్రీనివాస్, రామచందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

-డేటా అనలిస్ట్ నుంచి హెల్త్‌కేర్ వరకు ప్రత్యేక కోర్సులు

-టాస్క్ ద్వారా శిక్షణ.. అనంతరం ప్లేస్‌మెంట్

-టాస్క్ శిక్షణతో ఉద్యోగం సాధించిన మణిశ్రీకి కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందన




పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25(విజన్ ఆంధ్ర) జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తూ స్థానిక యువతకు ఉపాధి, నైపుణ్య శిక్షణ అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ కంపెనీల ప్రతినిధులతో 'ఎంప్లాయిమెంట్, ట్రైనింగ్, ఇండస్ట్రీ, ఎంగేజ్‌మెంట్'పై సమీక్ష నిర్వహించారు. యువత అర్హతలు, ఆసక్తులకు అనుగుణంగా డేటా అనలిస్ట్, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, రిటైల్, ప్రొడక్ట్ డిజైన్ తదితర రంగాల్లో శిక్షణ ఇచ్చి ప్లేస్‌మెంట్ కల్పించాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన వారికి కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. బాలికలు, మహిళల కోసం 30 రోజుల స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. టాస్క్ ద్వారా శిక్షణ, ప్లేస్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వర్క్ ఫ్రమ్ హోమ్, సోలార్, ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఉపాధి అవకాశాలను అన్వేషించాలని సూచించారు. తగిన సంఖ్యలో యువతను సిద్ధం చేసిన అనంతరం నియామక డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. పెద్దపల్లి టాస్క్ సెంటర్‌లో శిక్షణ పొంది ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించిన ముస్త్యాల మణిశ్రీని కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్, రీజినల్ టాస్క్ సెంటర్ (ఇంచార్జ్) కౌసల్య ,వివిధ కంపెనీల ప్రతినిధులు శ్యామ్, హరిహర్, వంశీ, అర్జున్ , సంబంధిత , అధికారులు పాల్గొన్నారు.

## 6.సెక్టార్లు, 11 క్లస్టర్లుగా నిమజ్జన బందోబస్తు 400 మంది పోలీసులతో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు: ఎస్పీ నితికా పంత్




కాగజ్ నగర్ సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు మొత్తం 400 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించినట్లు పేర్కొన్నారు. ఏఎస్పీ ఒకరు, డీఎస్పీలు ఇద్దరు, సీఐలు 12 మంది, ఎస్సైలు 28 మంది ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జన శోభాయాత్ర సాగే మార్గాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. శోభాయాత్రను మొత్తం ఆరు సెక్టార్లు, 11 క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి సెక్టార్, క్లస్టర్ పరిధిలో పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. శోభాయాత్ర మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గణేశ్ మండపాల నిర్వాహకులు, భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ సహకరించాలని ఎస్పీ నితికా పంత్ కోరారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీసు బందోబస్తు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# సార్వజనిక్ గణేష్ మండలి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



నిజామాబాద్, సెప్టెంబర్ 25 :( విజన్ ఆంధ్ర) వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు, సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, పుర ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాసన మండలి సభ్యుడు బి.మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ కూరగాయల ఉమారాణి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో దుబ్బ ప్రాంతంలోని సార్వజనిక్ గణేష్ మండలి వద్దకు ప్రజాప్రతినిధులు, అధికారులు చేరుకుని, వినాయక నిమజ్జన శోభాయాత్ర రథం వద్ద టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు వీరికి స్వాగతం పలికారు. ఇదే కూడలి వద్ద గల బాలగంగాధర్ తిలక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం సార్వజనిక్ గణేష్ మండలి అధ్యక్షుడు బంటు గణేష్ జెండా ఊపి శోభాయాత్ర రథాన్ని ప్రారంభించారు. అందంగా అలంకరించిన సార్వజనిక్ గణేష్ మండలి శోభాయాత్ర రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణేష్ నిమజ్జనోత్సవాన్ని ఆనందోత్సాహాల నడుమ, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భుజంగరావు కోరారు. శోభాయాత్రకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం తరఫున అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. వినాయక విగ్రహాలను విసర్జనం చేసే యంచ, ఉమ్మెడతో పాటు అన్ని మండల కేంద్రాలలో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. నిమజ్జోనోత్సవం సాఫీగా సాగేలా పర్యవేక్షించేందుకు సెక్టోరల్ అధికారులను నియమించామని తెలిపారు. నిమజ్జన ప్రదేశాల వద్ద ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, సరిపడా సంఖ్యలో క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. అన్ని శాఖలు పరస్పరం సమన్వయంతో పని చేస్తున్నాయని, బారికేడ్లు, విద్యుత్ దీపాలు వంటి వసతులు నెలకొల్పామన్నారు. కాగా, శోభాయాత్ర సందర్భంగా సుమారు రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

# బోర్డు పరీక్షలకు ఇప్పటినుంచే సన్నద్ధం కావాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 25,(విజన్ ఆంధ్ర); పదవ తరగతి బోర్డు పరీక్షలకు విద్యార్థులంతా ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికలతో సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోని ప్రభుత్వ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శు క్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అధికారులతో కలిసి పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతిరోజు విద్యార్థులందరికీ మెనూ ప్రకారం అన్ని వేళల్లో నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన వసతి కల్పిస్తూ, మెరుగైన విద్యను అందించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ పూర్తి సంఖ్యలో ప్రతిరోజు పాఠశాలకు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న భోజనం, విద్య తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడుతూ, వారికి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా, అన్ని వసతులు కల్పిస్తున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సబ్జెక్టుల్లో సిలబస్ ఎంతవరకు పూర్తయిందో అడిగారు. విద్యార్థులందరూ బోర్డు పరీక్షలకు ఇప్పటినుంచే సన్నద్ధం కావాలన్నారు. ప్రతి సబ్జెక్టుకు తగిన సమయం కేటాయించి, ప్రణాళిక ప్రకారం చదివి, బోర్డు పరీక్షల్లో సత్తా చాటాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. సబ్జెక్టుల్లో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులను అడిగి వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులందరూ ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. బోర్డుపై విద్యార్థులతో గణిత సమస్యలను సాధింపజేశారు. లెక్కలు చేసిన విద్యార్థులను అభినందించి, వారికి పెన్నులను బహుమతులుగా ఇచ్చి వారిలో ఉత్సాహం నింపారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ సంతోష్, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

# వయోవృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- బస్తీ దవాఖానలో రెండో రోజు ఉచిత ఆరోగ్య శిబిరం




గద్వాల సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో) : వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, వారోత్సవాల్లో భాగంగా వారికి అవసరమైన సేవలను అందిస్తున్నామని జిల్లా సంక్షేమ అధికారి సునంద తెలిపారు. శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,బస్తీ దవాఖానలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం2026 సందర్భంగా వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో వయోవృద్ధులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా కంటి పరీక్షలు, ఎముకలకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వైద్యుల సూచనల మేరకు అవసరమైన మందులను ఉచితంగా అందించినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశాల మేరకు,శాఖ ఉన్నతాధికారుల సూచనలతో ఈ ఆరోగ్య శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ సంధ్యా కిరణ్మయి సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.వయోవృద్ధుల ఆరోగ్య వివరాలను వైద్యులకు తెలియజేస్తూ,వారికి అవసరమైన వైద్య సేవలు అందేలా డే కేర్ సెంటర్ నిర్వాహకులు మహేష్ నాయుడు, సిబ్బంది సహకరించినట్లు తెలిపారు. వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, వారోత్సవాల్లో భాగంగా వారికి అవసరమైన సేవలు అందించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మహిళా,శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సిబ్బంది,డే కేర్ సెంటర్ నిర్వాహకులు,వయోవృద్ధులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ సెస్ బకాయిలను త్వరగా వసూలు చేయాలి

*గ్రంథాలయ సెస్ వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు*



గద్వాల సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గ్రంథాలయ సెస్ వసూళ్లలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని అదనపు కలెక్టర్ నర్సింగ రావు ఆదేశించారు. శు క్రవారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ సెస్ వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పంచాయతీ, మున్సిపల్ అధికారులు ఇంటి పన్నుల్లోని 0.8 శాతం గ్రంథాలయ సెస్‌ను వసూలు చేసి జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఉన్న గ్రంథాలయ సెస్ బకాయిలను త్వరగా వసూలు చేసి, జిల్లా గ్రంథాలయ సంస్థ, జోగులాంబ గద్వాల ఖాతాలో జమ చేయాలని సూచించారు.గ్రంథాలయ సెస్ వసూళ్లలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఎం. మనోజ్ కుమార్,జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ యూత్ క్లబ్ వినాయకుడి నిమజ్జనోత్సవం ప్రారంభం..



కామారెడ్డి బ్యూరో (దోమకొండ) సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయం ఆవరణలోని వినాయక శోభయాత్రను శుక్రవారం సర్పంచ్ ఐరేణి నరసయ్య మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్ ఎస్సై ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వినాయక మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే బొజ్జు ఆకస్మిక తనిఖీ



ఉట్నూర్, సెప్టెంబర్ 25, (విజన్ ఆంధ్ర) : ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్యులు, నర్సుల అందుబాటుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్యం, సదుపాయాలు, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రత, శానిటైజేషన్ పక్కాగా పాటించాలని సూచించారు. అత్యవసర సమయాల్లో రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్యులు, నర్సులు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

## సాహితి ఇన్ఫ్రా కేసులో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడి సమన్లు

**రూపాయలు 2.1 కోట్ల లావాదేవీలపై విచారణకు పిలుపు**

**తమకు ఎటువంటి నోటీసులు అందలేదన్న ఎమ్మెల్యే గాంధీ పిఏ గంగుల రమేష్....!**



శేరిలింగంపల్లి. సెప్టెంబర్ 25; (విజన్ ఆంధ్ర) : సాహితి ఇన్ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మనీలాండరింగ్ కేసులో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడి సమన్లు జారీ చేసినట్టు సమాచారం సెప్టెంబర్ 27 న విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్లు తెలుస్తుంది. సాహితి ఇన్ఫ్రా నుంచి ఎమ్మెల్యే గాంధీ బ్యాంకు ఖాతాల ద్వారా సుమారు రూ. 2.1. కోట్లు బదిలీ అయినట్టు ఈడిదర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఈ లావాదేవీల స్వభావం, నిధుల వినియోగం, వాటికి సంబంధించిన వ్యాపార కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలుస్తుంది. సాహితి ఇన్ఫ్రా ప్రాజెక్టుల్లో కొనగోలుదారుల నుంచి భారీగా నిధులు సేకరించి మోసం చేశారన్న ఆరోపణలపై దర్యాప్తుకొనసాగుతుంది. అయితే ఎమ్మెల్యే గాంధీ పిఏ గంగుల రమేష్ స్పందిస్తూ తమకు ఎలాంటి నోటీసులు అందలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లారని తెలిపారు. దీంతో ఈడి నోటీసుల వ్యవహారం పై స్పష్టత రావాల్సి ఉంది.


# ఘనంగా దీన్ దయల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు

**- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. రామచంద్ర రెడ్డి**




అయిజ సెప్టెంబర్ 25( విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో బిజెపి పార్టీ శ్రేణులు శుక్రవారం దీన్ దయల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు రెండు జెండాలు ఉండరాదు ఒకే దేశం ఒకే జెండా ఉండాలని చాటి చెప్పిన గొప్ప మహనీయుడు ఉపాధ్యాయ దిన్ దయల్ అని అన్నారు.అదేవిధంగా అంత్యోదయ అనగా దేశంలో ఉన్నటువంటి చిట్టచివరి వ్యక్తికి ప్రతి అభివృద్ధి ఫలాలు అందాలనే ఆయన ఆశయం అని కొనియాడారు.మనిషి శరీరం మనసు బుద్ధి, జ్ఞానం అన్ని ఆత్మ అభివృద్ధి జరగాలి కేవలం డబ్బు మాత్రమే కాదు అప్పుడే ఏకాదత్మ మానవతవాదం జరిగినట్టు అవుతుందని తెలిపారు. సమాజంలో చివరి వ్యక్తి అభివృద్ధి దేశం నిజమైన అభివృద్ధి అని అన్నారు. ఆయన ఆయన జయంతిని అంత్యోదయ దివాస్ దినంగా కూడా చెప్పుకుంటారని తెలిపారు.వారు కన్నా కలలను నేడు దేశ ప్రధాని ప్రియతమ నేత నరేంద్ర మోడీ నిజం చేస్తున్నటువంటి వ్యక్తి మోడీ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, నాయకులు భీమన్న, శ్రీకాంత్ ,వీరేష్, బోయ వెంకటేష్, రఘువీరారెడ్డి, మేడికొండ రఘు, నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సాఫ్లీలోకి మళ్లీ ఏనుగుల గుంపు



ఆసిఫాబాద్, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దులోని మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లా సాఫ్లీ తాలూకాలోకి ఏనుగుల గుంపు మళ్లీ ప్రవేశించింది. గడ్చిరోలి ప్రాంతం నుంచి వైన్గంగా నది దాటి వచ్చిన ఏనుగులు కరోలి, అకాపూర్, గేవర శివారు ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు సమాచారం. ఏనుగుల కదలికలతో ఆయా గ్రామాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. గతంలో ఏనుగుల దాడిలో ఒకరు మృతి చెందిన ఘటన చోటుచేసుకోవడంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏనుగుల కదలికలను అటవీశాఖ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్లవద్దని, ఒంటరిగా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏనుగులు కనిపిస్తే వాటి దగ్గరకు వెళ్లి ఫొటోలు, వీడియోలు తీయడం, వాటిని తరిమేందుకు ప్రయత్నించడం చేయవద్దని ఖీ=ా హెచ్చరించారు. ఏనుగులను రెచ్చగొట్టడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏనుగులు కనిపించిన వెంటనే సమీప అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రత కోసం అటవీశాఖ సిబ్బంది పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

# రైతుకార్మిక హక్కుల కోసం కదలిరండి..!

**- చలో ఖమ్మం.. ఏఐకేఎంఎస్ 4వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి**




మల్దకల్ సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర ) : రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పేద ప్రజల హక్కుల కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని ఐఎఫ్ టియు.జిల్లా అధ్యక్షులు జమ్మిచేడు కార్తీక్, పిడిఎస్ యు.జిల్లా అధ్యక్షులు హాలింపాష పిలుపునిచ్చారు. జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో ఏఐకేఎంఎస్ 4వ జాతీయ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల సమస్యలు, వ్యవసాయ కూలీల కష్టాలు, కార్మికుల హక్కులపై జరుగుతున్న నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో ఖమ్మంలోని కామ్రేడ్ రాయల, సుభాష్ చంద్రబోస్, రవన్న గ్రౌండ్‌లో ఏఐకేఎంఎస్ 4వ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభల సందర్భంగా జరిగే బహిరంగ సభకు ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు కామ్రేడ్ వేములపల్లి వెంకటరామయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పేదలు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో ఖమ్మం చేరుకుని ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు తిమ్మప్ప, ముని, నర్సింహులు, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కార్యసిద్ధి విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ గణపతి పూజ

**- భక్తిశ్రద్ధలతో దీపాలంకరణ పూజ**



బోడుప్పల్, సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : బోడుప్పల్ సర్కిల్ దేవేందర్‌నగర్ కాలనీలోని శ్రీ కార్యసిద్ధి విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక దీపాలంకరణ పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.గణనాథుడికి హారతి ఇచ్చి భక్తి పాటలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఉత్సవాల్లో భాగంగా మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని దీపాలను వెలిగించడంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు జోగు నరేష్,మైల మల్లేష్,తుప్పత్తి నరేష్,బండ మహేందర్,బండ రవీందర్,జోగు రమేష్,హన్మంత్ రాజు,దయాల సాయికుమార్,దయ్యాల క్రాంతి కుమార్,మరాటి చంద్రశేఖర్,మరాఠి యశ్వంత్,మరాఠీ సాయి తేజ కాలనీ వాసులు,యువతీ యువకులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాఫీ నిమజ్జనమే లక్ష్యం.. అప్రమత్తంగా యంత్రాంగం

**- నిమజ్జన కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించిన ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి**



మల్కాజిగిరి జిల్లా,సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): గణేష్ నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంతరాలు లేకుండా సురక్షితంగా,ప్రశాంతంగా జరిగేలా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఎంఎంసీ పరిధిలోని పలు నిమజ్జన కేంద్రాలను సందర్శించిన కమిషనర్.. అక్కడ ఏర్పాటు చేసిన సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ,సిబ్బంది విధులు, భద్రతా ఏర్పాట్లు, నిమజ్జన ప్రక్రియ కొనసాగుతున్న తీరును పరిశీలించారు.

***భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు***

నిమజ్జన కేంద్రాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు,విద్యుత్ వెలుగులు, మొబైల్ టాయిలెట్లు,వైద్య సదుపాయాలు,క్రేన్లు,సూచిక బోర్డులు అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. వినాయక విగ్రహాలతో వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

***వ్యర్థాల తొలగింపుపై ప్రత్యేక దృష్టి***

నిమజ్జనం అనంతరం ఏర్పడే పూలు, హరిత వ్యర్థాలు,ఇతర చెత్తను వెంటనే సేకరించి వేరు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కేంద్రాలు, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడంతో పాటు చెరువులు, వాటి పరిసరాల పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.నిమజ్జన విధుల్లో ఉన్న సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కమిషనర్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

***సూచనలు పాటించాలి***

గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా,సాఫీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. నిమజ్జన కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బందికి భక్తులు సహకరించాలని, నిర్దేశించిన మార్గాలు,సూచనలను పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా పూర్తి చేసుకోవాలని ఎంఎంసీ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మాతా శిశు సంరక్షణకు పెద్దపీట

**- రిమ్స్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ప్రత్యేక వార్డులు**
**- అగ్ని ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియ**
**- రిమ్స్‌ను సందర్శించి వైద్య సేవలు, భద్రతా ప్రమాణాలను సమీక్షించిన కలెక్టర్ రాజర్షి షా**




ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర) : ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఇటీవల నవజాత శిశువుల వార్డులో చోటుచేసుకున్న అగ్ని ప్రమాద ఘటన అత్యంత బాధాకరమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఆసుపత్రిలో భద్రతా ప్రమాణాలను మరింత పటిష్ఠం చేస్తున్నామని తెలిపారు. మాతా శిశు మరణాలను తగ్గించడంతో పాటు, నవజాత శిశువులకు అత్యుత్తమ వైద్య సేవలు స్థానికంగానే అందేలా రిమ్స్‌లో ప్రత్యేక ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులతో కలిసి రిమ్స్‌ను సందర్శించిన కలెక్టర్, క్రిటికల్ కేర్ వార్డు, పీడియాట్రిక్స్ విభాగం, మొదటి అంతస్తులోని ఐసీయూ వార్డుతో పాటు పలు విభాగాలను పరిశీలించారు. ఎయిమ్స్ వైద్యులతో కలిసి చిన్నారులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, సిబ్బంది పనితీరు, అత్యవసర వైద్య సదుపాయాలను సమీక్షించారు. రిమ్స్ పీడియాట్రిక్స్ విభాగంలో నవజాత శిశువుల కోసం ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. తల్లులు, చిన్నారుల సౌకర్యార్థం మదర్ బెడ్స్‌తో పాటు ప్రత్యేక బెడ్లను ఏర్పాటు చేశామన్నారు. ఆక్సిజన్ లైనింగ్, బేబీ వార్మర్లు, సిపిఏపి సపోర్ట్, వెంటిలేటర్లు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌క్యుబేటర్ వంటి అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మొత్తం 34 బెడ్లను ఏర్పాటు చేయగా, 23 బెడ్లకు డైరెక్ట్ ఆక్సిజన్ సదుపాయం, 11 బెడ్లకు సిపిఏపి సపోర్ట్ అందుబాటులో ఉందన్నారు. మాతా శిశు వైద్య నిపుణులు, పీడియాట్రిషియన్లు, ప్రత్యేక శిక్షణ పొందిన స్టాఫ్ నర్సులు నిరంతరం అందుబాటులో ఉంటూ చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తారని తెలిపారు. రిమ్స్ అగ్ని ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని భరోసా ఇచ్చారు. అగ్ని ప్రమాద ఘటనపై సమగ్రంగా పరిశీలించేందుకు ప్రత్యేక మల్టీ డిసిప్లినరీ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలోని భద్రతా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించి, లోపాలను గుర్తించి అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కొంతమంది చిన్నారులు కోలుకుని ఇప్పటికే డిశ్చార్జ్ అయ్యారని, మరికొందరు వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఆరోగ్యంగా, నిలకడగా ఉన్నారని కలెక్టర్ తెలిపారు. అత్యవసరంగా మెరుగైన వైద్యం అవసరమైన చిన్నారులను సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ద్వారా హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. బుధవారం రాత్రి 15 మంది చిన్నారుల్లో ఏడుగురిని హైదరాబాద్‌కు సురక్షితంగా తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షిస్తున్నామని వివరించారు. మాతా శిశు సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, రిమ్స్‌లో వైద్య సేవల నాణ్యతతో పాటు భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

***బాధిత కుటుంబాలను పరామర్శించిన చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులు.....***

రిమ్స్ అగ్ని ప్రమాద ఘటనపై రాష్ట్ర చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులు మరిపెల్లి చందన, ప్రేమలత అగర్వాల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం వారు రిమ్స్‌ను సందర్శించి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ప్రమాదంలో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేతను వారు ప్రస్తావించారు. చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని మహిళా కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తుందని తెలిపారు. అగ్ని ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని అధికారులను ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు మహిళా కమిషన్ తరఫున పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, డీడబ్ల్యూఓ మిల్కా, బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, వైద్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంత్యోదయ సిద్ధాంతం ఎంతో గొప్పది

**- దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా**



నిజామాబాద్ సెప్టెంబర్25:( విజన్ ఆంధ్ర) దీన్ దయాళ్ ఉపాధ్యాయ అందించిన అంత్యోదయ సిద్ధాంతం ఎంతో గొప్పదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి పురస్కరించుకొని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సమాజంలోని చివరి వరుసలో ఉన్న వ్యక్తి అభివృద్ధి చెందే వరకు దేశ అభివృద్ధి పూర్తికాదనే ఆలోచన అంత్యోదయ సిద్ధాంతంలో ఉందన్నారు. భారతీయ ఆలోచనా విధానానికి, దేశసేవకు, సామాజిక సమరసతకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అన్నారు. రాజకీయాన్ని కేవలం అధికార సాధనంగా కాకుండా సమాజసేవకు ఒక మార్గంగా చూడాలనే భావనతో ఆయన పనిచేశారన్నారు. దీనదయాళ్ ఉపాధ్యాయ దేశానికి అందించిన అత్యంత ముఖ్యమైన ఆలోచనల్లో "ఏకాత్మ మానవవాదం" ఒకటని గుర్తుచేశారు. మనిషి, సమాజం, దేశం, ఇవన్నీ పరస్పరం అనుసంధానమై ఉన్నాయని వివరించారు. దీనదయాళ్ ఉపాధ్యాయ గారి జీవితం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తుందన్నారు. దేశం కోసం ఆలోచించాలి, సమాజం కోసం పనిచేయాలి, చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత, ఎస్సీ మోర్చ అధ్యక్షులు పురుషోత్తం, కార్పొరేటర్లు శ్రావణ్ కుమార్, స్రవంతి వినోద్ రెడ్డి, ప్రసూన శ్రీనివాస్, వైష్ణవి సుధా, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, సుమిత్ర కిషోర్, మండల అధ్యక్షులు గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే ప్రత్యేకం ఇందూరు వినాయకుడి శోభాయాత్ర

**- జెండా ఊపి ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**
**- దుబ్బ చౌరస్తా నుంచి వినాయకుల బావి వరకు రథం వెంట ఎమ్మెల్యే**



నిజామాబాద్ సెప్టెంబర్25:(విజన్ ఆంధ్ర) రాష్ట్ర రాజధాని తర్వాత ఇందూరులోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా వినాయకుడి శోభాయాత్ర కొనసాగుతుందని, ఎంతో ఘన చరిత్ర ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని దుబ్బ చౌరస్తాలో శుక్రవారం రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వాతంత్ర ఉద్యమంలో ఐక్యత కోసం బాలగంగాధర్ తిలక్ ఇచ్చిన పిలుపుమేరకు ఇందూరులోనూ వినాయకుడి రథయాత్ర ప్రారంభించారని గుర్తు చేశారు. 21 జతల ఎడ్లతో అంగరంగ వైభవంగా శోభాయాత్ర నగరంలోని ప్రధాన వీధుల మీదుగా ముందుకు సాగుతుందన్నారు. యువత భక్తమార్గంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, ఇందుకు ఇందూరు యువతే నిదర్శనమన్నారు. వందేళ్లుగా రథం శోభాయాత్ర సాంప్రదాయం కొనసాగుతుందన్నారు. ప్రధానంగా నగరంలోని పలు కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు శోభాయాత్ర ఆద్యాంతం సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**






మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25(విజన్ ఆంధ్ర) : మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ లైన్ ఉన్నత పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులను పరిశీలించారు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్, ఇదే విధంగా నిరంతరం పరిశుభ్రతను కొనసాగించాలని సూచించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు.

# ఎస్సీ డిపార్ట్‌మెంట్ జనరల్ సెక్రటరీలుగా సోల్మన్ రాజు, కోడమగుండ్ల అమృతయ్య:



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో)మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ జనరల్ సెక్రటరీలుగా సోల్మన్ రాజు, కోడమగుండ్ల అమృతయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హనుమంత్ రెడ్డి, సోల్మన్ రాజు , కోడమగుండ్ల అమృతయ్య ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతనంగా నియమితులైన జనరల్ సెక్రటరీలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ర్యాపిడో 'ఓన్లీ' ఫుడ్ డెలివరీ యాప్ ప్రారంభం



హైదరాబాద్, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర) : ప్రముఖ మొబిలిటీ ప్లాట్‌ఫారమ్ ర్యాపిడో తన స్వతంత్ర ఫుడ్ డెలివరీ యాప్ 'ఓన్లీ'ను హైదరాబాద్‌లో ప్రారంభించినట్లు ర్యాపిడో, ఓన్లీ సహ–స్థాపకుడు అరవింద్ సంక శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెంగళూరు తర్వాత ఓన్లీ సేవలు అందుబాటులోకి వచ్చిన రెండో నగరం హైదరాబాద్ అన్నారు. జీరో–కమిషన్ మోడల్‌లో పనిచేసే ఓన్లీలో రెస్టారెంట్లకు కమిషన్ ఉండదని, వినియోగదారులు ఆహారం, డెలివరీకి మాత్రమే చెల్లిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు సూపర్‌స్టార్ నాని పాల్గొని క్యాప్టెన్‌లతో ముచ్చటించారని చెప్పారు. హైదరాబాద్‌లో ఓన్లీ ప్రారంభంతో క్యాప్టెన్‌లకు అదనపు సంపాదన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

# లక్కీడ్రాలో లడ్డు గెలుపొందిన చిన్నారి శివాత్మిక



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25,(విజన్ ఆంధ్ర ) : వినాయక నవరాత్రి ఉత్సవాళ్ళో భాగంగా పట్టణంలోని గోపాల్వాడ హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం లో శుక్రవారం నిమజ్జనం సందర్భంగా లడ్డు లక్కీ డ్రా లో రాచకొండ శైలందర్ కూతురు శివాత్మిక గెలుచుకున్నారు.డ్రాలో గెలుపొందిన వారికి ఆలయ అర్చకులు నరసింహ చార్యులు కమిటీ సభ్యులు సన్మానించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాచకొండ శైలందర్ మాట్లాడుతూ ఆ మహా గణపతి లడ్డు ప్రసాదం లక్కీ డ్రాలో మాకూతురు గెలుపొందడం ఆనందంగా ఉందన్నారు. ఆ భగవంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

# భూసేకరణలో దళారుల చేతిలో మోసపోవద్దు

**- ఎక్కువ నష్టపరిహారం ఇప్పిస్తామంటూ మోసం చేసే మధ్యవర్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**- కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25(విజన్ ఆంధ్ర) : జిల్లాలో భూసేకరణకు సంబంధించి నష్టపరిహారం ఇప్పిస్తామంటూ దళారులు, మధ్యవర్తులు డబ్బులు వసూలు చేస్తే నమ్మి మోసపోవద్దని కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన భూ బాధితులకు నష్టపరిహారం నేరుగా అందుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రామగుండం, ఎన్టీపీసీ, సింగరేణి, రాజాపూర్ ప్రాంతాల్లో సింగరేణి సంస్థకు సంబంధించిన భూసేకరణతో పాటు జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే మార్గాల నిర్మాణం, విస్తరణకు భూసేకరణ జరుగుతోందని తెలిపారు. ఈ ప్రక్రియలో కొందరు దళారులు, మధ్యవర్తులు ప్రవేశించి.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక నష్టపరిహారం ఇప్పిస్తామని అమాయక భూ యజమానులను నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని సంబంధిత అధికారులు నేరుగా బాధితులకు తెలియజేసి అందజేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. పరిశ్రమలు, సింగరేణి, జాతీయ రహదారులు, రైల్వే భూసేకరణ విషయంలో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, మోసపూరితంగా వ్యవహరించినా వెంటనే సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనధికార వ్యక్తులను నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని హెచ్చరించారు.

# కష్టపడి ఎంబీబీఎస్ సీటు సాధించిన పావని అకాల మరణం

***పావని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే విజయుడు, మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్***



అయిజ సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం లో అయిజ పట్టణ కేంద్రంలో 9వ వార్డు కు చెందిన అయిజ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాల నర్సింహులు తమ్ముడు మాల చింతలన్న కూతురు పావని (20) గత కొన్ని రోజులుగా హైదరాబాదు నందు నిమ్స్ హాస్పటల్లో చికిత్స పొందుతూ నిన్న సాయంత్రం 4 గంటల సమయంలో మరణించడం జరిగింది.ఇట్టి విషయం తెలుసుకున్న ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు,అయిజ మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ స్వయంగా వైస్ చైర్మన్ మాల నర్సింహులు నివాసానికి చేరుకొని పావని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ మనోధైర్యశీ చెప్పారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ వేమారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ , ప్రస్తుత కోఆప్షన్ నెంబర్ నాగన్న గౌడ్, కో ఆప్షన్ నెంబర్ మౌల, కౌన్సిలర్ శివ, డాక్టర్ కృష్ణ, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భద్రయ్య, జోల్లబ్బాయి, బిఆర్ఎస్వి అయిజ మండల అధ్యక్షుడు మత్తలి, లెనిన్ బాబు , అశ్వ మారెప్ప, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

**- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు**

**- విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ స్వామి ఆలయం, లక్ష్మీ నారాయణ ఆలయంలో శుక్రవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు డీసీపీ ఎగ్గడి భాస్కర్, మేయర్ ధర్ని మధుకర్ తో కలిసి గణనాథుడిని దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ గణపతి నిమజ్జనం భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు..గణపతి నిమజ్జనం సందర్భంగా భక్తులు, యువత, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, చిన్నారులు మరియు వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.వినాయకుని ఆశీస్సులతో మంచిర్యాల జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ని స్థానిక కార్పొరేటర్ మాదంశెట్టి సత్యనారాయణ, ఆలయాల కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, మంచిర్యాల జిల్లా ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు పూదరి తిరుపతి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గుండ సుధాకర్, కార్పొరేటర్లు , నాయకులు, గణేష్ ఉత్సవాల కమిటీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి పోలీసు ప్రధాన బాధ్యత

***పదోన్నతి పొందిన అధికారికి స్టార్స్ తొడిగి, అభినందనలు తెలిపిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు***



గద్వాల సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లా పోలీస్ శాఖలో ఒక స్ఫూర్తిదాయక ఘటన చోటుచేసుకుంది. మల్దకల్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె. గోపాల్ గారు, తమ కృషి, నిబద్ధతకు ప్రతిఫలంగా ఏ.ఎస్సై గా పదోన్నతి పొందారు. ఈ సంతోషకరమైన సందర్భంగా ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్వయంగా పదోన్నతి పొందిన అధికారికి స్టార్స్ తొడిగి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ఉద్యోగ జీవితంలో పదోన్నతి అనేది కేవలం పదవిలో ఎదుగుదల మాత్రమే కాకుండా, బాధ్యతలు మరింతగా పెరిగే దశగా భావించాలి అని అన్నారు. పదోన్నతి ద్వారా వ్యక్తిలో కొత్త ఉత్సాహం, మరింత నిబద్ధత, సేవాభావం పెరగాలని ఆయన సూచించారు. అదేవిధంగా, విధులను నిర్వర్తించే సమయంలో ఆరోగ్యాన్ని కూడా సమానంగా కాపాడుకోవాలని, శారీరక, మానసికంగా దృఢంగా ఉండటం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని ఆయన వివరించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి పోలీసు సిబ్బంది ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.

# భగవాన్ అనంత పద్మనాభ స్వామి వ్రతంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు బాసు శ్యామల హనుమంతు నాయుడు



ధరూర్ సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం పెద్ద చింతరేవుల గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో పెద్ద చింతరేవుల అన్నప్రసాద ట్రస్ట్ సత్రంలో చాతుర్మాస దీక్షల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉడిపి పలిమార్ మఠం పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యాధీశ తీర్థ శ్రీపాదులు వారు, విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదులు వారిచే నిర్వహించిన భగవాన్ శ్రీ అనంత పద్మనాభ స్వామి వ్రతం కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గం ఇన్చార్జి బాసు శ్యామల హనుమంతు నాయుడు పాల్గొని, ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, మూల రాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాసు శ్యామల హనుమంతు నాయుడు ని పీఠాధిపతులు ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని బహుకరించి,శాలువతో సత్కరించి,ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉడిపి పలిమార్ మఠం పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యాధీశ తీర్థ శ్రీపాదులు వారు, విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదులు వారిచే చాతుర్మాస దీక్షల నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉంది అని, శ్రీ ఆంజనేయస్వామి, ఉడిపి పలిమార్ మఠం పీఠాధిపతుల ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అల్లపాడు ప్రతాప్, చక్రీధర్ రెడ్డి,లక్ష్మీకాంత్ రెడ్డి,వెంకటేష్ నాయుడు,తిమ్మప్ప గౌడ్,జాంపల్లి భరత్ సింహారెడ్డి,ముని రెడ్డి,డ్యామ్ శ్రీను, చంద్రశేఖర్, మణివర్ధన్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, అంజి, మాలిక్, గంగాధర్, అరవిందు, సవరన్న,మరియు నాయకులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ కళ్లెదుటే మద్యం దందా!

**- మందు అమ్మకాలకు 'డ్రై డే'లోనూ బ్రేక్ లేదు!**

**- కిరాణా కొట్టులో 'మందు' గుట్టు!**

**- 71.230 లీటర్ల విలువైన మద్యం స్వాధీనం**

**- ఉప్పల్ ఎస్వోటీ దాడి..మేడిపల్లి పోలీసులు కేసు నమోదు**

బోడుప్పల్,సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రభుత్వం మద్యం విక్రయాలపై ఆంక్షలు విధించి డ్రై డే ప్రకటించిన వేళ.. మద్యం అక్రమ విక్రయాలు వెలుగుచూడటం కలకలం రేపింది. ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే కిరాణా దుకాణం ముసుగులో మద్యం దందా సాగుతున్నట్లు ఉప్పల్ జోన్ ఎస్వోటీ పోలీసులు గుర్తించారు. మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధి నారపల్లి సురేందర్‌రెడ్డినగర్‌లోని స్వప్న కిరాణా దుకాణంపై శుక్రవారం ఎస్వోటీ పోలీసులు దాడి చేశారు. దుకాణంలో తనిఖీలు నిర్వహించగా వివిధ బ్రాండ్లకు చెందిన విస్కీ, బీరు బాటిళ్లు బయటపడ్డాయి.మొత్తం 71.230 లీటర్ల మద్యం,సుమారు రూ.45 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**కిరాణా దుకాణం.. లోపల మద్యం దందా!**

డ్రై డే నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు దుకాణ నిర్వాహకుడు శివాజీ జాదవ్ (45)ను అదుపులోకి తీసుకున్నారు.స్వాధీనం చేసుకున్న మద్యం,నిందితుడిని తదుపరి చట్టపరమైన చర్యల కోసం మేడిపల్లి పోలీసులకు అప్పగించారు.



**ఎక్సైజ్ స్టేషన్ సమీపంలోనే..**

అక్రమ మద్యం విక్రయాలు సాగినట్లు గుర్తించిన స్వప్న కిరాణా దుకాణం ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే ఉండటం చర్చనీయాంశంగా మారింది.ఎక్సైజ్ స్టేషన్‌కు సమీపంలోనే,అదీ ప్రభుత్వం డ్రై డే ప్రకటించిన రోజున మద్యం విక్రయాలు వెలుగుచూడటంతో స్థానికంగా పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఈ ఘటనపై మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అక్రమ మద్యం విక్రయాల వెనుక మరెవరైనా ఉన్నారా? మద్యం ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? అనే కోణాల్లోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

# మల్లన్న సాగర్ లో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లిస్తాం - జిల్లా కలెక్టర్ వెల్లడి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 25 సెప్టెంబర్ ( విజన్ ఆంధ్ర) : కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన ఆయా గ్రామాల నిర్వాసితుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి పరిష్కరిస్తామని తప్పనిసరిగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు.శుక్రవారం ములుగు మండలం కొండపోచమ్మ సాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీ మరియు గజ్వేల్ పట్టణంలో ముట్రాజ్ పల్లి పరిధిలోగల మల్లన్న సాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీ లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ రిజర్వాయర్ లకు అర్ అండ్ ఆర్ కాలనీల సమస్యలు చాలా కాలం నుండి పెండింగ్ లో ఉన్నాయని,నిర్వాసితులకు సంబంధించిన పరిహారం, పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు, ఇళ్ల స్థలాలు, ఇతర పెండింగ్ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి, వీటికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సంబంధించిన బడ్జెట్ మంజూరు కాగానే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రాజెక్టులకోసంభూములు త్యాగంచేసిననిర్వాసితులకు ప్రభుత్వం అందించాల్సిన ప్రయోజనాలు అర్హత మేరకు అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.కొండపోచమ్మ సాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో చెరువు పక్కన నిర్మాణం చేపడుతున్నారని చెరువు యొక్క ఎఫ్ టి ఎల్ బౌండరీ లు ఫిక్స్ చెయ్యాలని, దీనికి ఆనుకొని ప్లాట్స్ చెయ్యకూడదని ములుగు తహసిల్దార్ ను ఆదేశించారు.అర్ అండ్ ఆర్ కాలనీ నిర్వాసితులపునరావాసం కోసం భూ సేకరణ చేసి ఎవ్వరికి కేటాయించకుండా, ఎలాంటి నిర్మాణం చేపట్టని భూములను వెంటనే అధీనంలోకి తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇట్టి స్థలాలు ఆక్రమణకు, మరియు ఎలాంటి పంటలు వెయ్యకుండా ఎల్లప్పుడూ పర్యవేక్షణ చెయ్యాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ, సిద్దిపేట ఆర్డీఓ సదానందం, ఆయా మండల తహశీల్దార్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా అర్ అండ్ ఆర్ కాలనీల నిర్వాహకులుతదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో వైద్య శిబిరాన్ని పర్యవేక్షించిన డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 ( విజన్ ఆంధ్ర ) : వయో వృద్ధుల వారోత్సవాల లో భాగంగా అన్ని వృద్ధాశ్రమ ములలో మెడికల్ క్యాంప్ లను నిర్వహించడం జరిగింది అందులో భాగం గా ఈ రోజు పెద్దమ్మగడ్డ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని స్వయం కృషి మహిళా సొసైటీలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, సహృదయ వృద్ధాశ్రమమును అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మదన్ మోహన్ లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు, అవసరమైన మందుల పంపిణీ తదితర అంశాలను డీఎంహెచ్ఓ పరిశీలించారు. వృద్ధుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, వారికి అవసరమైన వైద్య సేవలను నిరంతరం అందించాలని సిబ్బందికి సూచించారు. వృద్ధుల్లో సాధారణ అనారోగ్య సమస్యలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ డాక్టర్ విజయరెడ్డి,డాక్టర్ సృజన, హెచ్ఈఓ సాయి ని వెంకటేశ్వర్లు, ప్రతాపగిరి ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు హరిప్రసాద్, మధు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వృద్ధాశ్రమం నిర్వాహకురాలు శుభశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# పోటాపోటీగా సాగిన శ్వేతార్క గణపతి లడ్డూ ప్రసాదం వేలంపాట

## 20 కిలోల లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకున్న బంగారి సౌమ్యసాయికృష్ణ దంపతులు



కాజీపేట న్యూస్ సెప్టెంబర్ 25 ( విజన్ ఆంధ్ర ) : కాజీపేటలోని స్వయంభు శ్రీ శ్వేతార్కమూల గణపతి దేవాలయంలో 16 రోజుల నవరాత్రి కల్యాణోత్సవములలో భాగంగా తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న 20 కిలోల లడ్డూ ప్రసాదానికి వేలంపాట నిర్వహించారు. భక్తుల మధ్య పోటాపోటీగా సాగిన ఈ వేలంపాటలో బంగారి సౌమ్య సాయికృష్ణ విజేతలుగా నిలిచి లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు.నవరాత్రోత్సవాల సందర్భంగా స్వామివారికి సమర్పించిన ఈ విశేష లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకోవడానికి భక్తులు ఉత్సాహంగా వేలంపాటలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేలంపాట ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**లక్కీ డిప్‌లో 5 కిలోల లడ్డూ ప్రసాదం**

అదేవిధంగా లక్కీ డిప్ ద్వారా 5 కిలోల లడ్డూ ప్రసాదాన్ని అనంతానంద యాత్రా దర్శని ( ఏ వై డి ) సంస్థ దక్కించుకుంది. సంస్థ ప్రతినిధులు ఈ ప్రసాదాన్ని స్వీకరించారు.అలాగే ₹100 లక్కీ డిప్ ద్వారా లడ్డూ ప్రసాదాన్ని పొందిన విజేతగా కాసం సాంబమూర్తి వస్త్రాలయం సంస్థ వారు ఎంపికయ్యారు. లడ్డూ ప్రసాదం వేలంపాట, లక్కీ డిప్ కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని పొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా భక్తుల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది.ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ, శ్రీ శ్వేతార్క గణపతి స్వామివారి ప్రసాదాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీకరించడం ఆనందంగా ఉందని, వేలంపాట ద్వారా స్వామి వారికి సమర్పించిన కానుకలు దేవాలయ అభివృద్ధికి వినియోగించడం జరుగుతుందని అలాగే పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# జాతీయస్థాయిలో జోగులాంబ గద్వాల జిల్లా ఖ్యాతి

**- ఉత్తమ నీటి నిర్వహణపై ప్రసంగించడం గొప్ప అవకాశం**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**- కలెక్టర్ ను సన్మానించిన అధికార యంత్రాంగం**



గద్వాల సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఉత్తమ నీటి నిర్వహణపై ఢిల్లీలో తనకు ప్రసంగించే అవకాశం లభించడంతో జాతీయస్థాయిలో జోగులాంబ గద్వాల జిల్లా ఖ్యాతి ఇనుమడించిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఈ నెల 20-26వ తేదీ వరకు కేంద్ర జల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఇంటర్నేషనల్ వాటర్ వీక్ లో ఈనెల 24న కలెక్టర్ పాల్గొని వచ్చిన నేపథ్యంలో శుక్రవారం జిల్లా అధికార యంత్రాంగం తరపున పలువురు అధికారులు ఐడిఓసి లోని చాంబర్ లో జిల్లా కలెక్టర్ ను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి వనరులను సంరక్షించుకునేందుకు ప్రణాళికలు రూపొందించడమే కాక వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసినప్పుడే అనుకున్న ఫలితాలు వస్తాయన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున ఉన్న నీటి వనరులను కాపాడుకునేందుకు ప్రజల భాగస్వామ్యంతో చిత్తశుద్ధితో పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, డిపిఓ శ్రీకాంత్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం, డిఐఈఓ హృదయ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

**-అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ ఎల్డర్ గైడ్ అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ**

**-కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25(విజన్ ఆంధ్ర) వయోవృద్ధుల సంరక్షణ, భద్రత, సంక్షేమం, చట్టబద్ధమైన హక్కులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించు కుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వయోవృద్ధుల సంక్షేమ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించిన పోస్టర్లు, 'ఎల్డర్ గైడ్' పోస్టర్లను కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వృద్ధులను గౌరవంగా చూసుకోవడం, వారి అవసరాలను గుర్తించి తగిన సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు, సంరక్షణ, భద్రతపై ప్రజలకు అవగాహన పెంచేందుకు వారోత్సవాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వృద్ధులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, సేవలు, సంక్షేమ కార్యక్రమాలపై సమాచారం అందించడంలో 'ఎల్డర్ గైడ్' ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ రాజయ్య, పెద్దపల్లి టాస్క్ అధికారి కౌసల్య , ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ స్వర్ణలత, సీనియర్ సిటిజన్ కమిటీ మెంబర్ జీవన్ రాజు, సుల్తానాబాద్ ఓల్డ్ ఏజ్ హోం అధ్యక్షులు సతీష్ ఆఫీస్ సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ వనం భాస్కర్ కు ఘన నివాళి అర్పించిన జర్నలిస్టులు.



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 ( విజన్ ఆంధ్ర ) : అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ వనం భాస్కర్ మృతదేహానికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, పలువురు జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.వనం భాస్కర్ కుటుంబానికి ప్రెస్ క్లబ్ నుండి 25,000/- రూపాయలు సాయం అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో కూడా ఆ కుటుంబానికి క్లబ్ నుండి 20వేల ఆర్థిక సాయం అందించడం జరిగింది.భాస్కర్ మృతి దురదృష్టకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. నివాళులర్పించిన వారిలో ( టి యు డబ్ల్యూ జె )143 వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొరుకొప్పుల నరేందర్, టి యు డబ్ల్యూ జె ఐ జె యు వరంగల్ జిల్లా కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, ప్రెస్ క్లబ్ ఈసీ సభ్యులు ఎండీ నయీంపాషా, కమటం వేణు గోపాల్, సీనియర్ జర్నలిస్టులు దాసరి శ్రీనివాస్, అడుప మహేష్, జన్ను స్వామి, కందుల శ్రీధర్, పెరుమాండ్ల మధు, బండి రవి, మోహన్, చినబాబు, నీలం శివ, ఉమాశంకర్, పాషా, అక్రం, రాజేశ్, శ్యాం, గంగరాజు, కృష్ణాకర్, సాయి, తదితరులు ఉన్నారు.

# సంక్షేమ ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు

*హెడ్ కానిస్టేబుల్ శ్యామప్ప కుటుంబ సభ్యులకు కార్పస్ ఫండ్ చెక్కులు అందజేసిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు*




గద్వాల సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో) : హార్ట్ స్ట్రోక్ కారణంగా తేది.22.12.2020 న మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ శ్యామప్ప కుటుంబ సభ్యులకు కార్పస్ ఫండ్ కింద జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు శుక్రవారం చెక్కులను అందజేశారు. శ్యామప్ప కుటుంబానికి కార్పస్ ఫండ్ ద్వారా అందాల్సిన ఆర్థిక సహాయంలో భాగంగా, గత నెలలో రెండో భార్య మనోర, కుమారుడు తేజ లకు ఒక్కొక్కరికి రూ.12,450/- చొప్పున రెండు చెక్కులు అందజేయగా, ప్రస్తుతం మొదటి భార్య కుమారుడు పి.కె. శ్రీకర్, శ్యామప్ప తల్లి నాగమ్మలకు జిల్లా ఎస్పీ ఒక్కొక్కరికి రూ.12,450/- చొప్పున చెక్కులను అందజేశారు. కుటుంబ సభ్యులకు కార్పస్ ఫండ్ కింద నాలుగు చెక్కుల మొత్తం రూ.48,000 అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. మృతిచెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ద్వారా అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారికి అందాల్సిన మిగిలిన ప్రయోజనాలు కూడా త్వరితగతిన అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల పోలీస్ శాఖ నిరంతరం బాధ్యతతో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో సాయి కృష్ణ, కార్యాలయ సూపర్డెంట్ నాగమణి, జూనియర్ అసిటెంట్ గాయత్రీ, శ్యామప్ప కుటుంబ సభ్యులు పి.కె. శ్రీకర్, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భూ సంబంధ దరఖాస్తులను పరిష్కరించాలి

**- రీ సర్వే పనులు వేగవంతం చేయాలి**

**- జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో వేబెక్స్ ద్వారా సమావేశం**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో) : భూ సంబంధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.రీ సర్వే, భూభారతి, సాదా బైనామా, తదితర రెవెన్యూ అంశాలపై శుక్రవారం జిల్లా కలెక్టర్ అన్ని మండలాల తహసిల్దార్లతో కలెక్టరేట్లోని తన ఛాంబర్ నుంచి వేబెక్స్ ద్వారా సమావేశమై మాట్లాడారు. రెవిన్యూ అంశాలపై చర్చించడానికి ఈ నెల 28న వనపర్తి లో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వస్తున్న నేపథ్యంలో జిల్లాకు సంబంధించిన సమగ్ర రెవెన్యూ సమాచారంతో హాజరు కావాలన్నారు. భూభారతి, సాదా బైనామా, తదితర దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలన్నారు. తిరస్కరించబడ్డ దరఖాస్తులకు తగిన కారణాలు చెబుతూ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రీ సర్వే పనులు వేగవంతం చేయాలని, లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు తొమ్మిది గ్రామాల్లో రిసర్వే పనులు ప్రారంభించగా, రెండు గ్రామాల్లో మాత్రమే సర్వే పూర్తయిందని మిగిలిన గ్రామాల్లోనూ ప్రక్రియ పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, సర్వే ఏడి నూకరాజు, ఆయా మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలి

**- హౌసింగ్ ఏఈ వంశీ**



అయిజ సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించుకోవాలని హౌసింగ్ ఏఈ వంశీ లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను ఏఈ పరిశీలించి నిబంధనలపై పలు సూచనలు చేశారు. నిర్మించుకుంటున్న బేస్‌మెంట్ విస్తీర్ణం, స్లాబ్ విస్తీర్ణం పరిమితులను తప్పనిసరిగా పాటించాలన్నారు. లబ్ధిదారులపై అదనపు ఆర్థిక భారం పడకుండా, ప్రభుత్వం నిర్దేశించిన పరిమితుల్లోనే ఇళ్ల నిర్మాణం చేపట్టే విధంగా ఈ సూచనలు చేసిందని ఆయన తెలిపారు. లబ్ధిదారుడు ఎంత బేస్‌మెంట్ విస్తీర్ణాన్ని నిర్మిస్తే, ఆ బేస్‌మెంట్ విస్తీర్ణానికి 25% అదనంగా మాత్రమే స్లాబ్ విస్తీర్ణాన్ని నిర్మించాలని పేర్కొన్నారు. స్లాబ్ విస్తీర్ణం బేస్‌మెంట్ విస్తీర్ణం కంటే గరిష్టంగా 25% మాత్రమే ఎక్కువగా ఉండాలని, అంతకంటే ఎక్కువ స్లాబ్ విస్తీర్ణం నిర్మించరాదని సూచించారు. 400 చ.అ. బేస్‌మెంట్ విస్తీర్ణం ఉంటే, గరిష్ట స్లాబ్ విస్తీర్ణం 500 చ.అ. ఉండాలని, 500 చ.అ. బేస్‌మెంట్ విస్తీర్ణం ఉంటే గరిష్ట స్లాబ్ విస్తీర్ణం 625 చ.అ, 600 చ.అ. బేస్‌మెంట్ విస్తీర్ణం ఉంటే గరిష్ట స్లాబ్ విస్తీర్ణం 750 చ.అ మాత్రమే ఉండాలన్నారు. అనుమతించబడిన పరిమితికి మించి స్లాబ్ విస్తీర్ణం నిర్మించినట్లయితే, సంబంధిత స్లాబ్ దశ బిల్, తదుపరి దశల బిల్లులు నిబంధనల ప్రకారం తిరస్కరించబడటంతో పాటు, మంజూరు రద్దు చేసే చర్యలు తీసుకోబడతాయని సూచించారు. స్లాబ్ వేసిన తర్వాత అదనపు పిల్లర్లు, అనధికార నిర్మాణం, అలాగే స్లాబ్ వేసిన అనంతరం అదనంగా పిల్లర్లు/కాలమ్స్ ఏర్పాటు చేసి ఇంటి విస్తీర్ణాన్ని పెంచడం అనధికార నిర్మాణంగా పరిగణించబడుతుందన్నారు. లబ్ధిదారులపై అదనపు ఆర్థిక భారం పడకుండా చూడడం, వారి సొంత డబ్బును బాధ్యతాయుతంగా వినియోగించుకునేలా చేయడం జరుగుతుందన్నారు. ప్రతి లబ్ధిదారుడు తన ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం నిర్దేశించిన పరిమితుల్లోనే ఇంటి నిర్మాణాన్ని చేపట్టాలని కోరడమైనది. ఇప్పటికే ఇల్లు మంజూరైనప్పటికీ ఇంకా నిర్మాణ పనులు ప్రారంభకాని ఇండ్లను సకాలంలో ప్రారంభించాలని, లేని ఎడల ఇండ్లను రద్దు చేస్తామన్నారు.

# ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా

**- గుంటిపల్లి పాఠశాలలో 100 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు.**




గద్వాల సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. సంధ్యా కిరణ్మయి ఆధ్వర్యంలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగ గద్వాల్ మండలం గుంటిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఉప్పేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యాధికారి డా. పి. రవికుమార్ విద్యార్థులకు రక్త పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 100 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించగ, హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగ ఉన్న విద్యార్థులకు అవసరమైన మాత్రలు అందజేశారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు. అలాగే చేతులు శుభ్రంగ కడుక్కోవడం, హ్యాండ్‌వాష్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి అవసరమైన తదుపరి వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఎన్. కృపయ్య, గ్రామ సర్పంచ్ శివకుమార్, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం.లు, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సోమిని గ్రామ రోడ్డు అధ్వాన్నం.. బురదమయం



బెజ్జూరు, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర): బెజ్జూరు మండలం సోమిని గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారి వర్షాలకు బురదమయంగా తయారైంది. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులు ఈ రహదారిపై ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు బురదలో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డు మరింత అధ్వాన్నంగా మారుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం గత ప్రభుత్వ హయాంలోనే సోమిని గ్రామ రహదారి నిర్మాణానికి మంజూరు జరిగినప్పటికీ అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో గెలిచిన ఆరు నెలల్లో రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే ఎన్నికలు జరిగి మూడు సంవత్సరాలు గడుస్తున్నా రోడ్డు సమస్య పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పరిస్థితిపై చిన్నారులు బురదలో నడుస్తున్న ఫొటోలను 'ఇది మా సోమిని రోడ్డు పరిస్థితి' అంటూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి సమస్యను పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అటవీ శాఖ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు. కనీసం తాత్కాలికంగా గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పాఠశాల విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కాగజ్‌నగర్ పట్టణంలో అధ్వానంగా రహదారి పట్టించుకోని అధికారులు



కాగజ్‌నగర్, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాలు కురవడంతో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారింది. గుంతలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతల్లో జారి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. పట్టణంలోని ప్రధాన కూడలిలోనే రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వినాయక నిమజ్జనం సందర్భంగా ఈ మార్గంలో రాకపోకలు అధికంగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ గుంతలను పూడ్చి రహదారిని సౌకర్యవంతంగా మార్చలేదని పలువురు సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. నిమజ్జనానికి తరలివచ్చే భక్తులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వర్షాలు పడిన ప్రతిసారి రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చి రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# భారతమాతకు వందేమాతరం సమర్పణ కాగజ్‌నగర్‌లో ఘనంగా 'నమామి భారత్' వేడుకలు







కాగజ్‌నగర్, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర): వందేమాతరం గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ సూచన మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన 'నమామి భారత్' కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్‌లో సామూహిక వందేమాతరం ఆలాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకే రోజు.. ఒకే సమయం ఉదయం 11 గంటలకు.. ఒకే స్వరం, ఒకే లయగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. శ్రీ సరస్వతి శిశు మందిర్ ద్వారకానగర్ఆదర్శనగర్ ఆధ్వర్యంలో సుప్రభాత్ పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. ఫాతిమా కాన్వెంట్, ఏకలవ్య స్కూల్, శ్రీ విశ్వశాంతి, అరుణోదయ, డీఏవీ, సెయింట్ క్లారిటీ, కేజీబీవీ, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, ఎంజేపీ గర్ల్స్, టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ గర్ల్స్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డా. కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొని వందేమాతరం గీతం విశిష్టతను వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో కోట్లాది మంది భారతీయుల్లో దేశభక్తి, సమైక్యతా స్ఫూర్తిని రగిలించిన అమర గీతం వందేమాతరం అని అన్నారు. 150 ఏళ్లు పూర్తయినా ఈ గీతం నేటికీ ప్రతి భారతీయుడి గుండెల్లో మాతృభూమి పట్ల భక్తి, గర్వాన్ని నింపుతోందన్నారు. నేటి యువత, విద్యార్థులు జాతీయ భావాలను, ఉన్నతమైన సాంస్కృతిక విలువలను పెంపొందించుకోవడమే మాతృభూమికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతీ శిశు మందిరాల జిల్లా అధ్యక్షురాలు, కాగజ్‌నగర్ పట్టణ వైస్ చైర్మన్ డా. కొత్తపల్లి అనిత, ఆదర్శనగర్ పాఠశాల కార్యదర్శి ఇందూరి వెంకటేశం, కోశాధికారి రాపెల్లి సదానందం, ప్రధానాచార్యులు నేరెళ్ల శ్రీవాణి, సుప్రభాత్ పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహ, స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్, వివిధ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దేశ ప్రజలను ఒక తాటిపైకి తెచ్చిన గీతం వందేమాతరం..


**- బిజెపి జిల్లా యువ నాయకురాలు డికె.. స్నిగ్ధ రెడ్డి**




గద్వాల సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో) : వందేమాతరం జాతీయ గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గద్వాల పట్టణంలోని స్వకులశాలి ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా యువ నాయకురాలు డికె.స్నిగ్ధ రెడ్డి పాల్గొని వందేమాతరం గీతం ప్రాధాన్యతను వివరించారు. దేశ ప్రజల్లో జాతీయ భావాన్ని, దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించడంలో వందేమాతరం గీతం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.దేశ ప్రజలను ఒకే తాటిపైకి తీసుకువచ్చిన గొప్ప జాతీయ గీతంగా వందేమాతరం నిలిచిందని అన్నారు.ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో వందేమాతరం గీతం అధికారిక రూపాన్ని సామూహికంగా ఆలపించే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు.యువతలో దేశభక్తి భావనను మరింత బలపరచడం, జాతీయ గీతానికి గౌరవం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వందేమాతరం స్ఫూర్తిని గౌరవిస్తూ దేశ ఐక్యత, సమగ్రత కోసం కృషి చేయాలని డీకే. స్నిగ్ధ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు,అర్ఎస్ఎస్.జిల్లా సంఘ్ చాలక్ గోపాల్ రావ్ ఎక్కోటే, ధర్మ ప్రసార సమితి అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్కోటే, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, బిజెపి సీనియర్ నాయకులు మీర్జా పురం వెంకటేశ్వర రెడ్డి పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

# బోడుప్పల్‌లో చెన్నై షాపింగ్ మాల్ ఫెస్టివల్ సేల్

**ప్రముఖ సినీ నటి ఎబ్బా పటేల్ చేతుల మీదుగా ఎగ్జిబిషన్ ప్రారంభం**




బోడుప్పల్, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): మేడ్చల్ జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని కేశవనగర్ అక్షయ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన చెన్నై షాపింగ్ మాల్ ఫెస్టివల్ సేల్ ఎగ్జిబిషన్‌ను ప్రముఖ సినీ నటి ఎబ్బా పటేల్ శుక్రవారం ప్రారంభించారు.ఆమె చేతుల మీదుగా ఎగ్జిబిషన్ ప్రారంభం కావడంతో అభిమానులు,సందర్శకుల్లో సందడి నెలకొంది.అనంతరం ఎబ్బా పటేల్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న దుస్తులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒకే చోట కుటుంబ సభ్యులందరికీ అవసరమైన వివిధ రకాల దుస్తులు అందుబాటులో ఉండటం వినియోగదారులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ఫెస్టివల్ సేల్‌లో ఆకర్షణీయమైన దుస్తులను అందుబాటు ధరల్లో అందిస్తున్నారని తెలిపారు.బోడుప్పల్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎగ్జిబిషన్‌ను సందర్శించి తమకు నచ్చిన దుస్తులను కొనుగోలు చేయాలని ఎబ్బా పటేల్ సూచించారు. అన్ని వర్గాల వారికి దుస్తులు నిర్వాహకులు మాట్లాడుతూ.. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా మహిళలు, పురుషులు, చిన్నారులకు సంబంధించిన వివిధ రకాల దుస్తులను ఒకే చోట అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కలెక్షన్లతో పాటు ఆకర్షణీయమైన ధరల్లో విక్రయాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ ఫెస్టివల్ సేల్ సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 19 వరకు కొనసాగుతుందని, ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. బోడుప్పల్, కేశవనగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎగ్జిబిషన్‌ను సందర్శించి సేల్‌ను వినియోగించుకోవాలని కోరారు.

# పాఠ్య ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు

కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 25(విజన్ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని కామారెడ్డి 14వ వార్డు కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత పేర్కొన్నారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ ప్రైమరి స్కూల్ లో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూజ్ అందించారు. విద్యార్థుల సంక్షేమమే రేవంత్ సర్కార్ ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను సద్వినియోగం చేసుకొని మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకొని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎన్జీవోస్ కాలనీ ప్రైమరి స్కూల్ లో 140మంది విద్యార్థులకు దుస్తువులు, షూజ్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం శ్రీనివాస్, రజిత, శైలజ, గీత, నీరజలు పాల్గొన్నారు.

# ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు గద్వాల మండలం పరిధిలోని గద్వాల టౌన్ రామ్ నగర్ చెందిన మాల వేణుగోపాల్ కూతురు తేజస్విని ఎంబిబిఎస్ లో సీటు సాధించిన సందర్భంగా గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించి హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూవైద్యరంగంలో మెరుగైన శిక్షణ పొంది గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు.ఎంబిబిఎస్ లో సీటు సాధించిన విద్యార్థిని భవిష్యత్తులో మంచిగా చదువుకొని మీ తల్లిదండ్రులకు, మీ ఉపాధ్యాయులకు, మీ గ్రామానికి, గద్వాల నియోజకవర్గానికి మంచి పేరు ప్రతిష్టలు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. వీరిని ఆదర్శంగా తీసుకొని గద్వాల నియోజకవర్గంలో గద్వాల మండలంలో మరి కొంతమంది విద్యార్థులు వైద్యరంగంతో పాటు వివిధ రంగాలలో కూడా రాణించాలని, ప్రతి ఒక్కరు మంచిగా చదువుకున్నప్పుడే మీరు నిర్ణయించుకున్న భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని లక్ష్యం నెరవేరుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంఘం నరసింహులు, మాల శ్రీనివాసులు, రామాంజనేయులు, ఆంజనేయులు, కిట్టు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# దేశ రక్షణ ప్రధాని మోదికి మాత్రమే సాధ్యం

**- బీజేపీ పట్టణ ఇంచార్జ్ ఎల్ది మల్లయ్య గౌడ్.**




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర): భారత దేశ రక్షణ సంరక్షణ సంక్షేమం ప్రధాని నరేంద్ర మోదికి మాత్రమే సాధ్యమని మానుకోట పట్టణ బీజేపీ పార్టీ ఇంచార్జి ఎల్ది మల్లయ్య గౌడ్ అన్నారు.శుక్రవారం స్థానిక ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూఆదర్శ పురుషుడు ,అభీనవ రాముడు మోది దేశ అభివృద్ధి,సంక్షేమం రెండు కళ్లుగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు.ఉగ్రవాద దేశాల నుండి భారత్ కంటికి రెప్పలా కాపాడుతూ,ప్రజలను కన్న బిడ్డల్ల రక్షించే నాయకుడు ఉండడం మన అదృష్టం అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముల్లంగి ప్రతాప్ రెడ్డి,రేష్మా,కౌన్సిలర్ శ్రీ దేవిబాలునాయక్,పట్టణ ప్రధానకార్యదర్శి రవినాయక్,ఉపాధ్యక్షుడు పెద్దబోయిన రవియాదవ్ ,చుక్కల నరేష్, శ్యాం,మల్లం యశ్వంత్ పాల్గొన్నారు

# డైసన్ వి-16 పిస్టన్ యానిమల్ వాక్యూమ్ క్లీనర్ విడుదల



హైదరాబాద్, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర) : డైసన్ సంస్థ కొత్త వి-16 పిస్టన్ యానిమల్ కార్డ్‌లెస్ వాక్యూమ్ క్లీనర్ను భారత్‌లో విడుదల చేసినట్లు డైసన్ ఫ్లోర్‌కేర్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ అసఫ్ ఓయ్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ రూ.79,900 ధర కలిగిన ఈ మోడల్‌లో ఆల్ ఫ్లోర్ కోన్స్ సెన్స్ క్లీనర్ హెడ్, యాంటీ-ట్యాంగిల్ టెక్నాలజీ, క్లీన్‌కాంపాక్టర్ డస్ట్‌బిన్ ఉన్నాయన్నారు. కొత్త హైపర్‌డైమియం 900డబ్ల్యూ మోటార్ 315ఏడబ్ల్యూ వరకు సక్షన్ పవర్‌ను అందిస్తుందని తెలిపారు. డ్యూయల్ కోనికల్ బ్రష్ బార్, సెన్సర్లు, స్మార్ట్ బ్రష్ టెక్నాలజీతో ఫ్లోర్ రకాన్ని గుర్తించి క్లీనింగ్ పవర్‌ను ఆటోమేటిక్‌గా సర్దుబాటు చేస్తుందని తెలిపారు. మైడైసన్ యాప్ కనెక్టివిటీ, క్రెవిస్ టూల్, హెయిర్ స్క్రూ టూల్ 2.0 కూడా ఇందులో ఉన్నాయని తెలిపారు. డైసన్.ఇన్ వెబ్‌సైట్‌తో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న డైసన్ స్టోర్లలో ఇది అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

**- నిర్వాహకులపై కేసు నమోదు సీఐ శ్రీధర్**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 25 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు హుస్నాబాద్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ ఎస్ఐ పి.లక్ష్మా రెడ్డి, అక్కన్నపేట ఎస్ఐ సిఎచ్ . ప్రశాంత్ మరియు సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వ్యభిచార కార్యకలాపాలకు సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించి, చట్టప్రకారం చర్యలు చేపట్టారు.వ్యభిచార కార్యకలాపాలను నిర్వహించిన నిర్వాహకులు కంసాని ఐశ్వర్య, కంసాని శ్రీధర్, కంసాని రమేష్, కంసాని సుజాత మరియు ముగ్గురు కస్టమర్లపై ఇమ్మోరల్ ట్రాఫిక్ ఆక్ట్ ద్వారా సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనైనదని తెలిపారు.ప్రత్యేకంగా, బ్రోతల్‌ను నిర్వహించడం/మేనేజ్ చేయడం, వ్యక్తులను వ్యభిచారంలోకి ప్రలోభపెట్టడం లేదా తీసుకురావడం వంటి చర్యలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. చట్టంలోని నిర్దిష్ట పరిస్థితుల్లో కస్టమర్లపై కూడా సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోబడుతుందన్నారు.

# హైదరాబాద్‌లో నకిలీ వైద్యుడి అరెస్ట్.. లైంగిక సమస్యలకు కూడా వైద్యం!

**- గోల్కొండలో నకిలీ వైద్యుడిని అరెస్ట్ చేసిన పోలీసులు**
**- ఇంటర్ అర్హతతోనే రోగులకు వైద్యం అందిస్తున్న వైనం**
**- తల్లి, సోదరుడితో కలిసి క్లినిక్ నిర్వహిస్తున్న యువకుడు**
**- లేబుల్స్ లేని మందులు ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం**
**- సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ అమాయకులను ఆకర్షిస్తున్నట్లు గుర్తింపు**



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని గోల్కొండలో వైద్య విద్యార్హత లేకుండా క్లినిక్ నిర్వహిస్తూ, నకిలీ డాక్టర్‌గా చలామణి అవుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంటర్మీడియట్ మాత్రమే చదివిన 23 ఏళ్ల అద్నాన్, తన కుటుంబ సభ్యులతో కలిసి అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు తమ కథనంలో వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. గోల్కొండ ప్రాంతంలో అద్నాన్ అనే యువకుడు 'హిక్మా సెహత్ కేర్ సెంటర్' పేరుతో ఓ క్లినిక్‌ను నడుపుతున్నాడు. కేవలం ఇంటర్ (2018-2020) మాత్రమే పూర్తి చేసిన ఇతను, తన తల్లి సబా ఖాన్ (అలియాస్ మహమ్మది బేగం), సోదరుడు మహ్మద్ ఫైజాన్‌తో కలిసి తమను తాము వంశపారంపర్య హకీంలుగా (సాంప్రదాయ వైద్యులు) పరిచయం చేసుకున్నారు. లైంగిక సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు, ఛాతీ నొప్పి, కిడ్నీ సంబంధిత నొప్పులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు వీరు చికిత్స అందిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. రోగులకు ప్రిస్క్రిప్షన్లు ఇవ్వడమే కాకుండా, ఎలాంటి లేబుల్స్ లేని, కేవలం మార్కర్‌తో కోడ్‌లు రాసిన మందులను ఇస్తూ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారని పోలీసులు తెలిపారు. విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. అద్నాన్ 2023లో బీయూఎంఎస్ (యునాని) పూర్తి చేసిన డాక్టర్ మునార్వా బేగంతో పరిచయం పెంచుకున్నాడు. ఆమెకు నెలకు రూ.13,000 చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకుని, ఆమె పేరు మీద క్లినిక్‌ను నడపడం ప్రారంభించాడు. డాక్టర్ మునార్వా బేగం అప్పుడప్పుడు మాత్రమే క్లినిక్‌కు వచ్చి వెళ్తుండగా, అద్నాన్, అతని కుటుంబ సభ్యులే పూర్తిస్థాయిలో రోగులకు చికిత్స చేసేవారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, 'సాచ్ న్యూస్' వంటి మాధ్యమాల్లో తమ క్లినిక్‌కు విపరీతంగా ప్రచారం చేసుకుంటూ అమాయకులను ఆకర్షించేవారని పోలీసులు వివరించారు. క్లినిక్‌పై దాడి చేసిన పోలీసులు, పెద్ద మొత్తంలో లేబుల్స్ లేని మందుల పొట్లాలు, బాటిళ్లు, ప్రిస్క్రిప్షన్ పుస్తకాలు, ఫేస్‌బుక్ పేజీకి సంబంధించిన మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అద్నాన్‌ను అరెస్ట్ చేయగా, అతని తల్లి సబా ఖాన్, సోదరుడు ఫైజాన్ పరారీలో ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. వారి కోసం గాలిస్తున్నామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# రూ.39 లక్షలకు బాలాపూర్ లడ్డూ..

**- ముగిసిన బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం**
**- దక్కించుకున్న సామ ప్రణీత్ రెడ్డి**
**- ఈసారి వేలంలో 9 మంది**
**- పోటాపోటీగా పెరిగిన బిడ్లు**
**- లడ్డూను దక్కించుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయనే నమ్మకం**



హైదరాబాద్ : వినాయక ఉత్సవాల్లో ఎంతో ప్రత్యేకమైన బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం పాట ముగిసింది. ఈసారి లడ్డూకు భారీ ధర పలికింది. సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి రూ.39 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. దీంతో బాలాపూర్ లడ్డూ వేలంలో కొత్త రికార్డు నమోదైంది. ప్రతి ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంపై భక్తుల్లో భారీ ఆసక్తి ఉంటుంది. ఈసారి కూడా లడ్డూను దక్కించుకునేందుకు 9 మంది భక్తులు వేలంలో పాల్గొన్నారు. ఒకరిని మించి మరొకరు బిడ్ పెంచడంతో వేలం ఉత్కంఠగా సాగింది. చివరికి రూ.39 లక్షల వద్ద సామ ప్రణీత్ రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు. లడ్డూను దక్కించుకున్న ప్రణీత్ రెడ్డిని ఉత్సవ నిర్వాహకులు, తోటి భక్తులు అభినందించారు. బాలాపూర్ గణేశుడి లడ్డూను దక్కించుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. దీంతో ప్రతి ఏడాది ఈ లడ్డూకు వేలంలో భారీ పోటీ నెలకొంటోంది.

# చెత్త వేస్తే జరిమానా.. కేసు తప్పదు!

**- రోడ్డుపై చెత్త వేసిన దంపతులకు రూ.500 జరిమానా**
**- వేసిన చెత్తను వారితోనే తొలగింపజేసిన జీడిమెట్ల సర్కిల్ అధికారులు**
**- ప్రతిరోజూ ఉదయం పారిశుద్ధ్యంపై డీసీ శంకర్ సింగ్ క్షేత్రస్థాయి పర్యవేక్షణ**



ప్రజా సమస్యలపై ఆరా.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 25 (విజన్ ఆంధ్ర): రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేసే వారిపై కుత్బుల్లాపూర్ జోన్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.



పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం సమీపంలోని రాయల్ వైన్స్ రహదారిపై చెత్త వేస్తున్న దంపతులను అధికారులు గుర్తించారు. వారు రోడ్డుపై వేసిన చెత్తను వారితోనే తొలగింపజేసి, రూ.500 జరిమానా విధించారు.

**ఉదయమే క్షేత్రస్థాయిలో డీసీ పర్యటన**

జీడిమెట్ల సర్కిల్-55 డిప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్ ప్రతిరోజూ ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య, పరిశుభ్రత పనులను స్వయంగా పరిశీలిస్తున్నారు. రహదారులు, కాలనీలు, ప్రధాన కూడళ్లలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించడంతోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. సమస్యలను గుర్తించిన వెంటనే సంబంధిత సిబ్బందికి సూచనలు చేస్తూ పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు.

**'పరిశుభ్రత అందరి బాధ్యత'**

ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రోడ్లపై చెత్త వేయడం వల్ల పారిశుద్ధ్య సమస్యలు తలెత్తడంతోపాటు ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. చెత్తను రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన వాతావరణాన్ని సాధించగలమని పేర్కొన్నారు.

**'నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు'**

రోడ్లపై చెత్త వేస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేసే వారిపై ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించడంతోపాటు, అవసరమైతే పోలీస్ కేసులు కూడా నమోదు చేస్తామని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారని తెలిపారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికీ ప్రాధాన్యం**

పారిశుద్ధ్య పనుల పరిశీలనకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి పర్యటనల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను డీసీ శంకర్ సింగ్ తెలుసుకుంటున్నారు. స్థానికుల నుంచి సమస్యలను నేరుగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులకు సూచనలు చేస్తున్నారు. జీడిమెట్ల సర్కిల్ పరిధిలో పరిశుభ్రత, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# మెదక్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం

**హాజరు కానున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు**







**సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 24:-**

మెదక్ లో నిర్మించిన అధునాతన కిచెన్ షెడ్ తో పాటు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్ పథకాన్ని శనివారం ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం చేశారు. మెదక్ మార్కెట్ యార్డులో రూ 5 కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను మంత్రి వివేక్ వెంకట స్వామి, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్ రావు తో పాటు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌడేషన్ సభ్యులు హాజరు కానున్నారు. తెలంగాణ ప్రభుత్వం స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించింది.







ఈ కార్యక్రమానికి లభించిన విశేష స్పందనతో మధిర, మంథని, మంచిర్యాల, కరీంనగర్ ప్రాంతాల్లో కూడా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. ఈ విజయవంతమైన కార్యక్రమాన్ని మరింత విస్తరించే చర్యల్లో భాగంగా మెదక్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను సిద్ధం చేశారు. ఈ కిచెన్ ద్వారా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని దాదాపు 11 మండలాల పరిధిలో 395 ప్రభుత్వ పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 29,183 మంది విద్యార్థులకు ప్రతిరోజూ రుచికరమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని అందించనున్నారు. విద్యార్థులకు సమతుల్యమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సహకారంతో మెనూను రూపొందించారు. ప్రతిరోజూ వివిధ రకాల అల్పాహారాన్ని అందించడంతో పాటు, విద్యార్థులకు రోజు విడిచి రోజు వేడి పాలను కూడా అందించనున్నారు. ఉదయం పూట పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, ఏకాగ్రత, పాఠశాల హాజరు మెరుగుపడేలా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయనున్నారు. విద్యార్థులు ఆకలితో పాఠశాలకు రాకుండా, ఆరోగ్యకరమైన అల్పాహారంతో ఉత్సాహంగా చదువుపై దృష్టి సారించేలా చేయడమే ప్రభుత్వ హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌడేషన్ ఉద్దేశ్యంగా తెలిపారు.

## హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం..

***ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి***

- **హైదరాబాద్ గచ్చిబౌలిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు**
- **ఆయన జయంతి సందర్భంగా శనివారం ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి**
- **మన్మోహన్ సింగ్ దేశానికి, తెలంగాణకు చేసిన సేవలను స్మరించుకున్న మంత్రి పొన్నం**
- **ఆయన నాయకత్వంలోనే ఉపాధి హామీ, ఆర్టీఐ వంటి చట్టాలు వచ్చాయని వెల్లడి**
- **తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ పాత్ర చారిత్రాత్మకమని కొనియాడిన ప్రభుత్వం**



హైదరాబాద్ 25 (విజన్ ఆంధ్ర)

మాజీ ప్రధానమంత్రి, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. నగరంలోని ఐటీ కారిడార్ అయిన గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం (సెప్టెంబరు 26) ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ విగ్రహం కేవలం ఒక స్మారక చిహ్నం కాదని, దేశ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ పోషించిన పాత్ర, ఆయన ఆర్థిక దార్శనికత, నిస్వార్థ ప్రజాసేవ, నిరాడంబర నాయకత్వ లక్షణాలను భవిష్యత్ తరాలకు గుర్తుచేసే ఒక శాశ్వత ప్రతీక అని ఆయన అభివర్ణించారు. మన్మోహన్ సింగ్ పేరు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పొన్నం కొనియాడారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన ప్రారంభించిన సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు బాటలు వేశాయని గుర్తుచేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆర్థిక స్థిరత్వం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన హయాంలోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం వంటివి అమల్లోకి వచ్చాయని తెలిపారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. 2009లో ప్రక్రియ ప్రారంభించాలని నాటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం నుంచి 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు కేంద్రంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక పాత్ర పోషించిందని ఆయన వివరించారు. రాష్ట్ర ఏర్పాటులో యూపీఏ ప్రభుత్వం, మన్మోహన్ సింగ్ పాత్రను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని ఆయన తెలిపారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ మార్గదర్శకత్వంలో ఎంపీగా పనిచేయడం తన రాజకీయ జీవితంలో గర్వకారణమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.